అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

www.navatelangana.com

శుక్రవారం 06-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 10 సంచిక : 287

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

12 పేజీలు వెల : 6.50

## పోషకాహారం పెట్టండి

**మిడ్‌డే మీల్స్ కేసులో హైకోర్టు**



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించిన ...11లో




# సొంతింటి కల నెరవేరాలి

## పేదలకు ఆత్మగౌరవం కల్పించిన ఘనత ఇందిరా గాంధీదే



- ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- నియోజకవర్గానికి 3,500 ఇండ్లు
- ఐటీడీఏ పరిధిలో గిరిజనులకు ప్రత్యేక కోటా
- ప్రతి మండలంలో మోడల్ హౌస్ నిర్మాణం
- గతంలోని ఇందిరమ్మ ఇండ్ల రుణాలు మాఫీ
- కేసీఆర్ పెద్దరికాన్ని నిలుపుకోవాలి
- ప్రతిపక్ష నేతగా సలహాలు ఇవ్వాలి
- కేటీఆర్, హరీశ్‌రావు తీరు మార్చుకోవాలి : ఇందిరమ్మ ఇండ్ల యాప్ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్ సహా ప్రతిపక్ష నేతలకు ఆహ్వానం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రతి శాసనసభ నియోజకవర్గానికీ 3,500 ఇండ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి ఇంటికీ రూ.5 లక్షలు ఇస్తున్నామన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఇండ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మ గౌరవాన్ని ఇందిరా గాంధీ కల్పించారని కొనియాడారు. ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలనీ, ఆ కల నెరవేరాలనే ఇందిరా గాంధీ ఇండ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో, కానీ ఇందిరమ్మ కాలనీ లేని ఊరు ఈ దేశంలోనే లేదని చెప్పగలనని అన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని గుర్తు చేశారు. ఇండ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఇందిరమ్మ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు కేటాయిస్తే, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అది రూ.1.25 లక్షలకు చేరిందని అన్నారు. పెరిగిన ధరల ప్రకారం ఇప్పుడు తమ ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోందని వివరించారు. ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్దిదారులకు రూ.5 లక్షలు అందజేస్తామని తెలిపారు. తొలి ఏడాది సొంత స్థలం ఉన్నవారికి ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. వికలాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుధ్య సిబ్బంది, దళితులు, గిరిజనులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యతనిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గిరిజనులకు ఇండ్లు కేటాయించారని అన్నారు. ఆ తర్వాత వారికి ఇండ్ల కేటాయింపు సక్రమంగా ...2లో

### రవాణా శాఖ సిబ్బంది సేవలు అసాధారణం

ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగుల నింపుతున్న ఉచిత బస్సు పథకం : ప్రజాపాలన - రవాణా శాఖ విజయోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 10లో.



రాహుల్ షర్ట్‌కు స్టిక్కర్ అంటిస్తున్న ప్రియాంక

## ప్రతిపక్షాల వినూత్న నిరసన

**మోడీ-అదానీ ఏక్ హై**

**ప్రింటెడ్ టీ షర్ట్‌లతో ఆందోళన**

పార్లమెంట్ పాత భవనం నుంచి కొత్త భవనం వరకు ర్యాలీ

అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** అదానీ ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం ఉభయ సభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో వినూత్న నిరసన తెలిపారు. 'మోడీ-అదానీ ఏక్ హై, అదానీ సేఫ్ హై' ప్రింటెడ్ టీ షర్ట్‌లను ధరించి ఆందోళన చేపట్టారు. 'మోడీ-అదానీ భాయ్ భాయ్' అని నినాదాలు చేస్తూ పార్లమెంట్ పాత భవన్ ముందు బైటాయించారు. ఆ తర్వాత పార్లమెంట్ పాత భవనం నుంచి పార్లమెంట్ కొత్త భవనం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం 'అదానీ ముడుపులతో ఎవరికి లాభం దక్కింది మోడీ' అని రాసి ఉన్న ప్లకార్డులతో పార్లమెంట్ ముఖ ద్వారం (మకర ద్వార్) వద్ద నిలబడి ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాలో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆర్జేడీ, ఎన్సీపీ, డీఎంకే, ఆప్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే తదితర పార్టీల నేతలు ప్లకార్డులు పట్టుకుని మోడీ సర్కార్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 'మోడీ-అదానీ ఏక్ హై, అదానీ సేఫ్ హై' ప్రింటెడ్ వైట్ టీషర్ట్‌తో సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. అదానీపై ...11లో

### ఆ ముగ్గురు చేతుల్లోనే విమానయాన రంగం

కేంద్రం ప్రభుత్వ నియంత్రణ లేదు

రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీం 2లో..

## అల్లు అర్జున్, సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు

**తొక్కిసలాటకు థియేటర్ యాజమాన్యమే కారణం**

మహిళ మృతికి కారకులపై కఠిన చర్యలు : సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్



ఫైల్

నవతెలంగాణ-ముషీరాబాద్

సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటకు సినీ హీరో అల్లు అర్జున్, థియేటర్ యాజమాన్యం, హీరో వ్యక్తిగత సిబ్బంది కారణమని, వారిపై కేసులు నమోదు చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. బుధవారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్‌కు సినీ హీరో అల్లు అర్జున్ వచ్చిన సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతిచెందిన విషయం విదితమే. ఆమె కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై గురువారం రాత్రి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ రమేష్ కుమార్‌తో కలిసి సెంట్రల్ జోన్ డీసీపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో షెడ్యూల్ వేయడంతో భారీగా అభిమానులు వచ్చారని తెలిపారు. హీరో అల్లు అర్జున్ వస్తున్నారని తెలియడంతో ప్రేక్షకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్ గేట్లను తోసుకుంటూ లోపలికి చొచ్చుకొని వెళ్లారన్నారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి(35), ఆమె కుమారుడు 13 ఏండ్ల శ్రీతేజ్ కింద పడగా.. జనం కాళ్ల మధ్య నలిగిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని తెలిపారు. వెంటనే పోలీసులు వారికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించినా.. రేవతి మృతిచెందిందని చెప్పారు. శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందిస్తున్నారని తెలిపారు. సంధ్య థియేటర్‌లో రద్దీని నివారించడానికి థియేటర్ ...10లో

## షెడ్యూల్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ



కమిషన్‌పై నమ్మకంతో పరీక్షలు రాయండి

బాధ్యతల స్వీకరణ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎప్పటికప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంతో పాటు భర్తీ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా చేపడతామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మెన్ బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ...11లో

## విధులకు ఆటంకం కలిగిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు



**బంజారాహిల్స్ పీఎస్‌కు కౌశిక్‌రెడ్డి తరలింపు**

మద్దతు ఇచ్చేందుకు వచ్చిన హరీశ్‌రావు, ఇతర నేతలు గచ్చిబౌలి పీఎస్‌కు..రాత్రి విడుదల

నేతలను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు

ప్రజా పాలన కాదు, రాక్షస పాలన : ఎమ్మెల్యే హరీశ్‌రావు వివరాలు 10లో

## ప్రజల ఆదాయంలో సగం విద్య, వైద్యానికే

**రెండు రంగాలనూ వ్యాపారమయంగా మార్చిన పాలకులు**

ఈ క్రమంలో ఎంవీఎన్ క్లినిక్‌ల లాంటివి ఎంతో అవసరం : మల్లు వెంకటనర్సింహారెడ్డి స్మారక ప్రజా వైద్యశాల 14వ వార్షికోత్సవంలో జూలకంటి రంగారెడ్డి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


పేద, మధ్య తరగతి ప్రజలు తమ సంపాదనలో సగం విద్య, వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేండ్ల నుంచి పాలకులు విద్య, వైద్యరంగాలను వ్యాపారమయం చేశారని తెలిపారు. ఈ క్రమంలో మల్లు వెంకట నర్సింహారెడ్డి స్మారక ప్రజా వైద్యశాలల (ఎంవీఎన్ఆర్ మెమోరియల్ పీపుల్స్ క్లినిక్)లాంటివి ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో నవతెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎంవీఎన్ఆర్ మెమోరియల్ పీపుల్స్ క్లినిక్ 14వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు, ఎంవీఎన్ఆర్ క్లినిక్ సలహాదారులు డాక్టర్ రమాదేవి అధ్యక్షతన సభను జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జూలకంటి ముఖ్యవక్తగా మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయ రంగం అతి పెద్ద మోసపూరిత రంగంగా మారిందని వాపోయారు. విద్య, వైద్య ...11లో



## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మన్మోహన్

**ప్రమాణ స్వీకారం చేయించిన సీజేఐ**

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న మన్మోహన్ గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ...11లో



## కొలువుదీరిన మహా సర్కార్

**సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలుగా శిండే, అజిత్ పవార్**

**ముంబయి:** మహారాష్ట్రలో 'మహాయుతి' ప్రభుత్వం కొలువుదీరింది. బీజేపీ అగ్రనేత దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. శివసేన అధినేత ఏక్‌నాథ్ శిండే, ఎన్సీపీ ...11లో

## నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్‌వీ సీ-59

**రాకెట్ ప్రయోగం విజయవంతం**




సూర్యుడి ఉపరితలం, సూర్యకిరణాలపై అధ్యయనం : ఇస్రో

**అమరావతి :** పీఎస్ఎల్‌వీ సీ-59 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.04 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించగా.. నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకువెళ్లింది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా3 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి కచ్చితంగా తీసుకువెళ్లిందని అధికారులు తెలిపారు. పీఎస్ఎల్‌వీ రాకెట్‌లోని ప్రోబా 3 మిషన్‌లోని రెండు ఉపగ్రహాలు విజయవంతంగా విడిపోయాయని ఇస్రో ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో ఈ ప్రయోగం విజయవంతమైందని వివరించింది. సూర్యుడి ఉపరితలంతో పాటు సూర్యకిరణాలను అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగం చేపట్టినట్టు ఇస్రో పేర్కొన్నది. ప్రయోగం అనంతరం శాస్త్రవేత్తలు, అధికారులు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు.

# వస్త్ర పరిశ్రమకు గడ్డుకాలమే..!

**జీఎస్టీ పెంచితే భారీగా మోత..లక్ష ఉద్యోగాలు ఊడొచ్చు : సీఎంఏఐ**




**న్యూఢిల్లీ :** కేంద్రంలోని మోడీ సర్కారు చర్యలు వస్త్ర పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోన్నాయి. రెడీమేడ్ గార్మెంట్స్‌పై పన్ను రేట్లను పెంచాలని ఇటీవల జీఎస్టీకి సంబంధించిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం)లో కీలక ప్రతిపాదన చేశారు. అదే జరిగితే.. ముఖ్యంగా, ఈ రంగంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) గడ్డుకాలాన్ని ఎదుర్కోవాల్సి రావొచ్చని ది క్లాతింగ్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఏఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జీఓఎం నూతన ప్రతిపాదనల్లో రూ.1500 లోపు వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ అమల్లో ఉంటుంది. అయితే రూ.1500 నుంచి రూ.10000 వస్త్రాలపై 18 శాతం జీఎస్టీ, రూ.10వేల పైబడిన దుస్తులపై 28 శాతం పన్నులను వసూలు చేయాలని ప్రతిపాదించింది. ఈ అధిక పన్ను రేట్ల విధానం తమ పరిశ్రమను దెబ్బతీయనుందని సీఎంఏఐ ఆందోళన వ్యక్తం చేసింది. అధిక ధరలు తయారీ,



డిమాండ్‌ను దెబ్బతీయనున్నాయని తెలిపింది. పన్ను రేట్ల పెంపునతో సంఘటిత రిటైల్ రంగానికి ప్రమాదమేనని వివరించింది. ఈ మార్పు అక్రమ వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చనుందని హెచ్చరించింది. "ఇప్పటికే టెక్స్‌టైల్ పరిశ్రమ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. నూతన పన్ను ప్రతిపాదన ఒక లక్ష ఉద్యోగాలను కోల్పోయేలా చేయనుంది. స్పిన్నింగ్, నేత, వస్త్రాల తయారీ, ఎస్ఎంఈ సంస్థల ఆదాయాలు మరింత హరించనున్నాయి. దీంతో లాభదాయకతపై ప్రభావం పడనుంది. పన్నుల పెంపు ముఖ్యంగా జీవనోపాధికి ముప్పు కలిగించనుంది." అని సీఎంఏఐ తన ప్రకటనలో ...11లో

# సొంతింటి కల నెరవేరాలి

(మొదటిపేజీ తరువాయి)

జరగలేదన్నారు. తమ ప్రభుత్వం ఐటీడీఏల పరిధిలోని నియోజకవర్గాలు, ప్రాంతాల్లోని గిరిజనుల కోసం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో ప్రత్యేక కోటా ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నల్లమల్లలోని చెంచులు, ఆదిలాబాద్‌లోని గోండులు, భద్రాచలంలోని కోయలు... ఎవరైతే తెలంగాణ మట్టి మనుషులో, తెలంగాణ మూల పురుషులో వారికి ఇందిరమ్మ ఇండ్లను ప్రత్యేకంగా కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. ఇంద్రవెల్లికి వెళ్లి తాను స్వయంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పట్టాలు అందజేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఈ నమూనానే పాటించాలని తాము సూచించడం లేదన్నారు. అదే సమయంలో తమకున్న స్థలంలో ప్రతి అంగుళాన్ని లబ్ధిదారులు వినియోగించుకునేలా ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్‌లు నిర్మిస్తామన్నారు. లబ్ధిదారులు తమ అవగాహన కోసం వాటిని చూడాలని సూచించారు. లబ్ధిదారులు తమ స్థోమతకు తగ్గట్లు అదనపు గదులు నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని సీఎం చెప్పారు.

**పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 65 వేల ఇండ్లు మాత్రమే నిర్మించింది**

పదేండ్లు (2004 నుంచి 2014 వరకు) అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 25.04 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిందని తెలిపారు. కొడుకు, కోడలు, అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారని ఇందిరమ్మ ఇండ్లను ఎన్నికల ప్రచార సభల్లో విమర్శలు గుప్పించిన కేసీఆర్ తన పదేండ్ల పాలనా కాలంలో కేవలం లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ప్రారంభించి 65 వేల ఇండ్లు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇండ్ల పూర్తికి తాము రూ.195 కోట్లు కేటాయించామని తెలిపారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేదన్నారు. కానీ ఆరు నెలల్లో ఆయన కోసం కోట లాంటి



ప్రగతి భవన్‌ను, వాస్తు కోసం సచివాలయాన్ని నిర్మించుకున్నారన్నారు. గజ్వేల్, జన్వాడల్లో ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని తెలిపారు. కేసీఆర్ తన పదవీ కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. ఆయన చెప్పినట్టు కోడి, మేక ఎక్కడ ఉండాలో చూపలేదన్నారు. కానీ కాలనీకో బెల్టు షాపు పెట్టారని విమర్శించారు. లక్ష్యం ఎంత గొప్పదైనా అమల్లో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందని చెప్పారు. పేదలకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను సైతం వినియోగిస్తున్నామని తెలిపారు. పునాది స్థాయి నుంచి స్లాబు స్థాయి వరకు ప్రతి దశలోనూ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించడమే కాకుండా శాఖకు పూర్తి స్థాయి సిబ్బందిని ఇస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం గతంలో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు.

**కేసీఆర్ అనుభవాన్ని రాష్ట్రానికి పంచాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్ర ఖజానాను కేసీఆర్‌కు అప్పగిస్తే... పదేండ్ల పాలనా కాలం తర్వాత ఆయన రూ.7 లక్షల కోట్ల అప్పుతో తమకు అప్పగించారని అన్నారు. కేసీఆర్ పాలనా కాలంలో చేసిన అప్పులు, తప్పులు సరి చేసేందుకు తమకు సమయం పడుతోందన్నారు. సీఎంగా, కేంద్రమంత్రిగా పని చేసిన కేసీఆర్ తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తు చేశారు. నాడు ఆ మంచి సంప్రదాయం ఉందన్నారు. దానిని కొనసాగించాలని సీఎం సూచించారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న హరీశ్‌రావు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారనీ, కాంగ్రెస్‌లో చేరేందుకే హరీశ్‌రావు కలిశారనే విమర్శలు నాడు వచ్చాయని గుర్తు చేశారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం రాజశేఖర్ రెడ్డిని కలిశానని ఆయన వివరణ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు అలానే కలిసి సమస్యలు విన్నవించాలని సూచించారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రులను కలిసి కొడంగల్ నియోజకవర్గానికి రూ.వందల కోట్లు తీసుకెళ్లానని సీఎం తెలిపారు. పాలక, ప్రతిపక్షాలు కలవకుండా చేసింది కేసీఆరేననీ, శత్రు దేశ సైనికుల్లా రెండు పక్షాలను కేసీఆర్ మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేసీఆర్‌లో మానసిక పరివర్తన రావాలని అన్నారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎంతగా ఉన్నా ఆ రాష్ట్ర అంశాల విషయంలో పార్టీలకు అతీతంగా వారంతా ఏకమవుతారని తెలిపారు. ఇక్కడ అలానే కావాలని అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్రంలో 17 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు సూచనలు ఇచ్చేందుకు కలిసి రావాలని కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

**నెలకు వడ్డీ రూ. 6,500 కోట్లు చెల్లిస్తున్నాం**

కేసీఆర్ పదేండ్ల పాలన కాలంలో చేసిన అప్పులకు రూ.6,500 కోట్లు నెలకు వడ్డీ కడుతున్నామని సీఎం చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగుల జీతభత్యాలకు ఎంత ఖర్చవుతుందో కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ అంత అవుతోందని తెలిపారు. తాము పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆరు నెలలు లోక్‌సభ ఎన్నికల కోడ్‌తోనే సరిపోయిందనీ, కేవలం అయిదు నెలల కాలమే తాము పాలనపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టగలిగామని చెప్పారు. ఈ అయిదు నెలల కాలంలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామనీ, పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చామని సీఎం తెలిపారు. తాము అభివృద్ధి, సంక్షేమం రెండింటి సమతూకం చేసుకుంటూ ముందుకు పోతుంటే చిన్న పిల్లల్లా కేటీఆర్, హరీశ్‌రావు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హోంవర్క్ చేయని పిల్లలు హోం వర్క్ చేసిన పిల్లాడి నోట్సు చింపివేసినట్టు, పక్కన వాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్న పిల్లల్లా హరీశ్‌రావు, కేటీఆర్ ప్రవర్తిస్తున్నారని సీఎం అన్నారు. మనం చేయలేని పని వాళ్లు చేస్తున్నందున చూస్తూ ఉండాలని వారిద్దరికి హితవు చెప్పాలని కేసీఆర్‌కు సూచించారు. తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు మారీచు సుబాహుల్లా, రాహు కేతువుల్లా వారు అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు భేషజాలు లేవనీ, వయసులో, అనుభవంలో కేసీఆర్ పెద్ద వారనీ, ఆయన పెద్దరికాన్ని నిలుపుకోవాలని, తప్పులు చేస్తున్న తమ పిల్లలకు బుద్ధి చెప్పాలని సూచించారు. శాసన సభలో పాలక పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో, ప్రతిపక్షానికీ అంతే ప్రాధాన్యత ఉందని సీఎం అన్నారు. కేసీఆర్ సభకు వచ్చి తాము పాటించే విధానల్లో ఏమైనా లోపాలుంటే తెలియజేయాలని సీఎం సూచించారు.

## తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణకు రండి

సచివాలయంలో డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ప్రతిపక్ష నేత కేసీఆర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నేతలను ఆహ్వానిస్తున్నట్టు సీఎం తెలిపారు. కేసీఆర్‌తోపాటు కేంద్ర మంత్రులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా కలిసి ఆహ్వానిస్తారని సీఎం తెలిపారు. ఈ ఉత్సవానికి ప్రతిపక్ష నేత వచ్చి పెద్దరికం నిలుపుకోవాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో తెలంగాణ సంబరాలు అద్భుతంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. తెలంగాణ సంస్కృతికి పట్టం కట్టే కార్యక్రమాలు, పిండి వంటలు, మహిళా సంఘాల స్టాళ్లతో ఒక పండగ వాతావరణం నెలకొంటుందని చెప్పారు. బోనాలు, వినాయక నిమజ్జనం చేసుకునేప్పుడు ఎలాంటి వాతావరణం ఉంటుందో అలాంటి వాతావరణం ఉంటుందన్నారు. ప్రజలంతా వాటిలో పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కేశవరావు, షబ్బీర్‌అలీ, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

-కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి సీఎం ఆహ్వానం

## ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే కేసులా?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే కేసులు, ఆ పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. "పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు, ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు, కాసులు మీకు - కేసులు మాకు, సూటుకేసులు మీకు - అరెస్టులు మాకు" సర్కార్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

అక్రమంగా అరెస్ట్ చేసిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకుల వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.





## అమ్మాయిల ఎడ్యుకేషన్ హబ్‌గా అందోల్

- 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాలలకు శంకుస్థాపన :

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ-జోగిపేట

అమ్మాయిల ఎడ్యుకేషన్ హబ్‌గా అందోల్ తయారు కాబోతున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్‌లో 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, హాస్టల్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. అమ్మాయిలకు చదువు చాలా ముఖ్యమైనదని, మహిళలు విజ్ఞానవంతులైతే సమాజం గుణాత్మక అభివృద్ధి వైపు పురోగమిస్తుందని అన్నారు. చదువుతో పాటు సమాజం, సంస్కృతిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే అమ్మాయిలకు సంబంధించిన అన్నిరకాల విద్యా సంస్థలు ఇక్కడున్నాయని, కొత్తగా నర్సింగ్ కాలేజీ ప్రారంభించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాంపిటేటివ్ సమాజంలో సక్సెస్ కావాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ, నిరంతర కృషి చాలా అవసరమన్నారు. అంతకుముందు తన బర్త్‌డే సందర్భంగా విద్యార్థినుల సమక్షంలో మంత్రి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులను మంత్రి అభినందించారు. అనంతరం లక్ష్మీదేవి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి దామోదర్ రాజనర్సింహ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ అంజయ్య, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ జగన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టీ శాట్‌తో ఉన్నత విద్యామండలి ఎంవోయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విదార్థులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్లో విద్యనందించేందుకు టీ శాట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యలో భావితరాలకు విలువైన విద్యను అందించేందుకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధునాతనమైన సబ్జెక్టులపై వారికి నైపుణ్యాలను పెంచే శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సర్టిఫికేట్, డిప్లొమా, స్పెషలైజేషన్ కోర్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీ శాట్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. వేణుగోపాల్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్లు ప్రొ. ఇటికాల పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి ప్రొ. శ్రీరాం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ ముగ్గురు చేతుల్లోనే విమానయాన రంగం

కేంద్రం ప్రభుత్వ నియంత్రణ లేదు

- టిక్కెట్టు ధరల తగ్గింపునకు చర్యలేవీ?
- సామాన్యులకు అనుగుణంగా ధరల నియంత్రణ చేయగలరా?
- ప్రయివేట్ కంపెనీలు విమానాలు కొనుగోలు చేయడం ప్రభుత్వ విజయమా?

: రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఐ(ఎం) ఎంపీ ఎఏ రహీం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో విమానయాన రంగం అదానీ, టాటా, ఇండిగో ముగ్గురు చేతుల్లోనే ఉందని సీపీఐ(ఎం) ఎంపీ ఎఏ రహీం విమర్శించారు. గురువారం రాజ్యసభలో భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ బిల్లు పేరునే తాను వ్యతిరేకిస్తున్నానని అన్నారు. భారతదేశం భాషా ప్రయుక్త రాష్ట్రాలతో కూడినదనే విషయాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు. ఈ బిల్లును ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లుగా మార్చాలని తాను కోరుతున్నానన్నారు. ఈ బిల్లుపై మనం ఎందుకు చర్చిస్తున్నాం? భారత పౌర విమానయాన రంగ సంరక్షకులు ఎవరు? మంత్రా? లేక మంత్రిత్వ శాఖ? అని ప్రశ్నించారు. మంత్రి, మంత్రిత్వ శాఖ సంరక్షకులు కాదని అన్నారు. భారత పౌర విమానయాన రంగంపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ ఏమీ లేదని అన్నారు. కేవలం టాటా, ఇండిగో, అదానీ ఈ మూడు సంస్థలే మొత్తం విమానయాన రంగాన్ని నియంత్రిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోని దాదాపు మేజర్ ఎయిర్‌పోర్టులన్నీ అదానీ చేతుల్లోనే ఉన్నాయని, టాటా, ఇండిగోలదే పైచేయి అని అన్నారు. కానీ కేంద్ర మంత్రి మోడీ ప్రభుత్వ హయాంలోనే విమాన ప్రయాణికులు రెట్టింపయ్యారని గొప్పలు చెప్పుకుంటున్నా రన్నారు. విమానచార్జీల ధరల నియంత్రణను మరిచారని అన్నారు. మంత్రి గారూ మీరేమైనా విమాన టిక్కెట్టు ధరలను నియంత్రించగలరా? అని ప్రశ్నించారు. కంపెనీలు టిక్కెట్టు ధర ఎంత చెబితే అంతేనని అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ 356 రిపోర్టు విమాన టిక్కెట్ల ధరలు నియంత్రించాలని, సామాన్యులకు అనుగుణంగా టిక్కెట్ల ధరలు ఉండాలని స్పష్టం చేసిందన్నారు. దేశంలో ఈ డిమాండ్ చాలా సుదీర్ఘంగా ఉందని గుర్తుచేశారు. యువ మంత్రిగా విమాన చార్జీలు రెగ్యులేట్ చేసేందుకు ఒక యంత్రాంగాన్ని తీసుకురాగలరా? అని ప్రశ్నించారు. మీరు తీసుకురాలేరు. ఎందుకంటే డీరెగ్యులేట్ అనేది నయా ఉదారవాద విధానాల ప్రాథమిక మంత్రమని విమర్శించారు. ఇండిగో, టాటా కొత్త విమానాలు కొనుగోలు చేస్తే, దాన్ని ప్రభుత్వ సాధించిన విజయంగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆ రెండు సంస్థలు విమానాలు కొనుగోలు చేస్తే, ప్రభుత్వం బిల్లు ఎందుకు తీసుకొస్తుందని ప్రశ్నించారు.

# హెచ్‌సీఐటీఐ ప్రాజెక్టుకు భారీగా నిధులు

- రూ.5942 కోట్లకు పరిపాలనా అనుమతులు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నొవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)(హెచ్-సీఐటీఐ) ప్రాజెక్టులో భాగంగా చేపట్టే రహదారుల విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. రూ.5,942 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు ఇస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడ్రోజుల కిందట జరిగిన ప్రజాపాలన విజయోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్-సిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తాజాగా ప్రభుత్వం జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో 5 ప్యాకేజీల్లో చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా సికింద్రాబాద్ జోన్‌లోని ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం కోసం అత్యధికంగా రూ.940 కోట్ల విడుదలకు అనుమతులు ఇచ్చింది. శేరిలింగంపల్లి జోన్‌లో ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల అభివృద్ధికి రూ. 837 కోట్లు, మియాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు మూడు వరుసలతో అండర్ పాస్ నిర్మాణానికి రూ.530 కోట్లు విడుదల చేసింది. ఎల్బీనగర్ జోన్‌లో టీకేఆర్ కాలేజీ జంక్షన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్ కోసం రూ.416 కోట్లు, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్‌నగర్ జంక్షన్ వరకు మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.398 కోట్లు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# పిల్లల్లో.. చలి ప్రభావం

**విజృంభిస్తున్న శ్వాసకో, వైరల్ ఫివర్స్**

- పెరుగుతున్న నిమోనియా తీవ్రత
- చల్లటి వాతావరణంతో ఇబ్బంది పడుతున్న అస్తమా,టీబీ పేషెంట్లు
- ప్రయివేట్ ఆస్పత్రుల్లో దోపిడీ
- సర్కార్ దవాఖానాలో పిల్లల వైద్యుల కొరత





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని దాతర్‌పల్లికి చెందిన జూపల్లి బాలయ్య, సంతోష దంపతులకు ఇద్దరు కుమారులు. 8 ఏండ్ల కుమారుడు ధనుష్ నియోనియాతో బుధవారం మృతి చెందాడు. చలిజ్వరంతో బాధపడుతున్న ధనుష్‌ను స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు చేసి నిమోనియాతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఆరోగ్యం విషమించినందున హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం దక్కలేదు" ఇది ఒక్క ధనుష్ పరిస్థితే కాదు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వాతావరణంలో వస్తున్న మార్పులు, చలి తీవ్రత వల్ల చిన్న పిల్లలతో పాటు వృద్ధులు సైతం వ్యాధుల బారిన పడుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వాళ్లపై చలి తీవ్రత మరింతగా కనిపిస్తోంది.

రాష్ట్రంలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న పెను మార్పుల వల్ల వ్యాధులు విజృంభిస్తున్నాయి. అధిక తేమ, అధిక వేడిమి, అతి చలి వీస్తుంది. అకాల వర్షం కూడా కురుస్తున్నాయి. రాష్ట్రంలో చలి తీవ్రత అత్యధికంగా ఉన్న మండలాల్లో సంగారెడ్డి జిల్లాలోని కోహీర్, న్యాలకల్ వంటి మండలాలున్నాయి. కోహీర్‌లో ఒక రోజు 8, 9 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మార్పులు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగానూ కనిపిస్తున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, కొత్తగూడెం, నిర్మల్, వనపర్తి, సూర్యాపేట తదితర జిల్లాల్లోనూ చలితీవ్రత బాగా ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. వాతావరణంలో మార్పుల ప్రభావాన్ని తట్టుకోలేక ముఖ్యంగా చిన్నపిల్లలు అనేక జబ్బుల పాలైన పరిస్థితి ఉంది. శ్వాసకోశ, వైరల్ ఫీవర్, నిమోనియా, తలనొప్పి, సర్ది, దగ్గు వంటి సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు ప్రతి ఇంటా పిల్లలు వ్యాధుల బారిన పడుతుండటంతో ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లోని పీడియాట్రిక్ వైద్యుల ఓపీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇన్‌పేషెంట్లతో ఆస్పత్రులు కిక్కిరిసి పోతున్నాయి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులే కాకుండా మున్సిపల్ కేంద్రాల్లోని దవాఖానాల్లోనూ పిల్లలు, పెద్దలతో నిండిపోయాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలందుతున్నప్పటకీ పిల్లల వైద్యుల కొరత ఉండటం వల్ల పిల్లల పట్ల మక్కువతో ప్రయివేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.


**వ్యాధుల బారిన పడుతున్న చిన్నారులు**

వాతావరణ మార్పులు, చలి తీవ్రత వంటి పరిస్థితులు చిన్న పిల్లల్ని అనేక రకాల వ్యాధుల బారిన పడేస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ ప్రాథమిక సమాచారం మేరకు సంగారెడ్డి జిల్లాలోనే 2500 మంది చిన్న పిల్లలు వివిధ వ్యాధులకు గురయ్యారు. సిద్దిపేట జిల్లాలో 2150 మంది, మెదక్ జిల్లాలో 1350 మంది పిల్లలు వ్యాధుల బారిన పడినట్టు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లా అధికారిక సమాచారం మేరకు 1221 మంది శ్వాసకోశ సమస్యతో, 969 మంది వైరల్ ఫీవర్‌తో, 380 మంది నిమోనియా వ్యాధి బారిన పడినట్టు మెడికల్ ల్యాబ్ రిపోర్టు ద్వారా వెల్లడవుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత, తడిపొడి వాతావరణం వల్ల పిల్లల్లో గొంతు ఇన్‌ఫెక్షన్స్ కూడా ఎక్కువగా కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. చల్లటి వాతావరణం ఏర్పడితే తట్టుకోలేని పిల్లల్లో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతున్నది. రెండు మూడు వారాలుగా దగ్గు, జ్వరం తగ్గకపోవడంతో నిమోనియాగా మారి ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సమస్య ఏర్పడుతుంది. గజ్వేల్ మండలంలోని దాతర్‌పల్లికి చెందిన ధనుష్ అనే చిన్నారి నిమోనియా విషమించే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు.

**భరించలేనంతగా ఆస్పత్రుల ఖర్చులు**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లల వైద్యుల కొరత ఉండటంతో ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా సీజనల్ వ్యాధుల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. వైరల్ ఫీవర్, నిమోనియా వంటి వ్యాధులు వెలుగుచూసినప్పుడు వెంటనే తగ్గకపోవడంతో ప్రయివేట్ ఆస్పత్రుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డుల్లో చేరినప్పటికీ పీడియాట్రిక్ వైద్యుల కొరత ఉంది. ప్రభుత్వ వైద్యులు సైతం ప్రయివేట్ ఆస్పత్రుల్ని నడుపుతున్నారు. మరో పక్క ఇతర ప్రయివేట్ ఆస్పత్రుల్లో 24 గంటల పాటు పిల్లల డాక్టర్ పర్యవేక్షణ ఉంటదని ఆర్ఎంపీలు చెప్పడంతో తల్లిదండ్రులు విధిలేని పరిస్థితిల్లో ప్రయివేట్ ఆస్పత్రుల్ని ఆశ్రయిస్తున్నారు.

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం**



వాతావరణంలో వచ్చే మార్పుల్ని బట్టి మనిషిలో వివిధ రకాల వ్యాధులు ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా చలి కాలంలో పిల్లలు.. అస్తమా, టీబీ పేషెంట్లు జాగ్రతలు పాటించాలి. చల్లి తీవ్రతను తట్టుకునేందుకు వెచ్చదనాన్నిచ్చే దుస్తులు ధరించాలి. స్వెటర్లు, మంకీక్యాప్, రగ్గులు వాడాలి. చన్నీళ్ల స్నానం చేయొద్దు. వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. అస్తమా, టీబీ సమస్య ఉన్న వాళ్లు పొద్దున, రాత్రి వేళల్లో బయట తిరగొద్దు. చలి వీచే కూలర్లు, ఏసీ, ఫ్యాన్ల వాడకాన్ని తగ్గించాలి. పిల్లల్లో శ్వాసకోశ సమస్యతో పాటు వైరల్ ఫివర్స్, నిమోనియా వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా చిల్రన్స్ వార్డుల్లో చికిత్స అందిస్తున్నాం.

-డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పిల్లల వైద్య నిపుణులు, పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంట్

# మోడీజీ...నాటి మాటలు మరిచారా ?

## అప్పుడు ఒప్పు... ఇప్పుడు తప్పా ?

## నాలుక మడతెడుతున్న కమలనాథులు

- బీజేపీ రాజకీయ సందేశాలకు వేదికలుగా చట్టసభలు
- ప్రశ్నించే గొంతుకలపై ఎదురు దాడులు



**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట... అధికారం రాగానే మరో మాట. కమల నాథులకు నాలుక మడతపడుతోంది. పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య రూపమేనని ఒకప్పుడు వాదించిన బీజేపీ నేతలు ఇప్పుడు అదే పని చేస్తున్న ప్రతిపక్షంపై నోరు పారేసుకుంటున్నారు.**

**ప్రతిపక్షాల నిరసనను పార్లమెంట్ 'హైజాకింగ్'గా ప్రధాని అభివర్ణించారు. అప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన నిరసన ఇప్పుడు పార్లమెంటును హైజాక్ చేయడం ఎలా అవుతుందో కాషాయ నేతలే చెప్పాలి.**

**న్యూఢిల్లీ :** తన సొంత రాజకీయ సందేశాలు ఇవ్వడానికి బీజేపీ నాయకులు పార్లమెంటును వేదికగా ఉపయోగించుకుంటున్నారు. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై ప్రతిపక్ష బీజేపీ సభ్యులు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడాన్ని 2012 సెప్టెంబరులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తప్పుపట్టారు. దీనిపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ పార్లమెంట్ సమావేశాలను సాగనీయకపోవడం కూడా ప్రజాస్వామ్య రూపమేనని బదులిచ్చారు. యూపీఏ-2 ప్రభుత్వంపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని, అందుకే సభలో ఆందోళన చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇది జరిగి ఓ సంవత్సరం గడిచింది. పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘించారంటూ 20 మంది బీజేపీ, తెలుగుదేశం సభ్యులను హౌస్ బులెటిన్‌లో ప్రస్తావించినందుకు బీజేపీ ఎగువ సభలో నిరసన తెలిపి, ఆ తర్వాత వాకౌట్ చేసింది. దీనిని సీనియర్ నేత అరుణ్ జైట్లీ సమర్థించుకున్నారు. ఆందోళన చేసిన అధికార పక్ష సభ్యులను వదిలేసి కేవలం ప్రతిపక్ష సభ్యులను మాత్రమే శిక్షించారని ఆయన మండిపడ్డారు.

### కుడి ఎడమైతే...

ఈ ఘటనలు జరిగి దశాబ్ద కాలం అయింది. ఇప్పుడు అటు వారు ఇటు, ఇటు వారు అటు అయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆనాటి పార్టీ నేతల మాటలు మరచిపోయారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసన 'హైజాకింగ్'కు ఓ రూపమని వ్యాఖ్యానించారు. 'ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నకర ఎత్తుగడల ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు' అని విమర్శించారు. పదేపదే ప్రజల తిరస్కరణకు గురైన వారు తమ సహచరుల మాటలను పెడచెవిన పెట్టి, వారి మనోభావాలను అగౌరవపరుస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పటి నుండి ఆయన మద్దతుదారులు, ఇతర బీజేపీ నేతలు ఆయన మాటలను తరచూ వల్లె వేస్తూ పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింపజేయడానికి ఏ రూపంలో ప్రయత్నించినప్పటికీ అది దేశాభివృద్ధిని అడ్డుకోవడానికి జరిపే కుట్రగానే భావించాలంటూ వితండవాదం మొదలు పెట్టారు.

### ప్రతిపక్షాలకు దారేది?

ఇక కార్పొరేట్ మీడియా కూడా ప్రధాని వ్యాఖ్యలను వెనకేసుకొచ్చింది. అంతేకాక కొన్ని అంశాలపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు అది ప్రయత్నిస్తోంది కూడా. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వివాదానికి అదానీ కేంద్ర బిందువయ్యారు. ఆయనపై మోసం, ముడుపుల ఆరోపణలు మోపుతూ న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీటు దాఖలైంది. కేంద్ర ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలపై కాంగ్రెస్‌తో పాటు అనేక ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై చట్టసభలో చర్చించాలని ఆ పార్టీలు కోరుతుంటే ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌పై కూడా చర్చించాల్సి ఉన్నదని ప్రతిపక్షాలు అడుగుతుంటే అందుకు కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదు. దీంతో సభ నుండి వాకౌట్ చేయడమో లేదా సభను బహిష్కరించడమో తప్ప ప్రతిపక్షాలకు వేరే మార్గం లేకుండా పోతోంది.

### చర్చకు ససేమిరా

రూల్ 267 కింద ప్రతిపక్షాలు అసాధారణ రీతిలో నోటీసులు అందించారు. లిస్టింగ్ అయిన సభా కార్యక్రమాలను ఆపేసి, అత్యవసర అంశాలపై చర్చకు పట్టుపట్టడానికి ఈ రూల్‌ను ప్రతిపక్షాలు వాడుకుంటాయి. అయితే సభా కార్యకలాపాలు నిలిచిపోవడానికి ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని కార్పొరేట్ మీడియా నిందిస్తోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిపోతాయేమోనని అది ఆందోళన వ్యక్తం చేస్తోంది. రూల్ 267 కింద చర్చకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ నిరాకరించారు. మణిపూర్ హింస, వరదల బారిన పడి నష్టపోయిన వాయనాడ్‌కు ప్రత్యేక సాయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హింసపై కూడా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరగా ప్రభుత్వం విముఖత చూపుతోంది.

### నాడు అలా...నేడు ఇలా

2012లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష బీజేపీ డిమాండ్ మేరకు బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై చర్చించేందుకు అంగీకరించారు. నిర్భయ సామూహిక అత్యాచార ఘటనపై కూడా రోజుల తరబడి చర్చ సాగింది. ఈ చర్చల కారణంగానే లైంగిక దాడి విషయంలో కొత్త చట్టం వచ్చింది. అయితే ఇప్పుడు కాషాయ పార్టీ మాత్రం పార్లమెంటును తన రాజకీయ సందేశాల కోసం వాడుకుంటోంది. సభలో చర్చల సమయంలో హిందీని ప్రధాన భాషగా రుద్దేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. ఇరువురు సభాపతులు తటస్థ పరిశీ లకుల మాదిరిగా కాకుండా బీజేపీ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతి ఓపక్ష నేతల మైక్రోఫోన్లను కట్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా సభా కార్యకలాపాలు ఏకపక్షంగానే సాగుతున్నాయి. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే వారిని సభ నుండి బహిష్క రిస్తున్న ఉదంతాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

### ప్రజలు తిరస్కరించింది వారినే

ప్రతిపక్ష ఎంపీలను ప్రజలు తిరస్కరించారంటూ మోడీ చేసిన ప్రకటన వారి పాత్రను తక్కువ చేసి చూపడమే అవుతుంది. వాస్తవానికి ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించింది ప్రతిపక్షాలను కాదు...బీజేపీనే. భారత ప్రజాస్వామ్యంపై వ్యక్తమవుతున్న ఆందోళనకు పార్లమెంట్ 'హైజాకింగే' నిజమైన కారణమైతే అందుకు ఎవరిని నిందించాలో అందరికీ తెలిసిందే.

### ఇదీ ప్రభుత్వ తీరు

హిందూత్వ ప్రచార చిత్రం 'ది సబర్మతి రిపోర్ట్'ను వీక్షించేందుకు మోడీ, ఆయన క్యాబినెట్ సహచరులు ఇటీవల పార్లమెంట్ గ్రంథాలయాన్ని వేదికగా మార్చేశారు. గడచిన రెండు ప్రభుత్వాల పాలనలోనూ ప్రధాని మోడీ పార్లమెంటుకు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో జరిగిన చర్చకు ఇచ్చిన సమాధానాన్ని కూడా ఆయన ఎన్నికల ప్రచారంగా మార్చేశారు. పార్లమెంటులో ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలపై ప్రభుత్వ వైఖరిని ఆయన స్పష్టం చేయలేదు. ఒకవేళ ప్రభుత్వం వైపు నుండి సమాధానాలు వచ్చినా అవి సాదాసీదాగా, దాటవేసే రీతిలో ఉంటున్నాయి. సభలో చర్చ జరపకుండానే అనేక బిల్లులను ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. బిల్లుల ప్రతులు తమకు అందలేదని, ముసాయిదాల అధ్యయనానికి తమకు తగిన సమయం ఇవ్వలేదని ప్రతిపక్షం తరచూ ఫిర్యాదు చేసింది.

---

## ఖాళీలు భర్తీ చేయండి

- రెండు వారాల్లో నివేదికలు ఇవ్వండి : సమాచార కమిషన్లపై కేంద్ర రాష్ట్రాలకు సుప్రీం ఆదేశాలు
- తెలంగాణలో మనుగడలోనే లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్రాల సమాచార కమిషన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గత నెల 11న అందజేసిన నివేదిక ప్రకారం కేంద్ర సమాచార కమిషన్‌లో ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రస్తుతం కేవలం ముగ్గురు సమాచార కమిషనర్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక అందజేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ ఛహార్‌ను న్యాయస్థానం ఆదేశించింది. కేంద్ర సమాచార కమిషన్, పలు రాష్ట్ర సమాచార కమిషనర్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై సమాచార హక్కు కార్యకర్త సహా పలువురు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను పురస్కరించుకొని సుప్రీం బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్రలో ఏడు, కర్నాటకలో ఎనిమిది, ఛత్తీస్‌గఢ్‌లో రెండు, బీహార్‌లో ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో నాలుగు, ఒడిషాలో ఐదు, తమిళనాడు సమాచార కమిషన్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని న్యాయస్థానం గుర్తించింది. జార్ఖండ్, తెలంగాణ, త్రిపుర రాష్ట్రాల సమాచార కమిషన్లు గత కొన్ని సంవత్సరాలుగా ఉనికిలోనే లేవని, ఆయా రాష్ట్రాల్లో తాజా నియామకాలు జరగడం లేదని తెలిపింది. గత సంవత్సరం నవంబరులో జారీ చేసిన ఆదేశాల్లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించానని గుర్తు చేసింది. రాష్ట్రాలు కూడా రెండు వారాల్లో నివేదికలు అందజేయాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కాలపరిమితిని వివరించాలని ఆదేశించింది.

'ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయాన్ని రాష్ట్రాలు కూడా తెలియజేయాల్సి ఉంటుంది. రెండు వారాల్లో దీనిపై నివేదికలు అందజేయాలి' అని న్యాయస్థానం తన ఆదేశాల్లో పేర్కొంది. ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సమాచారం అందజేయడంతో న్యాయస్థానం ఈ ఆదేశాలను వెలువరించింది. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయకపోవడమంటే సమాచార హక్కు చట్టం ఉద్దేశాన్ని నీరుకార్చడమే అవుతుందని సుప్రీంకోర్టు గతంలోనే వ్యాఖ్యానించింది.

---

### కుల దురహంకార హత్య ప్రభుత్వానికి

## కనిపించడం లేదా..?

### నాగమణి హత్యపై సీఎం స్పందించి ఆదుకోవాలి

- స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ
- త్వరలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం



**నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో జరిగిన కుల దురహంకార హత్య రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ ప్రశ్నించారు. పోలీస్ కానిస్టేబుల్ నాగమణి హత్యపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, సీపీ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా మూడు నెలల్లో దోషులకు శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబ సభ్యులను సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించింది. అనంతరం సీపీఐ(ఎం) నాయకులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఆస్తి కోసం జరిగిన హత్యగా కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అదే నిజమైతే 2017లోనే నాగమణి తన ఆస్తిని సోదరుడు పరమేశ్‌కు బదలాయించిందని గుర్తుచేశారు. ఏడేండ్ల తర్వాత నాగమణి.. దళిత యువకుడు శ్రీకాంత్‌ను వివాహం చేసుకున్నదన్నారు. కుల దురహంకార హత్య కేసును పక్కదోవ పట్టించడానికి భూ వివాదాన్ని తెరపైకి తేవడం సబబు కాదన్నారు. ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టును చేర్చాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాల ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో డ్రాఫ్టు తయారు చేసి కేంద్రానికి ఇచ్చిందన్నారు. ఈ హత్యలో పరమేశ్‌తో పాటు అతనికి సహకరించిన అనేక మందిని పోలీసులు ఇన్వెస్టిగేషన్ ద్వారా తేల్చాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌కు కూడా ప్రాణహాని ఉన్నదని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. త్వరలోనే జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. రాయపోల్ గ్రామంలోనూ సంతాప సభ నిర్వహిస్తామన్నారు.

హత్య జరిగి నాలుగు రోజులు కావొస్తున్నా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దళిత యువకుడిని వివాహం చేసుకున్న నేపథ్యంలోనే నాగమణి హత్యపై ఆయా పార్టీలు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, పి.యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ జంగయ్య, కె. జగన్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## జార్ఖండ్ క్యాబినెట్ విస్తరణ

- హేమంత్ సోరెన్ మంత్రివర్గంలో 11 మందికి చోటు



**రాంచీ :** జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గురువారం 11 మంది మంత్రులతో తన మంత్రివర్గాన్ని విస్తరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో గవర్నర్ సంతోశ్ కుమార్ గంగ్వార్ వారితో ప్రమాణం చేయించారు. పాలక పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నుంచి ఆరుగురు, కాంగ్రెస్ నుంచి నలుగురు, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నుంచి ఒకరిని క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. అయితే శాఖల కేటాయింపు జరగాల్సి ఉన్నది.

జేఎంఎం నుంచి చైబాసా ఎమ్మెల్యే దీపక్ బిరువా, ఘట్‌సిల ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, గిరిదిహ్ ఎమ్మెల్యే సుదివ్య కుమార్, బిష్ణుపూర్ ఎమ్మెల్యే చమ్రలిండా, గోమియా ఎమ్మెల్యే యోగేంద్ర ప్రసాద్, మధుపూర్ ఎమ్మెల్యే హఫీజుల్ హసన్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. కాంగ్రెస్ నుంచి దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ, రాధాకృష్ణ కిషోర్, శిల్పి నేహా టిర్కీలను క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. తాము మంత్రి వర్గంలో భాగం కాదని ఇటీవల సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ప్రకటించిన సంగతి తెలిసిందే.నాలుగు సీట్లు గెలుచుకున్న ఆర్జేడీకి వారి కోటాలో ఓ మంత్రి పదవి లభించింది. గొడ్డా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజరు ప్రసాద్ యాదవ్ క్యాబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు.

ఇటీవల జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో 81 అసెంబ్లీ స్థానాల్లో, జేఎంఎం నేతృత్వంలోని ఇండియా బ్లాక్ 56 సీట్లు గెలుచుకున్నది. జేఎంఎం 34, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ (ఎంఎల్) 2 సీట్లు గెలుచుకున్నాయి. ఎన్‌డీఏ 24 స్థానాలకు మాత్రమే పరిమితమైంది.

---

# పోడు భూములకు పట్టాలివ్వాలి

- పచ్చని పొలాల చుట్టూ తీసిన ట్రంచులను వెంటనే పూడ్చివేయాలి : మాజీ ఎంపీ మిడియం బాబురావు
- గిరిజన సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట బైటాయింపు



**గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలు మానుకోవాలి**

**నవతెలంగాణ-అశ్వాపురం**

మూడు దశాబ్దాలుగా గిరిజనులు సాగుచేసుకుంటున్న భూముల పైకి అటవీశాఖ అధికారులు వెళ్లి పచ్చని పొలాల చుట్టూ కందకాలు తీయించడం సరైన పద్ధతి కాదని, వెంటనే వాటిని పూడ్చివేయాలని లేదంటే గిరిజన రైతులే వాటిని పూడుస్తారని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు తెలిపారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై కొందరు ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యాలను ఆపాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ముందుగా చింతిర్యాల క్రాస్ రోడ్‌లోని ఆదివాసీ భవన్ నుంచి గౌతమీ నగర్ కాలనీ గేట్, అశ్వాపురం ప్రధాన సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు రేగుల గండి, మనుభూతులపాడు, వేములూరు, రాయన్నపేటకు చెందిన గిరిజనులు భారీ ప్రదర్శన నిర్వహించారు. తహసీల్ ఎదుట సుమారు గంటపాటు బైటాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బి.స్వర్ణకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం మాట్లాడుతూ.. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై కొందరు ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యాలకు దిగుతున్నారని, వాటిని సహించబోమని అన్నారు. ఫారెస్ట్ అధికారులు కొట్టిన ట్రంచులను వెంటనే పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాల ప్రకారం.. గిరిజనులకు పోడు భూములపై హక్కు పత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఫారెస్ట్, రెవెన్యూ అధికారులకు ఉందని తెలిపారు.

ఈనెల 12 వరకు అటవీ అధికారులు తీసిన కందకాలను పూడ్చివేయాలని, లేనిపక్షంలో ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న ప్రజలందరూ తిరగబడి పూడ్చుకుంటారని హెచ్చరించారు. న్యాయబద్ధంగా, చట్టపరంగా గిరిజన హక్కుల ప్రకారం 30 ఏండ్లకు పైగా సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలను ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోడు సాగుదారులకు పట్టాలు వచ్చేంతవరకు పోరాటాల బాటను ఆపొద్దని గిరిజనులకు సూచించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ.. అమాయక గిరిజనులపై దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదని అన్నారు. పచ్చని అటవీ ప్రాంతాల్లో ఉంటూ గత కొన్నేండ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారులైన నాగరాజు, ప్రసాద్, మురళి చేస్తున్న దౌర్జన్యాలను వెంటనే నిలిపివేయాలన్నారు.

అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను అధికారులు సర్వే చేసి హక్కుపత్రాలు ఇవ్వాలని తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఓ పక్కన అమాయక గిరిజనుల దగ్గర లంచాలు దండుకుంటూనే మరో పక్కన వారిపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. కొందరు అటవీ శాఖ అధికారులు లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడి మరలా విధుల్లోకి వచ్చి అమాయకమైన గిరిజనులను వేధిస్తున్నారని, ఇకపై వాటిని ఆపివేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మడవి రమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, పాయం నరసింహారావు, మణుగూరు మండల కమిటీ నాయకులు సత్రపల్లి సాంబశివరావు, మోకాళ్ళ రమేష్, దండి రాములు, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

---

## ద్వైవార్షిక ప్రవేశాలకు స్పందన నామమాత్రమే

- ఆరు వర్సిటీల్లోనే యూజీసీ పథకం అమలు

**న్యూఢిల్లీ :** ఉన్నత విద్యాసంస్థల్లో ద్వైవార్షిక ప్రవేశాలకు సంబంధించి యూజీసీ ప్రవేశపెట్టిన పథకానికి స్పందన నామమాత్రంగానే ఉంటోంది. దేశంలో మొత్తం 48 కేంద్ర విశ్వవిద్యాలయాలు ఉండగా వాటిలో కేవలం ఆరు మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. సాంకేతిక-యేతర కోర్సులను అందిస్తున్న యూనివర్సిటీలు, కళాశాలలు ఏడాదికి రెండుసార్లు...తొలుత జూలై-ఆగస్ట్, పిదప జనవరి-ఫిబ్రవరిలో విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతించే ప్రతిపాదనకు యూజీసీ మేలో ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేటును (జీఈఆర్) పెంచడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. అమెరికా, బ్రిటన్ దేశాల్లోని అనేక విశ్వవిద్యాలయాలు సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకుంటున్నాయి.

ద్వైవార్షిక ప్రవేశాలు ప్రారంభించడానికి ముందు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని సరైన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ సూచించింది. కాగా ద్వైవార్షిక ప్రవేశాల పథకాన్ని ఎన్ని కేంద్రీయ యూనివర్సిటీలు, విద్యా సంస్థలు అమలు చేస్తున్నాయని ఎండీఎంకే సభ్యుడు వైగో బుధవారం రాజ్యసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్పందిస్తూ సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకునే విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది ఉన్నత విద్యా సంస్థలేనని తెలిపారు. పథకాన్ని అమలు చేసేందుకు ఈ ఏడాది ఆరు యూనివర్సిటీలు ముందుకు వచ్చాయని ఆయన చెప్పారు.

సంపాదకీయం

# ఇద్దరు నియంతలకు ఎదురుదెబ్బ!



పార్లమెంటులో మెజారిటీ లేకున్నా ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ తనకు సంక్రమించిన నిరంకుశ అధికారంతో నియమించిన ప్రధాని మైఖేల్ బార్నియర్ అవిశ్వాస తీర్మానంతో ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. దీంతో మరోసారి రాజకీయ, అధికార అనిశ్చితి తలెత్తింది. పార్లమెంటు ప్రతిఘటనతో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అత్యవసర పరిస్థితి ప్రకటించిన ఆరుగంటల్లోనే ఎత్తివేయాల్సి వచ్చింది. ప్రతిపక్షాలు అభిశంసనను ఎదుర్కోనున్నాడు.యూన్ సుక్ యోల్ రాజీనామా చేసేంతవరకు నిరవధిక సమ్మె జరపనున్నట్లు కొరియా కార్మిక సంఘాల సమాఖ్య(కెసిటియు) ప్రకటించింది. వివిధ రంగాలకు చెందిన కార్మికులు తమ పని పరిస్థితులను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సమ్మెలకు నోటీసులు, తేదీలను ప్రకటించిన పూర్వరంగంలో ఉత్తర కొరియా కమ్యూనిస్టుల నుంచి ప్రమాదం వచ్చిందని, ప్రతిపక్షాలు వారితో చేతులు కలుపుతూ దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నందున అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు అధ్యక్షుడు కుంటిసాకులు చెప్పాడు.

**పార్లమెంటు ఆమోదంతో నిమిత్తం లేకుండా కార్మికులపైభారాలు మోపేందుకు వీలు కల్పించే నిర్ణయం తీసుకోవటంతో ప్రతిపక్షం అవిశ్వాసతీర్మానం పెట్టి బార్నియర్ సర్కార్‌ను గద్దెదించింది. జీడీపీలో 60శాతానికి మించి అప్పు ఉండకూడదన్న ఐరోపా సమాఖ్య మార్గదర్శకాలకు భిన్నంగా 112శాతం రుణంతో ఫ్రాన్సు ఉంది. మరిన్ని అప్పులు చేయకుండా లోటును తగ్గించే పేరుతో 60బిలియన్ యూరోల పన్ను విధింపునకు ప్రభుత్వం పూనుకుంది. సామాజిక భద్రత ముసుగులో పార్లమెంటులో చర్చ అవసరం లేని రాజ్యాంగ నిబంధనను ప్రయోగించింది.**

అత్యవసర పరిస్థితి ప్రకటించగానే దక్షిణ కొరియా మిలిటరీ పార్లమెంటు చుట్టూ మోహరించి, కార్యకలాపాలను పక్కన పెడుతున్నట్లు ప్రకటించింది. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి అత్యవసరపరిస్థితి అమల్లోకి వస్తున్నట్లు చెప్పారు. అయితే చీకటి మాటున ప్రతిపక్షం, అధికార పక్షంలో అత్యవసర పరిస్థితిని వ్యతిరేకిస్తున్న వారు గోడలు దూకి, చాటుమాటుగా పార్లమెంటులో ప్రవేశించి అధ్యక్షుడి చర్యకు వ్యతిరేకంగా నాలుగు గంటల తరువాత తీర్మానం చేయటమే కాదు, అత్యవసర పరిస్థితి రద్దు ప్రకటన వెలువడే వరకు తాము పార్లమెంటు నుంచి బయటకు వచ్చేది లేదంటూ భీష్మించారు. దాంతో బుధవారం తెల్లవారుజామున 4.30గంటలకు మంత్రివర్గ సమావేశం జరిపి ఆ మేరకు ప్రకటించారు. అధికారపక్ష ఎంపీలు కూడా గోడలు దూకిన వారిలో ఉన్నారంటే మిలిటరీ చూసీ చూడనట్లుగా లేకపోతే సాధ్యం కాదు. దీనంతటికీ కారకుడిగా భావిస్తున్న రక్షణ మంత్రి రాజీనామా చేసి తప్పుకున్నాడు. అధ్యక్షుడిని తొలగించేందుకు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటులో అభిశంసన తీర్మానం పెట్టేందుకు నిర్ణయించారు. దానికి గాను అవసరమైన 200 ఓట్లకు గాను మరో ఎనిమిది మంది అధికారపక్షం వారు ఓటేస్తేనే నెగ్గుతుంది. దానికి సుప్రీంకోర్టు లోని తొమ్మిది మందికి గాను ఆరుగురు న్యాయమూర్తులు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

ఫ్రాన్సు ఐదవ రిపబ్లిక్(1958 నుంచి) చరిత్రలో లేటు(73) వయస్సులో అధికారానికి రావటంలోనూ అత్యంత అల్పకాలం(మూడు నెలలు) అధికారంలో ఉన్న ప్రధానిగా మైఖేల్ బార్నియర్ చరిత్ర కెక్కాడు. ప్రధాని కాగానే నూతన యుగానికి ఆరంభం అని చెప్పాడు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ముందు దేశం ఎక్కడికి పోతుందో తెలియదని హెచ్చరించి ఆప్రక్రియ ముగియగానే ఇంటిదారి పట్టాడు.పచ్చిమితవాద నేషనల్ రాలీ పార్టీ నాయకురాలు మేరీ లీపెన్ అవిశ్వాసానికి మద్దతు ఇవ్వరని బారియర్ వేసుకున్న అంచనాను తన రాజకీయంతో ఆమె వమ్ముచేశారు.వచ్చే ఏడాది జూలై వరకు పార్లమెంటును రద్దుచేసే అవకాశం లేకపోవటంతో అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మక్రాన్ మరోసారి పెద్ద పక్షంగా ఎన్నికైన వామపక్షపార్టీని కాదని అడ్డగోలుగా మరో కొత్త ప్రభుత్వాన్ని నియమిస్తారా, చేసిన తప్పును సవరించుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. ప్రభుత్వ పతనం నిజానికి మక్రాన్‌కు తగిలిన ఎదురుదెబ్బ, స్వయంకృతమే. జనంలో గబ్బు పట్టిన ఆ పెద్దమనిషి పదవికి రాజీనామా చేస్తారా అంటే అదంతా భ్రమ అంటూ తిరస్కరించాడు.

పార్లమెంటు ఆమోదంతో నిమిత్తం లేకుండా కార్మికులపై భారాలు మోపేందుకు వీలు కల్పించే నిర్ణయం తీసుకోవటంతో ప్రతిపక్షం అవిశ్వాసతీర్మానం పెట్టి బార్నియర్ సర్కార్‌ను గద్దెదించింది. జీడీపీలో 60శాతానికి మించి అప్పు ఉండకూడదన్న ఐరోపా సమాఖ్య మార్గదర్శకాలకు భిన్నంగా 112శాతం రుణంతో ఫ్రాన్సు ఉంది.మరిన్ని అప్పులు చేయకుండా లోటును తగ్గించే పేరుతో 60బిలియన్ యూరోల పన్ను విధింపునకు ప్రభుత్వం పూనుకుంది. సామాజిక భద్రత ముసుగులో పార్లమెంటులో చర్చ అవసరం లేని రాజ్యాంగ నిబంధనను ప్రయోగించింది. ఫ్రాన్సు, దక్షిణ కొరియా రెండు చోట్లా కార్మికవర్గంపై అక్కడి పాలకులు సాకులు చూపి, నిరంకుశ పద్దతుల్లో కార్మికవర్గాన్ని అణచివేసేందుకు, భారాలు మోపేందుకు చూసిన తరుణంలోనే ఈ పరిణామాలు సంభవించాయి.

---

తెలంగాణకు ఆత్మవంటి
స్థానికతకు స్థానం లేకుండా చేసి
పైనున్నోళ్లం కిందున్నోళ్లని
తొక్కి మరింత పైకిపోవాలని
ఇతరుల స్థానాలను, అవకాశాలను
కొల్లగొట్టడానికి
కోటి విద్యలు ప్రదర్శించి
దోచుకోవడానికి దారులు కనిపెట్టిన
మానవతామూర్తులెందరో?

ప్రాణమైన...ఆత్మాభిమానమైన..
జీతమైనా..జీవితమైనా..కష్టార్జితమైన..
సర్వస్వం త్యాగం చేయడమేనా?
కొందరిని రక్షించి..
ఎందరినో శిక్షించే...
అవకాశవాదపు అంచులను తాకే...
ఈనీతి న్యాయాన్ని కనిపెట్టి
'స్థానికత' ఆత్మ గౌరవాన్ని ఫణంగా పెట్టి

## 317 బాధితుల బాధ తీర్చేదెవరు?

అంగట్లో సరుకుగా చేసి..
ఏం పందెం కాస్తావు? నీ సర్వీసునా..
నీ ఆరోగ్యాన్నా..నీ కుటుంబాన్నా..
అనే స్థాయికి దిగజార్చిన
మహానుభావులెవ్వరో?


నా జిల్లాకు నేను,
నా కుటుంబానికి నేను
అనే పోటీలో నిలబడ్డ ఓ బాధితుడా...
ఈ కృత్రిమ మార్కెట్‌కు సూత్రధారెవరు?
ఈ డిమాండ్‌కు పాత్రధారెవరు?
ప్రశ్నించే తీరిక..
కొట్లాడి వేచి చూసే ఓపిక లేని
ఓ సగటు ఉద్యోగి..నీ బాధ
తీరేదెన్నడు?
ఆపన్న 'హస్తమై.' ఆత్మీయ నేస్తమై..
అధికారంలో కొలువుదీరిన మరుక్షణమే
నీ కష్టాలను కడతేరుస్తామన్న
ప్రజా ప్రభుత్వం
చోద్యం చూస్తున్న వేళ
నీ మనోవేదన వినేదెవరు?
నీ ఆక్రందన పట్టించుకునేదెవరు?
జరిగిన అన్యాయాన్ని రూపుమాపుతామని
స్వాంతన చేకూర్చేదెవరు?
బాధితునికి బాసటగా నిలిచి
స్థానికత బాధను తీర్చేదెవరు?

(చీకటి జీవో 317కు మూడేండ్లు నిండిన సందర్భంగా)

- చెలుమల్ల ఇంద్రరేఖ,
9948015339

---

# అంబేద్కర్‌ది సహజ మరణమేనా?




డాక్టర్ దేవరాజు మహారాజు

బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 14 అక్టోబర్ 1956న నాగపూర్‌లో లక్షల మంది అనుచరులతో హిందూమతాన్ని వదిలి, బౌద్ధం స్వీకరించారు. నాగపూర్ నాగజాతి ప్రజలు జీవించిన భూమి గనుక, వారంతా బౌద్ధులు గనక, తాను బౌద్ధం స్వీకరించడానికి నాగ్‌పూర్‌ను ఎంచుకున్నానని ఆయన ప్రకటించారు. అంతేగాని, నాగ పూర్‌లో ఆరెస్సెస్ వారి ప్రధాన కార్యాలయం ఉంది గనక, వారి ప్రాముఖ్యం తగ్గించడానికి తను ఆ పట్టణాన్ని ఎంచు కోలేదనీ, వివరణ ఇచ్చారు. అయితే ఆ తర్వాత 52 రోజులకే 6 డిసెంబర్ 1956న అంబేద్కర్ కన్నుమూశారు. ఆయన మరణం వెనుక ఓ కుట్ర ఉందని, ఆయన మరణించిన నాటి నుండి నేటి దాకా ఒక ఆరోపణ ఉంది. ఆ ఆరోపణ నిజం కాదని అటు భారత ప్రభుత్వం గానీ, ఇటు ఆరోపణలు ఎదుర్కొన్న వర్గాలు గానీ ఆధారాలు, వివరణలు ప్రజల ముందు పెట్టలేదు. అందువల్ల అనుమానాలు అనుమానాల్లాగే ప్రజల మనసుల్లో సజీవంగా ఉన్నాయి.

ఆ రోజుల్లో జీవించి ఉన్న ఇ.వి.ఆర్.పెరియార్ తన వార్తాపత్రిక 'విడుతలై'లో ఇలా రాశారు. "డాక్టర్ అంబేద్కర్ చనిపోయారని అకస్మాత్తుగా ప్రకటించడం వెనుక ఏదో కుట్ర ఉందని నాకు అనిపిస్తోంది. గాంధీ మరణం వెనుక ఏ కారణం, ఏ కుట్ర ఉన్నాయో అలాంటివే అంబేద్కర్ చనిపోవడం వెనుక ఉన్నాయని నేను బలంగా నమ్ముతున్నాను"-అంటూ చాలా వివరంగా రాశారు. మొత్తం మీద ఆయన వెలిబుచ్చిన ఆవేదనలోని సారాంశం ఏమిటంటే - గాంధీ మరణానికి కారకులెవరో, వారే అంబేద్కర్ మరణాని క్కూడా కారకులని ఆయన నిర్ధారించారు. అందుకు అవకాశమిచ్చే పలు అంశాలను కూడా ఆరోజుల్లో చాలా బయటికి వచ్చాయి. "తన తండ్రికి విషమిచ్చి తెలియకుండా చంపేశారని" స్వయాన అంబేద్కర్ కుమారుడు యశ్వంత్-ఒక అభిప్రాయం వెలిబుచ్చారు. అంబేద్కర్ అభిమానులంతా యశ్వంత్‌ను బలపరిచారు. అంబేద్కర్ మరణవార్త ఈ దేశ ప్రజలకు అనుమానాస్పదమైన వార్త అయ్యింది. "తన తండ్రిది సహజ మరణం కాదని, హత్య అనీ-దోషులెవరో తేల్చాలనీ-అంబేద్కర్ కుమారుడు యశ్వంత్ నాటి ప్రధాని నివాసం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ మరణం తర్వాత పదకొండవ రోజున, ఆయన అనుయాయులు ఢిల్లీ వీధుల్లో పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు. నాటి ప్రధాని, రాష్ట్ర పతులకు లిఖిత పూర్వక నివేదికలు, విన్నపాలు అందజేశారు. అంబేద్కర్ మరణం వెనక ఏం జరిగిందో తేల్చాలని వారు డిమాండ్ చేశారు.

నాటి ప్రధాని నెహ్రూ స్పందించి సక్సేనా నిజనిర్ధారణ కమిటీని నియమించారు. కమిటీ భారత ప్రభుత్వానికి అందజేసిన రిపోర్టు ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజల ముందు పెట్టలేదు. ఒకవేళ రహస్యాలేవీ లేకపోతే, అది బయటపెడితే అన్ని అనుమానాలకూ తెరపడినట్టయ్యేది కదా? ఢిల్లీ పోలీస్ ఐజి ఇచ్చిన వివరణను మాత్రం 27 నవంబర్ 1957 నాడు - అంటే దాదాపు సంవత్సరం తర్వాత, అప్పటి గృహమంత్రి గోవింద్ వల్లభ్ పంత్‌తో పార్లమెంట్‌లో ఒక ప్రకటన ఇప్పించారు. "అంబేద్కర్ మరణం సహజమైందని"- ఆ ప్రకటన సారాంశం! అదొక కంటి తుడుపు ప్రకటన అని దేశ ప్రజలు ఆనాడే భావించారు. అసంతృప్తితో రగిలిపోయారు. ఆనాటి నుండి నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. వ్యాసాలు, పుస్తకాలు ప్రచురింపబడుతూనే ఉన్నాయి. అసహనం, అసంతృప్తి ఏదోరకంగా బయటపడుతూనే ఉంది. 26 జనవరి 2021 నాగపూర్ ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం ముందు-అంబేద్కర్ ఎలా చనిపోయారో తేటతెల్లం చేయాలని పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. 26న జనవరినే ఎందుకు ఎంచుకున్నారంటే - ఆ తేదీన అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది గనుక! మనువాదులైన ఆరెస్సెస్ వారి పాత్ర లేకపోతే జనం వెళ్లి వారి కార్యాలయం ముందు ఎందుకు నిరసన ప్రదర్శనలిస్తారూ? అర్థం చేసుకోవాల్సిన విషయం!



**అంబేద్కర్ మరణానికి ముందు ఆయన కార్యకలాపాలు ఎలా జరిగాయో చూద్దాం! 3 డిసెంబరు 1956న అంబేద్కర్ రెండో భార్య సవితా కబీర్, ఆమె సోదరుడు బాలు కబీర్, తండ్రి కె.బి.కబీర్, ఫ్యామిలీ డాక్టర్, మాల్యాం కర్‌లు అంబేద్కర్‌తో కలిసి గ్రూప్‌ఫొటోలు దిగారు. తమ మధ్య భేదాభిప్రాయాలు లేవని, తమది సంతోషకరమైన కుటుంబమని ప్రపంచానికి చెప్పడానికే డాక్టర్ శ్రీమతి సవిత ఆ ఫొటో షూట్ ఏర్పాటు చేశారని ఒక అభిప్రాయం ఉంది. 4 డిసెంబర్ 1956, రాజ్యసభ మెంబర్‌గా ఉన్న అంబేద్కర్, ఆ రోజు రాజ్యసభకు వెళ్లారు. పార్లమెంట్‌లో మిత్రులతో సరదాగా, చలాకీగా మాట్లాడారు. అదే రోజు సాయంత్రం శ్రీమతి సవిత బంధువులు తండ్రి, సోదరుడు అందరూ ముంబాయి వెళ్లిపోయారు. అయితే, వెళ్లేముందు వారు ఆమెకు నిబ్బరంగా ఉండమనీ, ధైర్యంగా అనుకున్న పని చేయమని ప్రోత్సహించి వెళ్లారు. దీనికి కేవలం రెండు రోజుల (డిసెంబరు 6న) తర్వాత - ఆయన మరణవార్త విని అందరూ ఆశ్చర్యపోయారు. "ఇంత అకస్మాత్తుగా ఎలా చనిపోయారూ?" అంటూ ఆవేదనకు గురై, విషయం జీర్ణించుకోలేక పోయారు.**

అంబేద్కర్ మరణానికి ముందు ఆయన కార్యకలాపాలు ఎలా జరిగాయో చూద్దాం! 3 డిసెంబరు 1956న అంబేద్కర్ రెండో భార్య సవితా కబీర్, ఆమె సోదరుడు బాలు కబీర్, తండ్రి కె.బి.కబీర్, ఫ్యామిలీ డాక్టర్, మాల్యాం కర్‌లు అంబేద్కర్‌తో కలిసి గ్రూప్‌ఫొటోలు దిగారు. తమ మధ్య భేదాభిప్రాయాలు లేవని, తమది సంతోషకరమైన కుటుంబమని ప్రపంచానికి చెప్పడానికే డాక్టర్ శ్రీమతి సవిత ఆ ఫొటో షూట్ ఏర్పాటు చేశారని ఒక అభిప్రాయం ఉంది. 4 డిసెంబర్ 1956, రాజ్యసభ మెంబర్‌గా ఉన్న అంబేద్కర్, ఆ రోజు రాజ్యసభకు వెళ్లారు. పార్లమెంట్‌లో మిత్రులతో సరదాగా, చలాకీగా మాట్లాడారు. అదే రోజు సాయంత్రం శ్రీమతి సవిత బంధువులు తండ్రి, సోదరుడు అందరూ ముంబాయి వెళ్లిపోయారు. అయితే, వెళ్లేముందు వారు ఆమెకు నిబ్బరంగా ఉండమనీ, ధైర్యంగా అనుకున్న పని చేయమని ప్రోత్సహించి వెళ్లారు. దీనికి కేవలం రెండు రోజుల (డిసెంబరు 6న) తర్వాత - ఆయన మరణవార్త విని అందరూ ఆశ్చర్యపోయారు. "ఇంత అకస్మాత్తుగా ఎలా చనిపోయారూ?" అంటూ ఆవేదనకు గురై, విషయం జీర్ణించుకోలేక పోయారు.

5 డిసెంబర్ 1956న అంబేద్కర్ రెండో భార్య సవిత, ఫ్యామిలీ డాక్టర్ మాల్యాంకర్‌లు కలిసి కావల్సిన వస్తువులేవో తేవడానికి బయటికి వెళ్లారు. వాళ్లుసాయంత్రం దాకా తిరిగి రాలేదు. ఇంతసేపు ఎటు వెళ్లారని అంబేద్కర్ టైపిస్టు రట్టూను విసుగ్గా అడిగారు. తనకు తెలియదన్నాడు రట్టూ. టైప్ చేయాల్సిన కొన్ని ఉత్తరాలు అంబేద్కర్ డిక్టేట్ చేశారు. సాయంత్రం 8 గంటలకు జైనుల బృందం ఒకటి ఆయన్ను కలవడానికి వచ్చింది. ఆ మరునాడు డిసెంబర్ 6న ఒక కార్యక్రమానికి రావల్సిందిగా ఆహ్వానించింది. అంబేద్కర్ వస్తానని ఒప్పుకున్నారు కూడా! ఆ బృందం వెళ్తూ వెళ్తూ ఆయనకు ఒక పుస్తకం బహుమతిగా ఇచ్చి వెళ్లింది. అది బుద్ధుడిపై రాసిన పుస్తకం. జైనుల బృందంతో మాట్లాడుతున్నప్పుడే ఫ్యామిలీ డాక్టర్ వచ్చి జనరల్ చెకప్ చేసి, తను ముంబాయి వెలుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు. అప్పటికి అంబేద్కర్ రచన 'బుద్ధ అండ్ హిజ్ ధమ్మ' కొనసాగుతూ ఉంది. దానికి సంబంధించి కొన్ని విషయాలు టైపిస్ట్ రట్టూతో టైప్ చేయించారు. టైపిస్ట్ వెళ్లిపోయిన కొంతసేపటికి అంబేద్కర్ రాత్రి భోజనం ముగించుకుని పడక గదిలోకి వెళ్లిపోయారు. అంతే!!

ఆ మరునాడే అనూహ్యంగా ఆయన మరణవార్త బయటికొచ్చింది. సజావుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్న వ్యక్తి, ఆరోగ్యం ప్రమాదకరంగా లేని వ్యక్తి ఎలా మరణించారన్న అనుమానం దేశ ప్రజలకు కలిగింది. విష ప్రయోగం జరిగిందనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. ఎవరు విషప్రయోగం చేశారూ? అన్నది అధికారికంగా బయటికి రాలేదు. మామూలుగా అయితే సరుకులు తీసుకురావడానికి శ్రీమతి సవితకు ఫ్యామిలీ డాక్టర్ను తీసుకుని వెళ్ళాల్సిన పనిలేదు. తీసుకు వెళ్లారంటే అతని సహాయంతో కొనవల్సిన వస్తువేదో ఉండి ఉంటుంది. పైగా ఆ ఫ్యామిలీ డాక్టరు ఉన్నఫళంగా ఊరు విడిచి వెళ్లాల్సిన అవసరమేమొచ్చిందీ? వెళితే సవిత కుటుంబ సభ్యులతో పాటే ముంబాయి వెళ్లిపోవాల్సింది. ఒక రోజు ఆగి, ఆయన నిర్వహించిన పాత్ర ఏమిటీ? అంబేద్కర్ రెండో భార్య డా.సవితది బ్రాహ్మణ కుటుంబం, ఫ్యామిలీ డాక్టరు బ్రాహ్మణుడు, ఆనాటి అగ్రశ్రేణి దేశ నాయకులంతా బ్రాహ్మణులు. వీరందరూ కలిసి, ఆనాటి బ్రాహ్మణాధిపత్య ఆరెస్సెస్ సంస్థకు సహకరించారా? అంబేద్కర్ ఎదుగుదలని జీర్ణించుకోలేకపోయారా? ఇలా ఆనాటి దేశప్రజల్లో వ్యక్తమైన సందేహాలు అనేకం. అవే సందేహాలు ఈనాటి ప్రజల్లో కూడా ఇంకా కొనసాగుతున్నాయి.

వీటికి నేపథ్యంగా మరి కొన్ని విషయాల్ని కూడా గమనించాల్సి ఉంటుంది. 1. బౌద్ధం స్వీకరించిన లక్షలాది మందిని ఉద్దేశించి అంబేద్కర్ 15 అక్టోబర్ 1956న నాగపూర్‌లో రెండు గంటల పాటు ఉపన్యసించడం. 2. బుద్ధుడు-కార్ల్‌మార్క్స్ శీర్షికన 4వ బుద్దిస్ట్ కాన్ఫరెన్స్: 20 నవంబర్ 1956న అంబేద్కర్ నేపాల్‌లో ఉపన్యసించడం. 3.ప్రాచీన భారతంలో హిందూ మతంలోని లొసుగులు-శీర్షికన అంబేద్కర్ గ్రంథ రచనకు పూనుకోవడం.4.

**సజావుగా కార్యక్రమాలు నిర్వహించు కుంటున్న వ్యక్తి, ఆరోగ్యం ప్రమాదకరంగా లేని వ్యక్తి ఎలా మరణించారన్న అనుమానం దేశ ప్రజలకు కలిగింది. విష ప్రయోగం జరిగిందనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. ఎవరు విషప్రయోగం చేశారూ? అన్నది అధికారికంగా బయటికి రాలేదు. మామూలుగా అయితే సరుకులు తీసుకురావడానికి శ్రీమతి సవితకు ఫ్యామిలీ డాక్టర్ను తీసుకుని వెళ్ళాల్సిన పనిలేదు. తీసుకు వెళ్లారంటే అతని సహాయంతో కొనవల్సిన వస్తువేదో ఉండి ఉంటుంది. పైగా ఆ ఫ్యామిలీ డాక్టరు ఉన్నఫళంగా ఊరు విడిచి వెళ్లాల్సిన అవసరమేమొచ్చిందీ? వెళితే సవిత కుటుంబ సభ్యులతో పాటే ముంబాయి వెళ్లిపోవాల్సింది. ఒక రోజు ఆగి, ఆయన నిర్వహించిన పాత్ర ఏమిటీ? అంబేద్కర్ రెండో భార్య డా.సవితది బ్రాహ్మణ కుటుంబం, ఫ్యామిలీ డాక్టరు బ్రాహ్మణుడు, ఆనాటి అగ్రశ్రేణి దేశ నాయకులంతా బ్రాహ్మణులు. వీరందరూ కలిసి, ఆనాటి బ్రాహ్మణాధిపత్య ఆరెస్సెస్ సంస్థకు సహకరించారా? అంబేద్కర్ ఎదుగుదలని జీర్ణించుకోలేకపోయారా? ఇలా ఆనాటి దేశప్రజల్లో వ్యక్తమైన సందేహాలు అనేకం.**

బౌద్ధంలోని భారతదేశ ప్రజల్ని అధిక సంఖ్యలో మార్చాలని తలపెట్టడం- వీటన్నిటి కారణంగా హిందూత్వ మనువాదులు అంబేద్కర్‌పై ద్వేషం పెంచుకున్నారా? వారి ఆలోచనా ధోరణికి అంబేద్కర్ చాలా ప్రమాదకారి కాబోతున్నాడని గ్రహించి, అడ్డుతొలగించుకున్నారా? బహుశా? ఒకవైపు రాజకీయంగా, మరొకవైపు, తాత్త్వికంగా, ఆధ్యాత్మికంగా దేశంలో తిరుగులేని నాయకుడైన అంబేద్కర్‌తో తమకు ఎప్పటికైనా ప్రమాదమేనని అనుకున్నారా? ఇవన్నీ ఆనాటి, జనం వెలిబుచ్చిన సందేహాలు!

అంబేద్కర్ ఇంకొంత కాలం బతికిఉంటే, దేశంలో పరిస్థితులు వేరొక రకంగా ఉండేవి. దేశంలో బౌద్ధం ఉధృతంగా వ్యాపించేది. ఆర్య బ్రాహ్మణుల మనువాద సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కుట్రలు సత్వరం బట్టబయలయ్యేవి. వీరు కల్పించిన హిందూ దేవీ దేవతల మాయలు, మంత్రాలు నిర్వీర్యమై పోయేవి. అభ్యుదయం కొత్తపుంతలు తొక్కేది. కనీసం మత సామరస్యం కొనసాగేది. మత కలహాల పేరిట అఘాయి త్యాలు, మారణకాండలు ఆగేవి. ఎటు నుండి ఎటు చూసినా, ఏరకంగా విశ్లేషించుకున్నా - అంబేద్కర్ మరణం ఎవరికి లాభం? కేవలం మనువాదులకే! వారిచే నిర్వహించబడే ఆరెస్సెస్ సంస్థకే!! దాని ఇతర అనుబంధ సంస్థలకే!! భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలన్న వారి కోరిక స్వాతంత్ర్యం రాక ముందు నుండే ఉంది. దేశ విభజన జరిగినపుడు అటు ముస్లిం రాజ్యం పాకిస్థాన్ ఏర్పడింది. గనుక ఇటు హిందూ రాజ్యం ఏర్పడాలనే కదా వారు కోరుకున్నదీ? దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకోకుండా బ్రిటీష్‌వాని భజన చేసింది ఎందుకూ? జాతీయ జెండాను ఎగరేయకుండా ఏండ్లకేండ్లు తమ కాషాయ జెండానే ఎగరేసుకున్నది ఎందుకూ?

నెహ్రూజీ తొలి ప్రధాని అయ్యారు కాబట్టి, సోషలిజానికి, వైజ్ఞానిక ప్రగతికి ఆయన ప్రాధాన్యమిస్తూ వచ్చారు. అప్పుడు వీరి ఆటలు అంతగా సాగలేదు. అయినా ఆశ వదులుకోకుండా వారి లక్ష్యసాధనకు వారు, నిరం తరం కృషిచేస్తూనే వస్తున్నారు. దాని ఫలితాలను నేడు కూడా మనం చూస్తూనే ఉన్నాం! డా. అంబేద్కర్‌ది సహజ మరణమా? లేక హత్యా అనేది ఆ రోజుల్లో బయటికి రాలేదు. అరవైఎనిమిదేండ్ల తర్వాత, ఆధారాలన్నీ చెదిరిపోయిన తర్వాత ఇప్పుడు అదే ఆరెస్సెస్ నడిపిస్తున్న ప్రభుత్వ హయాంలో బయటికి వస్తుందన్న నమ్మకం లేదు గానీ- గతంలో జరిగిన కొన్ని వాస్తవాలు ఈ తరానికి తెలియజేయడం అవసరమనిపించింది. అయితే, బాబాసాహెబ్ అర్థాంతరంగా వదిలేసిన కర్తవ్యాలని, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనని ఈతరం యువతీ యువకులు ముందుకు తీసుకు పోవాల్సి ఉంది. ఈ పోరాటం నిరంతరం కొనసాగుతూ ఉండాల్సిందే!

(Ref: 1st JAN,1818 REVOLT OF INDEPENDENCE BY; VILAS KHARAT-BAMCEF 2003 Rediff.com.India News\2016 Hindi.one India. Com 2017 BAMCEF 2019 Jaibheem.Bligspot.com\Ambedkar's last

(6 డిసెంబర్, అంబేద్కర్ వర్థంతి)

- కేంద్ర సాహిత్య అకాడమీ, అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త,(మెల్బోర్న్)నుంచి

---

# సమానత్వం, సామాజిక న్యాయం: అంబేద్కర్‌వాదం



టి.సైలాబ్ బాబు
9177549646


ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోడీ భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఒక మత ప్రచారకుడిలా మాట్లాడారు. హిందువులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.హిందువులు ఐక్యంగా లేరని, అసమానతలతో ఉన్నారని మోడీ అంగీకరించారు. సామాజిక అంతరాలు తొలగిపోవడానికి ఐక్యం కావలన్నారా? అగ్రవర్ణ హిందువులను ఐక్యం చేస్తారా?అణగారిన వర్గాల హిందువులను ఐక్యం చేస్తారా? తేల్చిచెప్పాలి. 'మనమంతా హిందువులం.. గంగాజల బిందువులం.. బంధువులం' అని ఆరెస్సెస్ నిరంతరం వల్లేవేస్తున్నది. ఒకే కులంలోపుట్టిన వాళ్లు మాత్రమే బంధువులు అవుతున్నారు.వేర్వేరు కులాల వాళ్లు స్నేహి తులు మాత్రమే అవుతున్నారు. దేశంలో 6486 కులాల వాళ్లు అందరూ హిందువులే కదా అన్ని కులాలను రద్దుచేసి ఒకే కులం పెట్టగలిగితే హిందువు లంతా ఏకమవుతారు కదా? ఒకే కులానికి ఒప్పుకుంటారా? స్వకుల వివాహ పద్ధతిని తిరస్కరించి కులరహిత పెళ్లిళ్లకు ప్రధాని మోడీ పార్లమెంట్‌లో బిల్లుపెట్టి చట్టం చేస్తారా? దాని ద్వారా మాత్రమే హిందువులు ఐక్యం కాగలరు.ఇలాంటి ఐక్యతకు ఆరెస్సెస్- బీజేపీ సిద్ధమవుతుందా? అనేది ప్రధాన ప్రశ్న.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రధాని మోడీ భారత రాజ్యాంగ గ్రంథాన్ని కండ్లకు అద్దుకున్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని తమపై ప్రతిపక్షాలు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.కానీ గత పదేండ్ల కాలంలో మోడీ సర్కారు రాజ్యాంగాన్ని రద్దు చేయకుండానే దాని మౌలిక లక్ష్యాలను పాతాళంలోకి తొక్కేసింది. 'మనుస్మృతి మా పవిత్ర ప్రాచీన రాజ్యాంగం' అని ఆరెస్సెస్ కార్యకర్త కృష్ణారెడ్డి ఒక గ్రంథం రాశారు. దాన్ని 2022 ఫిబ్రవరి 23న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. ప్రస్తుత బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ బాహాటంగా భారత రాజ్యాంగంలో లౌకికవాదం అనే పేరును తొలగిస్తామని చెప్పారు. బీజేపీ విధానం రాజ్యాంగ రక్షణే అయితే ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? మూడువేల ఏండ్లుగా మనుస్మృతి దుష్ట ఫలితాలవల్ల మన దేశంలో మెజార్టీ హిందువులు చదువు, సంపద, ఆస్తులు, ఆభరణాలు, ఆయుధాలు, అధికారా లు నిషేధించబడ్డాయి. వాటిని ఎలా సరిదిద్దగలరో చెప్పగలరా? మెజార్టీ హిందు వులు ఈ అసమానతలు ఎందుకు అనుభవిస్తున్నారో వివరించగలరా?75 ఏండ్ల భారత రాజ్యాంగం తర్వాత కూడా నేటికీ సంపూర్ణ అక్షరాస్యత ఎందుకు సాధించలేక పోయాం? ఎందుకు నిలువ నీడ లేక లక్షలాది మంది పేదలు పట్టణాల్లో గుడిసెలు వేసుకుంటున్నారు? సమాధానం చెప్పగలరా?

77 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత ఒక్క ముస్లిం, ఒక్క క్రైస్తవుడు ఈదేశాన్ని పరిపాలించలేదు కదా. హిందువుల జీవితాలు ఎం దుకు మారలేదు. ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో మనదేశం 107స్థానంలో ఎందుకుంది? ప్రపంచ ఆకలిసూచిలో132 స్థానానికి ఎందుకు దిగజారాం? మన దేశం జీడీపీ 8.1 నుండి 5.4శాతానికి ఎందుకు పడిపోయింది? ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు హిందువులకు ఎందుకివ్వలేదు? ఇటీవల ఆగస్టు1న అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ చేసుకునే అవ కాశం రాష్ట్రాలకు కల్పిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పు తర్వాత అట్టడుగు వర్గాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. మాలలంతా మనువాదు లేనని ఒకరు, మాదిగలంతా మనువాదులని వ్యాఖ్యలు చేసుకుంటున్నారు. ప్రపంచ ప్రఖ్యాత మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఒక కులం నాయకుడిగా ,ఈ తీర్పు తర్వాత మాల నాయకుడిగా మారుస్తున్నారు. అంబేద్కర్ మాల కాదు, జగ్జీవన్ రామ్ మాదిగ కాదు ఒక రాష్ట్రంలో బీసీలో ఉన్న ఒక కులం మరో రాష్ట్రంలో ఎస్సీగా ఉంటుంది. దేశంలో 1500 ఎస్సీ కులాల్లో అంబేద్కర్ పుట్టిన మహర్ కులం కూడా ఒక షెడ్యూల్డ్ కులంఅంతేగాని, ఇక్కడ ఉన్న మాల కులం అక్కడి మహర్ కులం ఒకటి కాదు. మహర్, మాల వేర్వేరు. చమర్‌లు అందరూ మాదిగలు కాదు. సమగర మోచి కులం కూడా చెప్పులు కుట్టే వృత్తిలో ఉంది. అందుకని మోచి, మాదిగ ఒకటి కాదు. కులం అంటే మనువాద కులవ్యవస్థలో వియ్యం పొత్తు..కంచం పొత్తు ఉంటేనే ఒక కులంగా పరిగణిస్తుంది. దేశంలో అట్టడుగు వర్గాల విచ్ఛిన్నం మనువాదమైతే ఐక్యత విచ్ఛిన్నమవుతుంది. ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయమే అంబేద్కర్ వాదం. అసమానతలే మనువాదం. మనుస్మృతి సృష్టించిన ఈ అసమానతలను ఐక్యంగా ఎదుర్కొని ఆ మధ్యయుగాల కాలం నాటి దుష్టత్వాన్ని సమూలంగా సమాధి చేయాల్సిన అవసరం ఉన్నది.

మాల మాదిగలు సంపన్నులు కారు.నూటికి తొంభై శాతం మంది రెక్కలే ఆస్తులుగా కలిగి ఉన్న నిరుపేదలు. ఒకరిద్దరు సంపన్నులు ఉన్నమాట నిజమే, కానీ అత్యధికులు నేటికి దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్నారే. తెలంగాణ రాష్ట్రంలో 59 ఎస్సీ కులాల్లో మాల మాదిగ మినహాయిస్తే మిగిలిన 57 కులాలు నేటికి అక్షర జ్ఞానానికి నోచని దుస్థితిలో సంచార జీవనం సాగిస్తున్నారు.సభ్య సమాజంతో సంబంధం లేకుండా ఉన్నారు. వారి చదువు,ఉపాధి,నివాసం వైద్యం వాళ్ల జీవన విధానం నేటికీ అగమ్యగోచరమే.

ఎస్సీ వర్గీకరణ ఒక్కటే సర్వరోగ నివారిణి కాదు. ఆయినంతమాత్రాన అందరికి సమన్యాయం, సామాజిక న్యాయం జరిగి తీరాలి. దేశప్రజలందరి గుండెకాయగా ఉన్న భారత రాజ్యాంగం రద్దు చేస్తే దేశం తిరిగి మధ్యయుగాల్లోకి వెళుతుంది. రాజ్యాంగ రక్షణ ఐక్య కర్తవ్యం కావాలి ప్రభుత్వరంగం లేకుండా రిజర్వేషన్లు ఉండవు. సామాజిక న్యాయం సమాధి అవుతుంది.



నూటికి 80శాతంగా పెరిగిన ప్రయివేట రంగంలో రిజర్వేషన్లకోసం ఐక్యంగా పోరాడాలి. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం దేశవ్యాప్తంగా అమలుకు కృషి చేయాలి. జాతీయ గ్రామీణ ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తూ, బడ్జెట్ తగ్గిస్తూ దళితుల నోటికాడి బుక్క లాగేస్తున్న బీజేపీ విధానాలపై పోరాడాలి.బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ తాత్సారం చేయడాన్ని ప్రశ్నించాలి.దేశవ్యాప్తంగా దళితులను టార్గెట్‌గా చేసుకొని మతోన్మాదులు సాగిస్తున్న దౌర్జన్యాలను ప్రతిఘటించాలి. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై పెరుగు తున్న దాడుల్ని ఐక్యంగా ఎదుర్కోవాలి. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో దళితులు అభద్రతలో ఉన్నారు. ఆ దౌర్జన్యాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలి.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత లక్ష్యం కులనిర్మూలన, అసమానతలు లేని భారతం. కానీ ఆయన లక్ష్యాలు అధ్యయనం చేయకుండా అంబేద్కరిస్టులు కాలేరు. భూమి జాతీయకరణ జరగాలని, పరిశ్రమల్లో కార్మికులకు కూడా యాజమాన్య వాటా ఉండాలని, స్త్రీ పురుష సమానత్వం కోసం ఆయన హిందూ కోడ్ బిల్లు తెచ్చి నాటి ప్రభుత్వాలు అంగీకరించకపోతే కేంద్ర క్యాబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1948లోనే కార్మికులకు కనీస వేతనచట్టం తీసుకొచ్చారు. అందుకే అట్టడుగు ప్రజల ఐక్యతలోనే అంబేద్కర్ ఉంటాడు. సమన్యాయం కోసం సమన్వయంతోనే అంబేద్కర్ లక్ష్యాలు సాధిస్తామన్న విషయం గమనించాలి.

**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత లక్ష్యం కులనిర్మూలన, అసమానతలు లేని భారతం. కానీ ఆయన లక్ష్యాలు అధ్యయనం చేయకుండా అంబేద్కరిస్టులు కాలేరు. భూమి జాతీయకరణ జరగాలని, పరిశ్రమల్లో కార్మికులకు కూడా యాజమాన్య వాటా ఉండాలని, స్త్రీ పురుష సమానత్వం కోసం ఆయన హిందూ కోడ్ బిల్లు తెచ్చి నాటి ప్రభుత్వాలు అంగీకరించకపోతే కేంద్ర క్యాబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1948లోనే కార్మికులకు కనీస వేతనచట్టం తీసుకొచ్చారు. అందుకే అట్టడుగు ప్రజల ఐక్యతలోనే అంబేద్కర్ ఉంటాడు. సమన్యాయం కోసం సమన్వయంతోనే అంబేద్కర్ లక్ష్యాలు సాధిస్తామన్న విషయం గమనించాలి.**

కేంద్ర బీజేపీ పాలకులు మతం కేంద్రంగా పరిపాలన చేస్తూ రాజ్యాంగం మౌలిక పునాదుల్ని తుంచే కుట్రలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలో అట్టడుగు వర్గాల ఐక్యత సమన్వయం సామాజిక న్యాయం వైపుగా అడుగులు వేయాలి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అస్పృశ్యుల ఐక్యతకు జీవితాన్ని ధారపోశాడు. అట్టడుగు కులాల్లో అనైక్యతను సృష్టించే మనువాద ఎజెండా మన తరగతుల్లో విస్తృతంగా అమలవుతున్నది. అంబేద్కర్, పూలే, మార్క్స్ ఆలోచనలు ఆశయాలు నేటితరం ఆకలింపు చేసుకొని ముందుకు సాగాలి. అట్టడుగు వర్గాల్లో ఐక్యతను సాధించకుండా రాజ్యాంగ లక్ష్యాలను రక్షించుకోలేము. సామాజిక న్యాయాన్ని సాధించుకోలేము. వర్గీకరణ అంశంపై మాల, మాదిగ మేధావులతో సంఘీభావ కమిటీ ఏర్పడాలి. శాంతి చర్చలు, సమన్యాయం జరగాలి. విద్వేషాలు రెచ్చగొట్టడం మనువాద సంస్కృతి, విశాలత ఐక్యత అంబేద్కర్ సంస్కృతి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వర్థంతి సందర్భంగా దళితుల్లో ఐక్యతను సాధించడమే అంబేద్కర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.

## సీపీఐ(ఎం) సానుభూతిపరుడు గురవయ్య మృతి

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**



మండలంలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరుడు నీలం గురవయ్య (90) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందారు. గురవయ్య మృతదేహాన్ని సీపీఎం మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి సందర్శించి మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సుదర్శన్‌రెడ్డి అన్నారు. మృతునికి భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురవయ్య మృతదేహాన్ని సందర్శించిన నివాళు లర్పించిన వారిలో సీపీఎం మండల నాయకులు పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, చామకూరి రవీందర్, రేగళ్ల రామన్న, పున్నం సంగయ్య తదితరులు ఉన్నారు.




## న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థుల వన సమారాధన

- విద్యార్థులు ప్రకృతితో మమేకం కావాలి
- కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు

**నవతెలంగాణ-వైరా**

న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు గురువారం వనసమారాధన నిర్వహించారు ఆట పాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో కేరింతలు కొట్టారు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేష్ రావు, డైరెక్టర్ కుర్రా సుమన్‌లు సమారాధన కార్యక్రమాన్ని పూజలతో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతితో మమేకమయి, ఆట పాటలతో మైమరచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజి మాథ్యూ, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

**నవతెలంగాణ-కొణిజర్ల**



మండల పరిధిలోని పెద్దగోపతిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.నవీన్‌బాబు గురువారం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనంను మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన సరుకులు అందుబాటులో ఉండాలని, ప్రతి రోజూ కూరగాయలు, ఆకుకూరలతో పాటు రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. అదే విధంగా తాగునీరు, మూత్రశాలలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు మాదినేని నరసింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావు అరెస్టు పిరికిపందల చర్య..

- మధిర మున్సిపల్ ఛైర్‌పర్సన్

**నవతెలంగాణ-మధిర**

మాజీ మంత్రి హరీష్‌రావును హైదరాబాదులో కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేపించడం పిరికి పందల చర్య అని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత జయకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని అన్నారు. అమలు చేయాలని డిమాండ్ చేస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులతో తప్పుడు కేసులు బనాయించి మాజీ మంత్రి హరీష్ రావును అరెస్టు చేపించటం అత్యంత హేయమైన చర్య అన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

## రైతులు అధైర్య పడొద్దు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు

**నవతెలంగాణ- నేలకొండపల్లి**



బుధవారం రాత్రి మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రా లలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుం దని, రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. గురువారం మండలంలోని మంగాపురం తండా గ్రామంలోని ఆరుబయట కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షంతో తడిసిన ధాన్యం రాశు లను ఆయన సందర్శించి, రైతులను పరామర్శించారు. రైతులను పరామర్శించిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేగినాటి లక్ష్మీనర్సయ్య, మార్కెట్ డైరెక్టర్ భూక్యా సిత్య, పీఏసీఎస్ చైర్మన్ ధరవత్ బాలాజీ, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

**నవతెలంగాణ-కూసుమంచి**




మండలంలోని కూసుమంచి, జీళ్ళచెరువు, గట్టుసింగారం, నాయకన్‌గూడెం, చేగొమ్మ, జుజ్జులరావుపేట క్లస్టర్లలోని రైతు వేదికలలో ప్రపంచం మట్టి దినోత్సవం సందర్భంగా గురువారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని జీళ్ళచెరువు, కూసుమంచి రైతు వేదికలలో మండల వ్యవసాయ అధికారి రామడుగు. వాణి పాల్గొన్నారు. మిగతా రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేల కలుషితం కాకుండా భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన, స్థిరమైన సజీవ వనరుగా నేలను అందించడం మన బాధ్యత అన్నారు. అనంతరం మట్టి పరీక్ష ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరించే విధానం గురించి తెలిపారు. మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలో క్షేత్ర ప్రదర్శన ద్వారా చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్, ప్రియాంక, సౌమ్య, సాయిరాం, వంశీ , రవికుమార్ పాల్గొన్నారు.

## విద్యారంగంలోనే ఎక్కువ మందికి ఉపాధి

**మోటివేషనల్ స్పీకర్ నవాబ్ పాషా**

**నవతెలంగాణ-తల్లాడ**




విద్యారంగంలోనే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని మోటివేషనల్ స్పీకర్ మహమ్మద్ నవాబ్ పాషా తెలిపారు. మండల పరిధిలోని నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్సి విద్యార్థులకు గురువారం మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ చదువుకు డబ్బు ఆటంకం కాదని, డబ్బు లేని వారు కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలు చేరిన వారు ఎందరో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నూతనకల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.రమేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రపంచ మృత్తిక దినోత్సవం

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**



మండల పరిధిలోని మీనవోలు, ఎర్రుపాలెం, ఇనగాలి, బనిగండ్లపాడు, మామునూరు రైతు వేదికల నందు ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బోయినపల్లి సాయిశివ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణకు పలు సూచనలు తెలిపారు. మట్టి నమూనాల సేకరణ విధానం, భూసార పరీక్ష ఫలితాల వలన పొందే ప్రయోజనాల గురించి సూచనలు చేశారు. భూసార పరీక్షా ఫలితాల ద్వారా పంటలకు వినియోగించే ఎరువుల మోతాదు నిర్ణయించటమే కాకుండా సమపాళ్లలో వాడుకొని మృత్తిక సంరక్షణకు తోడ్పడుతూ ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చు అని రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారుల బృందం, సింధూర్, బాలకృష్ణ, కృష్ణ కుమారి, ప్రసన్న, గోపి రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో రుణమాఫీ కాని రైతులు లక్ష మంది

- రూ.2 లక్షలలోపు పూర్తి అనే ప్రభుత్వ ప్రకటన మోసపూరితం
- రైతు రుణమాఫీపై నేటి నుంచి రైతు పోరు బాట
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

**నవతెలంగాణ - ఖమ్మం**



జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా రుణమాఫీ కాలేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు రుణమాఫీ ప్రక్రియ పూర్తియినట్లుగా ప్రకటన చేయటం రైతులను మభ్య పెట్టేందుకు అని అన్నారు. ఖమ్మం డిసిసిబి పరిధిలో 80 వేల మందికి పైగా రైతుల రుణమాఫీ చేయకుండా పూర్తి ఎలా అవుతుందని అన్నారు. నవంబర్ 30 రైతు విజయోత్సవ సభలో విడుదల చేసిన మూడు వేల కోట్ల రూపాయల్లో ఒక రూపాయి కూడా ఇంకా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయలేదని ఆరోపించారు. వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులు కనీసం నాలుగు విడత రుణమాఫీ జాబితాలో పేర్ల వివరాలు కూడా రైతులకు చెప్పె పరిస్థితి లేదని అన్నారు. ఆధార్ కార్డ్, బ్యాంకు ఎకౌంటు అనుసంధానంలో జరిగిన తప్పులు, ఇంటి పేర్లు, రైతులు పేర్లు, ఆధార్ కార్డులో ఉన్న పేరు సరిపోల్చ లేదని టెక్నికల్ సమస్యలు పేరుతో వేలాదిమంది రైతులు రుణమాఫీ చేయలేదు అన్నారు. బ్యాంకులో రుణం పొందినప్పుడు పట్టాదార్ పాస్ పుస్తకం కలిగి ప్రస్తుతం పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకు రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతు మరణించి ఉంటే అలాంటి వారికి కూడా రుణమాఫీ వర్తించలేదని అన్నారు. రుణమాఫీలో సమస్యలకు బ్యాంకు అధికారులు వ్యవసాయ అధికారుల తప్పిదంగా ప్రభుత్వం వారిపై మోపి సమస్య నుంచి తప్పుకోవాలని చూస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు . రుణమాఫీ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రైతు సర్వే, ఆందోళన వారం రోజులు పాటు కొనసాగిస్తాం అన్నారు. రైతుల నుంచి వివరాలు సేకరణ పూర్తి చేసి పోరాటం నిర్వహించాలని సమావేశంలో తీర్మానించిందన్నారు. రైతులు పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, ఎస్‌కె మీరా, బిక్కసాని గంగాధర్, వీరబాబు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

**నవతెలంగాణ- ఎర్రుపాలెం**




డిసెంబర్ నెల 14 ,15 తేదీలలో సత్తుపల్లిలో జరిగే జిల్లా ఆరవ మహాసభలకు ఉపాధ్యాయులు ఎక్కువ శాతం హాజరై జయప్రదం చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రం ఎర్రుపాలెంలోగల విశ్రాంతి ఉద్యోగులు భవనం నందు యుటిఎఫ్ మండల పదకొండవ మహాసభ కంచర్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభనుద్దేశించి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ-కుబేర్‌లో పెండింగులో ఉంచిన బిల్లులన్నింటినీ క్లియర్ చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని ఇందుకు ప్రజాప్రాతి నిత్యచట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి బంధకంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత ఫెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు నిరంతరం ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. 317 జి.ఓ వల్ల ఉత్పన్నమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాలయాపన తగదని ప్రభుత్వానికి సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, కేజీ తరగతులు ప్రవేశపెట్టి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని అన్నారు. ఉన్న బడులను అభివృద్ధి చేయాలని, నూతన బడులు అవసరం లేదని ప్రభుత్వానికి సూచించారు. వివిధ రకాల గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టుకు తగ్గ మినిమం బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రెండవ పిఆర్సీ నివేదిక తెప్పించుకొని మెరుగైన ఫిట్మెంట్‌తో అమలు చేయాలని, పెండింగులో ఉన్న నాలుగు డిఏలను విడుదల చేయాలని, ఐదు వేల ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది. ముందుగా వివిధ నివేదికలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. మండల మహాసభ ప్రారంభానికి ముందు ఎస్‌టిఎఫ్ఐ పతకాన్ని మండల సీనియర్ నాయకులు బండారుపల్లి రాజారావు, టీఎస్ యుటిఎఫ్ పతకాన్ని మరో సీనియర్ నాయకులు సూరి ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారి సురేంద్ర, తాసిల్దార్ మన్నె ఉషా శారద, కార్యదర్శి, మండల ఇంచార్జి షేక్ నాగూర్ వలి, మండల ప్రధాన కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఆర్ లక్ష్మణరావు, మీరాఖాన్, నంద్రు వెంకటేశ్వరరావు, మండల ఆఫీస్ బేరర్స్ టి.రత్తమ్మ, టి.వెంకట కృష్ణ, అనిత రెడ్డి, శివ పార్వతి, సైదారావు, జి శ్రీనివాస్, డి.రమేష్, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి కే.రవిబాబు

**నవతెలంగాణ- బోనకల్**



విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ మంచిగా చదువుకొని ఉన్నత ఫలితాలు తీసుకురావాలని బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి కందుల రవిబాబు కోరారు. బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అదే విధంగా కళాశాలలో ఉన్న అన్ని రకాల రికార్డులు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య డిఐఈఓ, కళాశాల ప్రిన్సిపాల్‌లతో ఇటీవల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, అనేక నిర్ణయాలను తీసుకున్నారని తెలిపారు. ఆ నిర్ణయాలను కళాశాలలో తప్పనిసరిగా అమలు చేస్తే తీరాలన్నారు. కళాశాలలో విద్యార్థులు హాజర శాతాన్ని పెంచాలని సూచించారు రెండు మూడు నెలలకు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు అవసరమైతే విద్యార్థులతో కూడా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చదువు పైనే దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్మీడియట్ పునాది అని ఆ పునాది మంచిగా వేసుకుంటేనే భవిష్యత్తు బంగారం లాగా ఉంటుందన్నారు. లేకపోతే భవిష్యత్ చీకటిమయం అవుతుందని హెచ్చరించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాస్థాయిలో మంచి ఫలితాలు సాధించి కళాశాలను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కూడా సమావేశం అయ్యారు. అనంతరం సైన్స్ అధ్యాపకులతో ప్రాక్టికల్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

## బరువుగా మారిన బాల్యం

- అంధత్వంతో పిల్లల అవస్థలు
- దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు

**నవతెలంగాణ- ఖమ్మం**



పసికందుకు జ్వరం వచ్చిందని ఆసుపత్రికి తీసుకెళ్తే పరిశీలించిన పిల్లల వైద్యుడు బాబుకు కళ్ల సమస్య ఉందని.. కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించే వరకు ఆ తల్లిదండ్రులకు సమస్య గురించి తెలియదు. ఆ తరువాత ఎన్ని ఆసుపత్రులకు తిరిగినా ప్రయోజనం చేకూరలేదు. రెండోసారి పాప పుట్టగానే అనుమానంతో కంటి వైద్యుడిని సంప్రదించినా ఉపయోగం లేకుండా పోయింది. కడుపున పుట్టిన ఇద్దరు పిల్లలకు చూపు లేకపోవటం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

ఖమ్మం నగరంలో కస్బాబజార్ ప్రాంతానికి చెందిన జియాఉద్దీన్, ఆఫ్రిన్ సుల్తానా దంపతులకు జన్మించిన జాబిరుద్దీన్(6), పాలిహా మనల్(4)కు పుట్టుకతోనే కళ్ల కనిపించటం లేదు. నరాల బలహీనతతో ఈ సమస్య ఉత్పన్నమైందని వైద్యులు తెలిపినట్లు జియాఉద్దీన్ దంపతులు చెబుతున్నారు. రోజూ కూలీకి వెళ్తూ జీవనం సాగిస్తున్న ఈ దంపతులకు తమ కంటిపాపల పరిస్థితి మరింత కుంగదీసింది. ఉన్నతాధికారుల సూచన మేరకు పిల్లలను హైదరాబాద్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటివరకు తమ కుటుంబానికి రేషన్‌కార్డు లేదని, పిల్లలకు ఆసరా పింఛను మంజూరు కావటం లేదని దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు సొంతిల్లు లేక ప్రతినెలా అద్దెలు కట్టలేక ఆర్థికంగా చితికిపోతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు, పిల్లలకు ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని జిల్లా మంత్రులను, ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు.

## పాలేరు డివిజన్ మహాసభను జయప్రదం చేయండి : సీపీఐ(ఎం)

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**



మండలంలోని ఏదులాపురం గ్రామంలో ఈ నెల 12వ తేదీన జరిగే సీపీఎం పాలేరు డివిజన్ 8వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి అన్నారు. డివిజన్ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ఏదులాపురం, వరంగల్ క్రాస్ రోడ్, ఎం.వెంకటాయపాలెం, కాచిరాజు గూడెం గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేకుండా నిరంతరం పోరాడే ప్రజా ఉద్యమాల సారథి సీపీఎం అని, అలాంటి సీపీఎం మహాసభలు ఈనెల 12వ తేదీన జరుగుతున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారని, ఈ మహాసభలో 400 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నంద్ర ప్రసాద్, పి.మోహన్‌రావు, పొన్నెకంటి సంగయ్య, నందిగామ కృష్ణ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, మేడికొండ నాగేశ్వరరావు, దుండిగల వెంకటేశ్వర్లు, పొన్నం వెంకట రమణ, చావా నాగేశ్వరరావు, యండపల్లి వెంకట్రామయ్య, జక్కంపూడి నాగేశ్వరరావు, పొన్నం భాస్కరరావు, మురళి, గురవయ్య, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రేపు సీపీఐ(ఎం) మధిర డివిజన్ మహాసభ

- పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**



సీపీఐ(ఎం) మహాసభలు గ్రామ శాఖ నుండి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరగనున్నాయని, ఈ మహాసభలు ప్రజల సమస్యల పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకుంటామని జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య తెలిపారు. పార్టీ మధిర డివిజన్ మహాసభలు మధిర మండలంలోని మల్లారం గ్రామంలో డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. నారాయ ణపురం గ్రామంలో పార్టీ విరాళాల సేకరణ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పార్టీ మధిర నియోజకవర్గ స్థాయిలో ఎర్రుపాలెం, మధిర టౌన్, రూరల్, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల నుండి సుమా రుగా 550 మంది ప్రతినిధులు ఎంపిక కాబడ్డారని, ప్రతినిధులతో మహాసభ నిర్వహించనున్నట్ల తెలియజేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిలుగా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, బండి రమేష్ ఈ మహాసభల్లో పాల్గొననున్నారని తెలిపారు. మధిర నియోజకవర్గంలో ఉన్న పలు ప్రజా సమస్యలను పరిష్కారం కోరుతూ పలు తీర్మానాలను ఆమోదించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ, మండల కమిటీ సభ్యులు గామసూ జోగయ్య, గౌరాజు రాములు, తాళ్లూరి నారాయణ రెడ్డి, కుడెళ్ళి నాగేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

## కులాంతర వివాహితులకు రక్షణ చట్టం తేవాలి

- ఐద్వా మండల కార్యదర్శి జాజిరి జ్యోతి

**నవతెలంగాణ-సత్తుపల్లి**




కులాంతర వివాహాలు చేసుకున్న దంపతుల కోసం రక్షణ కోసం చట్టాన్ని తీసుకురావాలని ఐద్వా సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రామ గోవిందాపురం, తాళ్లమడ గ్రామాల్లో గురువారం రాత్రి మహిళా సమస్యలపై సదస్సులను నిర్వహించారు. సమాజంలో మహిళలు వివక్షకు గురవుతున్నారన్నారు. పురుషాధిక్యత విజృంభిస్తోందన్నారు. మైనరు బాలికలు, మహిళలపై రోజురోజుకి అత్యాచారాలు, హత్యలు పెరిగి పోతున్నాయని జ్యోతి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలను మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు బార్‌లను తలపిస్తున్నాయన్నారు. దీంతో యువత పక్కదారి పడుతోందన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సదస్సుల్లో ఐద్వా మండల అధ్యక్షురాలు ఎలగం పార్వతి, జయలక్ష్మి, నాగమణి, కుమారి, వెంకటరమణ, లక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

# తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణ వ్యయం, వివరాలేంటి..?

- లోక్ సభలో ప్రశ్నించిన ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి

**నవతెలంగాణ- ఖమ్మం**



రాష్ట్రంలో కొనసాగుతున్న..జాతీయ రహదారుల ప్రస్తుత నిర్మాణ పరిస్థితి ఏంటని..కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధుల వివరాలు ఏంటి..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా.. గురువారం మాట్లాడగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా అవసరాల మేరకు.. పూర్తి స్థాయిలో రోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధుల సహకారంతో పాటు కేంద్ర ప్రభుత్వం.. 2024-25 సంవత్సరం వరకు రూ.4,494కోట్లతో తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా..భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రుద్రంపూర్-భద్రాచలం సెక్షన్ పనులు, ఇంకా వివిధ ప్రాంతాల్లో.. హైదరాబాద్-భూపాలపట్టణం రహదారి పనులు, మహబూబ్ నగర్-చించోలి రహదారి విస్తరణ పనులు.. తిరుమలగిరి-సూర్యాపేట రోడ్డు విస్తరణ ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అన్నీ..సకాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని వివరించారు.

## మిషన్ భగీరథపై అవగాహన కార్యక్రమం

**నవతెలంగాణ-పెనుబల్లి**

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పెనుబల్లి మండలంలో గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ విజయలక్ష్మి, ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామ పంచాయతీలో వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి, క్లోరి నేషన్ చేపట్టారు. బయన్న గూడెం, తుమ్మలపల్లి, చౌడవరం, చిన్నమ్మ గూడెం గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు పరిధిలోని ఆవరణలో క్లీనింగ్ చేపట్టి మిషన్ భగీరథ మంచినీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వినోద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కులాంతర వివాహాలకు రక్షణ చట్టం చేయాలి

- ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి

**నవతెలంగాణ-పెనుబల్లి**




పోలీస్ కానిస్టేబుల్ నాగమణిపై హత్యకు పాల్పడిన నిందితున్ని వెంటనే శిక్షించాలని, ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనుబల్లి ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో లంకపల్లిలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయప్రోలు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కొంగరి నాగమణిని గత నెల 10న దళిత యువకుడైన శ్రీకాంత్ వివాహం చేసుకున్నాడని, ఆమె సోదరుడు అతి కిరాతకంగా నడిరోడ్డుపై హత్య అత్యంత దారుణం అన్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా ఇటువంటి ఘటనలను పునరావతం కాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కులాంతర వివాహాలకు రక్షణ చట్టం చేయాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను, ప్రభుత్వాలు పోలీసులు కాపాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసు నాగేశ్వరి, గోళ్ళ పద్మప్రియ, పిట్టల లక్ష్మి నల్లబోతుల భారతి, సరస్వతి, చిలక, రమణ, తదితరులు పాల్గొని నిరసన కార్యక్రమం తెలియజేశారు.

## ఆలయ శిఖర ప్రతిష్ఠకు సండ్ర హాజరు

**నవతెలంగాణ-వేంసూరు**

మండల కేంద్రంలో శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం కందుకూరు తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కంటే వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, రహీం, ఎర్ర రమేష్, ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించండి

- ఎంపీడీవో రమాదేవి

**నవతెలంగాణ- బోనకల్**



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన వర్కర్లను ఎంపీడీవో రురావత్ రమాదేవి ఆదేశించారు. మండల పరిధిలోనే గోవిందాపురం ఎల్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్లు శుభ్రం చేస్తున్న బియ్యాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. అదేవిధంగా వంటకు వినియోగిస్తున్న కూరగాయలను కూడా ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. వంట చేసే పరిసర ప్రాంతాన్ని కూడా ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు బియ్యాన్ని కూరగాయలను శుభ్రం చేసిన తర్వాతనే వంట చేయాలని సూచించారు. తాజా కూరగాయలతోనే కూరలు చేయాలని ఆమె ఆదేశించారు. ప్రతిరోజు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వంటకు ముందు వంట తరువాత కూడా భోజనాన్ని పరిశీలించాలని సూచించారు. భోజన విషయంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన వర్కర్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్యాహ్న భోజన విషయంపై విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కందాల ప్రభావతి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## మరణించిన అభిమానులకు 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు షేక్ హిమామ్

**నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్**



పుష్ప 2 సినిమా చూడటానికి వచ్చి మరణించిన అభిమానులకు నటుడు అల్లు అర్జున్ ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఖమ్మం జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు షేక్ హిమామ్ డిమాండ్ చేశారు. హైదరాబాదులో ఆర్టీసీ క్రాస్ రోడ్ సంధ్య థియేటర్‌కు విచ్చేసిన అల్లు అర్జున్‌ను చూడటానికి అభిమానులు చాలామంది వచ్చారు. దీంతో జరిగిన తొక్కిసలాటలో ఒక అభిమాని చనిపోయారు. మరో థియేటర్ దగ్గర కూడా ఒక మహిళా చనిపోయిందన్నారు. అల్లు అర్జున్ పై కేసు నమోదు చేసి చనిపోయిన వారికి ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు ఇచ్చి వారి కుటుంబాలు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏ హీరో అయినా ఇలాంటి చర్యలకు పాల్పడకుండా అభిమానుల ప్రాణాలు తీయకుండా చూడాలని పోలీసులు కూడా అనుమతులు ఇవ్వకుండా ఉండాలన్నారు. ఒకవేళ అనుమతులు ఇచ్చిన తగిన బందోబస్తు ఏర్పాటు చేసి అక్కడికి నటుల్ని ఆహ్వానించాలని ఆయన కోరారు. టికెట్ ధరలు పెంచి అభిమానుల దగ్గర దోచుకుంటున్నారని, ధరలు ఎప్పుడు కూడా ఒకే విధంగా ఉండేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఇద్దరు యువకుల దుర్మరణం

**నవతెలంగాణ-ఖమ్మం రూరల్**

మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటనపై గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం హైదర్ సాయి పేట పంచాయతీ పరిధిలోని పడమటి తండా గ్రామానికి చెందిన గుగులోత్ శివరాజు (19),మూడ్ హర్షవర్ధన్ (18) ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి కూసుమంచి వైపు వెళుతుండగా, కూసుమంచి వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న ఆర్టీసీ బస్ వరంగల్ క్రాస్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






## మిషన్ భగీరథ నీటిని తాగటం వల్లే ఆరోగ్యం

**నవతెలంగాణ-బోనకల్**



సురక్షితమైన మిషన్ భగీరథ నీటిని తాగటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మిషన్ భగీరథ డీఈ ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా మిషన్ భగీరథ నీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ శుద్ధి చేసిన నీటిని తాగటం వల్ల ఎటువంటి రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. ఎక్కడపడితే అక్కడ మంచి నీటిని తాగవద్దని దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. శుద్ధి జలాలను తాగటం వల్ల ఉపయోగాలు ఉన్నాయన్నారు. కొంతమంది ప్రజలు బోర్లు వద్ద బావులు వద్ద తీసుకొచ్చుకున్న నీటిని శుభ్రం చేసుకోకుండా తాగుతున్నారని దీనివల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని సూచించారు. అనంతరం వివిధ గ్రామాల్లో అన్ని నీటి సోర్స్ ల, శుద్ధ జల భాండగారాలు, చేతిపంపుల దగ్గర చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయించారు.

## జడ్పీ మాజీ చైర్మెన్ లింగాల కమల్ రాజు అరెస్ట్ పట్ల ఖండన

**నవతెలంగాణ-బోనకల్**

ఎర్రుపాలెంలో గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించేందుకు వెళ్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్చార్జి లింగాల కమల్ రాజును ఎర్రుపాలెం పోలీసులు అరెస్టు చేయటాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. గురుకుల పాఠశాలలను సందర్శించడం నేరమా అని వారు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఈ స్వేచ్ఛ ఉందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. కమల్ రాజ్ అరెస్టును ఖండించిన వారిలో ఆ పార్టీ నాయకులు వేమూరి ప్రసాద్ రావు, యార్లగడ్డ రమేష్, యంగల కనకయ్య, కొమ్మినేని ఉపేందర్, గుండపనేని సుధాకర్ రావు తదితరులు ఉన్నారు.

# మధిరలో ఆధునిక బస్టాండ్‌కు ముందడుగు

- 'డిప్యూటీ సీఎం భట్టి'కి ప్రతిపాదనలు పంపించిన ఆర్టీసీ అధికారులు

**నవతెలంగాణ-బోనకల్**



మధిర ఆధునిక బస్టాండ్ నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆర్టీసీ మధిర డిఈ సుదర్శన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. మధిర సిగలో మరో అభివృద్ధి పని చేరనుంది. నాలుగు దశాబ్దాల క్రితం పట్టణంలో నిర్మితమైన ఆర్టీసీ బస్టాండ్ స్థానంలో ఆధునిక హంగులతో నూతన ఆధునిక బస్టాండ్ నిర్మాణానికి ఒక అడుగు ముందుకు పడింది. 'మధిర సుందరీకరణ'లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాల మేరకు ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులు ఇందుకు సంబంధించిన దస్త్రాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లారు. రూ.10 కోట్లతో ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న మధిర వ్యవసాయ, వాణిజ్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇరు రాష్ట్రాల ప్రజలకు మధిర కేంద్ర బిందువుగా ఉంది. దీంతో రెండు రాష్ట్రాలకు చెందిన ప్రజలు ప్రయాణికులు ఈ మధ్యల గుండా అనే రాకపోకలు సాగిస్తున్నారు. కొవిడ్ అనంతర కాలంలో ఆర్టీసీ ప్రయాణాలు బాగా పెరిగాయి. ఈ క్రమంలో పట్టణంలో ఉన్న బస్టాండ్ పూర్తి స్థాయిలో అవసరాలను తీర్చలేకపోతుంది. వర్షాకాలంలో ఆవరణ చుట్టూ నీరు నిలుస్తుండటంతో లోనికి వెళ్లాలంటే పాదచారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శౌచాలయం నుంచి వచ్చే మురుగు దుర్గంధాన్ని వెదజల్లుతోంది. కేవలం ఈ బస్టాండ్ లో నాలుగు ప్లాట్ ఫామ్ లు మాత్రమే ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. 2.5 ఎకరాల విస్తీర్ణం ఉన్న ప్రాంగణంలో అధునాతన సౌకర్యాలతో బస్టాండ్ ఏర్పాటైతే ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయని స్థానికులంటున్నారు.

**ముందడుగు ఇలా..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది నెలల్లోనే మధిరలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రముఖులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'మధిర సుందరీకరణ' సమావేశాన్ని భట్టి విక్రమార్క నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా మధిరవాసులు బస్టాండ్ ఇబ్బందులను లేవనెత్తారు. ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలం సద్వినియోగానికి మాల్, షాపింగ్ కాంప్లెక్సు ఏర్పాటుచేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ప్రతిపాదనలు ఇలా..**

గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు రూ.4.33 కోట్లు, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.12.24 లక్షలు, గ్రౌండ్ మొత్తం మట్టితో నింపి ఎత్తు పెంచేందుకు రూ.18.55 లక్షలు, బస్టాండ్ లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.01 కోట్లు, నీటిసరఫరా, శానిటరీ, ఇతర సౌకర్యాలు రూ.5.32 కోట్లు, విద్యుదీకరణకు రూ.43.33 లక్షలు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణానికి రూ.8 లక్షలు, తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటుకు రూ.10 లక్షలు, ప్రస్తుత సముదాయం, బస్టాండ్ తొలగించేందుకు రూ.15 లక్షలు, ఆర్వో ప్లాంటు నిర్మాణానికి రూ.5 లక్షలు, హెక్టా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు రూ.30 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్టిసి డిఈ సుదర్శన్ తెలిపారు. ఈ విధంగా మొత్తం మధిర ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి రూ.10 కోట్లతో ప్రణాళికలు తయారుచేసి పంపించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి గుత్తేదారును ఎంపిక చేసి వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

## మహాలక్ష్మితో మహిళలను ఆదుకుంటున్న ప్రభుత్వం

- డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార
- ప్రయాణం నిరాటకంగా కొనసాగడం అభినందనీయం
- ఉమ్మడి ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరామ్

**నవతెలంగాణ-ఖమ్మం**



మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం... గత సంవత్సర కాలంగా నిరాటంకంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని కొనసాగించడం ప్రభుత్వం మహిళలను ఆదుకోవడమేనని ఖమ్మం డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార అన్నారు. ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం కొత్త బస్టాండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో మహిళలందరికీ ఆధార్ గుర్తింపుతో పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణం నిరాటకంగా కొనసాగడం అభినందనీయమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ మేనేజర్ సరి రామ్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం నిరాటకంగా కొనసాగడం మహిళల పట్ల ప్రభుత్వానికున్న గౌరవం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 114.34 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకొని 3856.40 కోట్ల రూపాయలు ఆదా చేశారన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 4.28 కోట్ల మంది మహిళలు ప్రయాణించి 208 కోట్ల రూపాయలు ఆదా చేశారన్నారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. ఏడాది కాలంలో 1389 కొత్త బస్సులను తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో మేనేజర్ దినేష్ కుమార్, మధిర డిపో మేనేజర్ శంకర్ రావు, పర్సనల్ మేనేజర్ జిఎస్ నారాయణ, అకౌంట్ ఆఫీసర్ బాలస్వామి, మెడికల్ ఆఫీసర్ సాయిసుష్మ, అసిస్టెంట్ మేనేజర్లు, రామయ్య శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, విజిలెన్స్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్సై కడగండ్ల మధుబాబు

**నవతెలంగాణ-బోనకల్**



ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహకారాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నప్పుడే దాతల లక్ష్యం నెరవేరునట్లు అవుతుందని ఎస్ఐ కడగండ్ల మధుబాబు అన్నారు. మండల పరిధిలోనే ఆళ్లపాడు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం కోసం పూర్వ విద్యార్థి పారా శ్రీహర్షవర్ధన్ రూ.10వేలు, శ్రీనిధి కళాశాల కరస్పాండెంట్ అనిల్ పదివేల రూపాయల, బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ బత్తినేని నాగప్రసాదరావు రూ. 20వేలను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెయ్యం శ్రీలతకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు ఎంతోమంది దాతలు వివిధ రూపాలలో సహకారం అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో మిమ్మలను పాఠశాలలకు పంపిస్తున్నారని, వారి ఆశయాలను వమ్ము చేయకుండా ఇష్టంతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్య లేకపోతే భవిష్యత్తు అంధకారంగా ఉంటుందన్నారు. ఆ పరిస్థితులు విద్యార్థులు తెచ్చుకోవద్దని సూచించారు. హెచ్ఎం శ్రీలత మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఫలితాల కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ అర్వపల్లి నాగలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.



## కొమ్మన చిన్న బాబు చిత్రపటానికి నివాళులు

**నవతెలంగాణ-వైరాటౌన్**

ఇటీవల మృతి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కొమ్మన చిన్న బాబు దశ దిన కార్యక్రమం సందర్భంగా గురువారం సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యం.సుబ్బారావు, హిమబిందు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, జనవిజ్ఞాన వేదిక మాజీ అధ్యక్షులు మల్లెంపాటి వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, సీనియర్ నాయకులు తోట నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు కొమ్మన చిన్న బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరితోపాటు మల్లెంపాటి రామారావు, మచ్చ మణి, వాసిరెడ్డి విద్యాసాగర్ రావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, విప్పలమడక మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, బోడేపూడి వీరభద్రం, గుమ్మా నర్సింహారావు, బాజోజు రమణ, తోట కృష్ణవేణి, కంసాని మల్లికంబా, దేశభక్తిని లక్ష్మీ తులసి తదితరులు నివాళులు అర్పించారు.

## కానిస్టేబుల్ నాగమణిని చంపిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఐద్వా ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి పత్తిపాక నాగ సులోచన

**నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్**

లేడీ కానిస్టేబుల్ నాగమణిని చంపిన వారికి వెంటనే కఠిన శిక్ష వేయాలని ఖమ్మం 3 టౌన్ ఐద్వా కార్యదర్శి పత్తిపాక నాగ సులోచన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఐద్వా త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం గాంధీచౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. 3 టౌన్ మహిళా సంఘం అధ్యక్షురాలు బండారు సునీత అధ్యక్షతన జరిగిన సభలో త్రీ టౌన్ కార్యదర్శి పత్తిపాక నాగ సులోచన మాట్లాడుతూ ఆస్తికోసం సొంత చెల్లెల్ని చంపడం దారుణం అన్నారు. ఈ దేశం, రాష్ట్రంలో మహిళలకు తగిన రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం త్రి టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అమీనా, భూక్య సుభద్ర, అప్జల్బీ, పాశం సైదమ్మ, సుజాత, లక్ష్మి పద్మ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.






## రేపు ఆటోలు బంద్

**నవతెలంగాణ-ఖమ్మం**

ఈనెల 7న జరిగే ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని పోస్టర్‌ను నగరంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపేందర్, ఏఐటియుసీ పేరబోయిన మోహన్ రావు, ఐఎఫ్టియు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పాటు గడుస్తున్న ఫ్రీ బస్సు వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లు ఎలాంటి ప్రకటన చేయలేదని, పలుమార్లు రాష్ట్ర నాయకులు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చిన చర్చలకు పిలవకుండా కాలయాపన చేసిందని తెలిపారు. ఎన్నికల హామీని ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయలు అమలు ప్రకటన చేయాలని కోరారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు తగ్గించి జిఎస్టిలోకి తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా 60 మంది ఆటో డ్రైవర్లు గుండెపోటు, ఆత్మహత్య చేసుకున్నా ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ప్రతి కుటుంబానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారి వరప్రసాద్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డా విజయ్, బద్రి, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులపై వేధింపులు, దాడులు ఆపాలి

- ఆర్‌ఎంపీడబ్ల్యుఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని

**నవతెలంగాణ-బోనకల్**



తెలంగాణ మెడికల్ కౌన్సిల్, ఐఎంఎ, హెచ్ఆర్‌డిఏ పేరుతో గ్రామీణ వైద్యులపై కొందరు డాక్టర్లు చేస్తున్న, వేధింపులు, దాడులను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో బొమ్మినేని మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల క్లినిక్లపై పోలీసులతో వచ్చి భయభ్రాంతులను గురిచేసి దాడులు చేస్తున్నారన్నారు. గతంలో ఉమ్మడి ఏపి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇప్పించారని, సర్టిఫికెట్స్ మాత్రం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇస్తామని, గుర్తింపు కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పొందుపరిచిందని గుర్తుచేశారు. ప్రజారోగ్యం గ్రామీణ వైద్యులతోనే నష్టం వాటిల్లుతుందని అనట్లుగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్, ఐఎంఎ, హెచ్ఆర్‌డిఏలు ప్రచారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ వైద్యులను సమూలంగా తొలగించేందుకు టిఎస్ఎంసి కుట్ర పన్నిందని ప్రభుత్వం దృష్టిసారించి గ్రామీణ వైద్యులను ఆదుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి నాటి శిక్షణ కార్యక్రమాన్ని పునరుద్ధరించి, సర్టిఫికెట్ అందజేయాలని కోరారు. ప్రయివేట్ అసుపత్రిలలో ఎంతవరకు అర్హత ఉన్న వారు విధులు నిర్వర్తిస్తున్నారో తెలపాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ను డిమాండ్ చేశారు. మెడికల్ షాపులలో ఫార్మసిస్టులు లేకుండా విక్రయాలు జరుపుతున్నారని, కిరాణ షాపులలో మందులు విక్రయాలు జరుగుతున్నాయని వీటిపై ప్రభుత్వాలు ఎందుకు నోరు మెదపడ లేదని ఆయన ప్రశ్నించారు. గ్రామీణ వైద్యుల అవసరం గ్రామాలలో ఎంతో ఉందని ప్రజాఅభిప్రాయాలతో సంతకాల సేకరణ చేయించి కలెక్టర్, రాష్ట్ర గవర్నర్, తెలంగాణ హైకోర్టులకు పోస్ట్ ద్వారా పంపే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున్న చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు షేక్ హస్సన్, సంఘం జిల్లా నాయకులు కొంగర భూషియ్య (గోపి), జెడీ ధనమూర్తి, సంఘం మండల కార్యదర్శి పి బాలు, సంఘం నాయకులు ఆకెన పవన్, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఏడిఏ సరిత

**నవతెలంగాణ-తిరుమలాయపాలెం**

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కూసుమంచి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి. సరిత పరిశీలించారు. జల్లేపల్లి, దమ్మాయిగూడెం, బీర్రోలు, రాజారాం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. తదుపరి దమ్మాయిగూడెం, బీరోలు, రాజారం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. గ్రౌండ్ బ్యాలెన్స్ స్టాక్ రిజిస్టర్ పిఓఎస్ మిషన్ టాలీ కావాలని డీలర్లను ఆదేశించారు. ఎవరైతే చట్టానికి వ్యతిరేకంగా వ్యాపారం చేస్తారో వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తదుపరి బీరోలు గ్రామంలో వరల్డ్ సాయిల్ హెల్త్ డే సందర్భంగా రైతు వేదికలో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీతారామరెడ్డి, ఏఈఓ లు నవనీత, సౌమ్య, లంక రమేష్‌లు రైతులు పాల్గొన్నారు.



## ఏపీలో విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు మృతి

- ఘటనకు నిరసనగా ఉపాధ్యాయ సంఘాల నిరసన

నవతెలంగాణ-ఇల్లందు



ఏపీలోని రాయచోటి కొత్తపల్లి ఉర్దూ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుడిపై దాడి చేశారు. దీంతో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. దీనికి నిరసనగా గురువారం రాత్రి పాత బస్టాండ్ సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ. రాంబాబు, కే.వెంకటేశ్వర్లు, డిపిటిఎఫ్, టిఎస్టిటిటీఎఫ్, ఏటీఏ, ఏటీఎఫ్ తదితరు ఉపాధ్యాయ సంఘాల నేతలు బాలు, లక్ష్మణ్ నాయక్, సారయ్య, సిహెచ్. రమేష్ మాట్లాడారు. విద్యార్థుల మధ్య జరుగుతున్న ఘర్షణ ఆపిన ఉపాధ్యాయుడు, ఇద్దరు అన్నదమ్ములు మరొక విద్యార్థి కలిసి ఇతర విద్యార్థుల మీద దౌర్జన్యం చేసిన సందర్భంలో వారిని అడ్డుకున్నందుకు ఒక్కసారిగా ఉపాధ్యాయుడిపై ఆ ముగ్గురు పిడిగుద్దులతో చెస్ట్ మీద, ముఖం మీద దాడికి పాల్పడ్డారని అన్నారు. కళ్ళద్దాలు కూడా విరిగిపోయిన పరిస్థితులలో మిగిలిన విద్యార్థులు విడిపించగా తీవ్ర ఆవేదనలో ఒక్కసారిగా ఉపాధ్యాయుడు కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి ఉపాధ్యాయులు ఆసుపత్రిలో చేర్పించారు. కాసేపటికే ఉపాధ్యాయుడు ప్రాణాలు కోల్పోయిన హృదయ విషాదకర, విచారకరమైన ఈ సంఘటన జరగటం దురదృష్టకరమన్నారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

## క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్

- ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోండి
- ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ నాగయ్య

నవతెలంగాణ-పినపాక



గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహం కల్పించేందుకు సీఎం కప్‌ను 36 క్రీడాంశాల్లో మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తామన్నారని ఎంఈఓ నాగయ్య తెలిపారు. గురువారం పినపాక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన వ్యాయామ ఉపాధ్యాయులతో, గ్రామపంచాయతీ సెక్రటరీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ నాగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 7 నుంచి సీఎం కప్ జరుగుతుందన్నారన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల, పురపాలిక, 16 నుంచి 21 వరకు జిల్లా, డిసెంబరు 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన వారికి బంగారు పతకంతోపాటు వ్యక్తిగత విభాగంలో రూ.20 వేలు, బృందానికి రూ.లక్ష, ద్వితీయ స్థాన పొందిన వారికి వెండి పతకం, వ్యక్తిగత విభాగంలో రూ.15 వేలు, బృందానికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి కాంస్య పతకం, వ్యక్తిగత విభాగంలో రూ.10 వేలు, బృందానికి రూ.50 వేలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. సీఎం కప్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు www.cmcup2024. telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ, మండల, పురపాలిక స్థాయిల్లో అథ్లెటిక్స్, ఫుట్బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, యోగా ఉంటాయని, జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్బాల్, హ్యాండ్బాల్, ఫుట్బాల్, వాలీబాల్, ఖో-ఖో, యోగా, చెస్, బేస్బాల్, కిక్బాక్సింగ్, సైక్లింగ్, వుషు, జూడో, స్నూకర్ క్రీడలను నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల పీడీలను, పిఈటిలను, గ్రామపంచాయతీ సెక్రటరీలను, ఎంఈఓ, ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ దిలీప్, పిడి వీరన్న, గ్రామపంచాయతీ సెక్రటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్దీపన పాఠ్యపుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల పరిధిలోని మైలారం గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉద్దీపన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఉమ్మడి గుండాల మండలం పీఏసీఎస్ చైర్మెన్ గొగ్గెల రామయ్య చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం అందజేశామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగ రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. ఈ ఉద్దీపన పుస్తకాలు పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కనీస అభ్యాసన స్థాయి, పెరుగుతుందని చెప్పారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగా రాంబాబు మాట్లాడుతూ.. ఐటిడిఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు, ఏపీఎస్ పాఠశాలలకు ఈ ఉద్దీపన పాఠ్యపుస్తకాలను అందించిన ఐటీడీఏ పీఓకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాథమిక విద్య అనేది విద్యార్థి ఎదుగుదల పథాన్ని నిర్మించే ఆధారమని, ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా గణితం, ఆంగ్లం నాణ్యమైన విద్య అందించడం ద్వారా విద్యార్థులు చక్కటి పరిణతి సాధిస్తారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమార్ రాజా, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినులకు హెల్త్ క్యాంప్ నిర్వహణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండలంలోని అనంతోగు గ్రామం కేజీబీవీ వసతి గృహంలో విద్యార్థినులకు గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కెవి సంఘమిత్ర ఆధ్వర్యంలో సికిల్ సెల్ స్క్రీనింగ్, హెల్త్ క్యాంపు నిర్వహించారు. దానిలో భాగంగా అనారోగ్యంతో నీరసంగా ఉన్న పిల్లలకు మలేరియా ఆర్‌డిటి చేసి, వారికి తగిన మందులు ఇవ్వడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. అదేవిధంగా హెల్త్ ఎడ్యుకేషన్ పర్సనల్ హైజీన్ గూర్చి వివరించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బి.సరోజిని, హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి, స్టాఫ్ నర్స్ సునిత, ఏఎన్ఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వేతనాల పెంపుపై అసెంబ్లీలో మాట్లాడాలి

- ఎమ్మెల్యే కూనంనేనికి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు చర్చించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటీయు) ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు డి.వీరన్న, భూక్యా రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినప్పటికీ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో, వేతనాలు పెంచడంలో, పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం అయిందని తెలిపారు. తక్షణమే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చ చేసి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న నల్ల బంగారం బొగ్గు బావల అభివృద్ధి కోసం పాటుపడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అభివృద్ధి సూచిక నడవడానికి కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థ పర్మనెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు సమానంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి సంస్థ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల వారి హక్కుల పట్ల అసెంబ్లీలో మాట్లాడి న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## గ్రామంలో కొత్త వ్యక్తులు కనపడితే సమాచారం ఇవ్వండి

- సీఐ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-పినపాక



మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండలంలో అపరిచిత వ్యక్తులు, అనుమానితులు, తారసపడితే వెంటనే 100కు కానీ, పోలీసులకు కానీ సమాచారం ఇవ్వాలని ఏడూళ్ళ బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం మండల పరిధిలోని గోదావరి సరిహద్దు గ్రామాలైన చింతల బయ్యారం, రావిగూడెం గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. స్థానికులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, కొత్త వ్యక్తులు గోదావరి దాటి వచ్చిన వారికి ఆశ్రయం కల్పించవద్దని హెచ్చరించారు. రాత్రి వేళల్లో పడవలు నడపకూడదని సూచించారు. ఈ తనిఖీలలో అయన వెంట టిజీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటుపోట్లను ఎదుర్కొని..అభివృద్ధి వైపు..!

- అభివృద్ధి కోసమే రాజకీయ నిర్ణయం
- పాత, కొత్త వారిని కలుపుకొని ముందుకెళ్తున్నా
- నియోజకవర్గ అభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళిక
- ఏడాది పాలనపై నవతెలంగాణతో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ముఖాముఖి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఆటుపోటులను అధిగమిస్తూ సవాలులను స్వీకరిస్తూ సంక్షేమ పాలనలో పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ మొదటి సంవత్సరపు పదవీ కాలాన్ని అభివృద్ధికి బాటలు వేస్తూ శాసనసభ్యునిగా ఈ ప్రాంత అభివృద్ధిలో శాశ్వత ముద్రను వేయగలిగానని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు తెలిపారు. భద్రాచలం శాసనసభ్యుడిగా సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా నవ తెలంగాణతో తెల్లం వెంకట్రావు ప్రత్యేక ముఖాముఖి..!

### నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజకీయ నిర్ణయం...

బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచినప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధి సంక్షేమం కోసమే పార్టీ మార్పు వంటి రాజకీయ నిర్ణయాన్ని తీసుకున్నాను. విద్యావంతుడిగా వైద్యుడిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని నాపై నమ్మకంతో నియోజకవర్గ ప్రజలు నన్ను ఓట్లు వేసి గెలిపించారు వారి నమ్మక నిలబెట్టుకోవడం కోసం తీసుకున్న రాజకీయ నిర్ణయమే తప్ప వ్యక్తిగత స్వార్థం ఏ మాత్రం లేదు. వ్యక్తిగతంగా ప్రత్యర్థులు ఎన్ని ఆరోపణలు చేసిన కోర్టు కేసులతో ఇబ్బంది పెట్టాలని చూసిన సవాలను స్వీకరిస్తూ నియోజవర్గ అభివృద్ధితోనే విమర్శలకు సమాధానం చెబుతున్న...

### పాత, కొత్త వారిని కలుపుకొని ముందుకు వెళ్తున్న......!

కష్టకాలంలో నాతో కలిసి నడిచిన వారితోపాటు కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలను పాత కొత్త తేడా లేకుండా అందర్నీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న. అవకాశం ఉన్న మేరకు ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ నా సోదర సమానుడైన పొదెం వీరయ్యతో కలిసి పార్టీ అభివృద్ధికి నియోజవర్గ అభివృద్ధికి కలిసి పనిచేస్తున్న. శాసనసభ్యుడిగా నా నిధులతో పాటు పార్లమెంటు సభ్యులుగా బలరాం నాయక్ నిధులను కూడా ఈ ప్రాంతంలో సద్వినియోగం చేసేలాగా ఎంపీతో సత్సంబంధాలను కొన సాగిస్తున్న.

### భద్రాచలం నియోజవర్గ అభివృద్ధికి మంత్రుల పూర్తి సహకారం

భద్రాచల నియోజక వర్గ అభివృద్ధికి రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. నియోజవర్గానికి సంబంధించి ప్రతి విషయంలో పెద్దన పాత్రను పోషిస్తున్నారు. మరో ఇద్దరు మంత్రులైన తుమ్మల నాగేశ్వరరావు భట్టి విక్రమార్కుల సైతం భద్రాచల అభివృద్ధికి పూర్తి సహకారాలు అందిస్తున్నారు.

### సంవత్సర కాలంలోనే కోట్ల నిధులతో అభివృద్ధి పనులు...!

గోదావరి కరకట్ట పునర్ నిర్మాణానికి 49 కోట్లు అదేవిధంగా కరకట్టపై జాతీయ రహదారి వంతెన కోసం మరో 39 కోట్లు రామాలయ అభివృద్ధికి 69 కోట్లు మంజూరు చేపించడమే కాకుండా ఆలయ అభివృద్ధి కోసం స్థల సేకరణ కార్యక్రమం కూడా ప్రారంభించాం. దుమ్ముగూడెం మండలంలో 60 శాతం మేర త్రీఫేస్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాను. అదేవిధంగా వెంకటాపురం మండలానికి జూనియర్ కాలేజ్ చర్ల మండలంలో అటవీశాఖ అనుమంతుల అనుమంతుల కారణంగా ఆగిపోయిన 4 వంతెనలకు గ్రీన్ సిగ్నల్ వచ్చేలాగా కృషి చేశా అంతేకాకుండా మండలాల పరిధిలో పంచాయతీరాజ్ ద్వారా 30 కోట్ల విలువైన రోడ్డు పనులను మంజూరు చేపించా.

### విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి..

ఈ సంవత్సర కాలంలో ఏజెన్సీ విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టిని సారించి మండలాల పర్యటనకు వెళ్ళినప్పుడల్లా ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న మెనూతో పాటు తరగతులను పరిశీలించి కావలసిన సలహాలు సూచనలు అందిస్తున్న. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పి హెచ్ సి లకు వైద్య సిబ్బందిని నియమించడంతోపాటు భద్రాచల పట్టణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యుల కొరతను తీర్చేందుకు కృషి చేస్తున్న.

### నియోజవర్గ అభివృద్ధికి మరో 17 కోట్లు.....!

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటు చేసి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా భద్రాచల నియోజకవర్గానికి 17 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ నిధులతో నిజ వర్గ వ్యాప్తంగా సిసి రోడ్లు సైడ్ డ్రైన్లతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ విద్యా వైద్యానికి ఖర్చు చేయనున్నాం

### నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక..

భద్రాచలం నియోజవర్గ అభివృద్ధికి ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్న. పట్టణంలోని రామాలయం సుభాష్ నగర్ ప్రాంతాలను ముప్పు నుండి కాపాడేందుకు కరకట్ట పునర్మాణ పనులను పూర్తి చేస్తున్నాం. దివ్య క్షేత్రాన భద్రాచలంలో చెత్త సమస్య పరిష్కరించేందుకు డంపింగ్ యార్డ్‌ని శరవేగంగా పూర్తి చేస్తున్నాం. ఆంధ్రలో కలిసినా ఐదు పంచాయతీలను తిరిగి తీసుకొచ్చేందుకు ఎంపీ తో కలిసి పోరాడేందుకు కార్యచరణ ఇప్పటికే రూపొందించాం. ఇంటిగ్రేట్ మార్కెట్ నిర్మించేందుకు కృషి చేస్తున్న అదేవిధంగా మిధుల స్టేడియం పునర్మానం చేపడుతున్నాం. ఎవరు ఊహించని విధంగా గెలిపించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునేందుకు ప్రతి నిమిషం నియోజకవర్గ సేవకే నా సమయాన్ని కేటాయిస్తా నని నవతెలంగాణతో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు.

## కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు విడుదల చేయండి

- సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ.నర్సారెడ్డి
- ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కి వినతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ, పేషెంట్ కేర్ ఇతర విభాగాలలో సేవలందిస్తున్న సుమారు 100 మంది ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికులు గత మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు స్పందించి వేతనాలను విడుదల చేపించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ.నర్సారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న కార్మికుల పట్ల వారి విధానాలు ఏమాత్రం మారటం లేదని విమర్శించారు. ప్రతిసారి కార్మికులకు నాలుగైదు నెలల వరకు వేతనాలు విడుదల చేయకుండా కార్మికుల జీవితాలతో చెలగాటలాడుతున్నారని అన్నారు. కార్మికులకు జీతాలు అందక బయట అధిక వడ్డీలకు డబ్బులు అప్పుగా తీసుకుంటూ కాలం గడుపుతున్న పరిస్థితుల్లో ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చిన పరిస్థితుల్లో మార్పు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాల విషయంలో వెంటనే ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కార్మికులకు వెంటనే వేతనాలను ఇప్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో కార్మికులకు వేతనాలు లేకపోతే తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలు సకాలంలో అందించాలన్న ఆసుపత్రి ఏరియా మొత్తం పరిశుభ్రంగా ఉండాలన్న పేషెంట్లకు సేవ చేయాలన్న కార్మికులు పస్తులు ఉంటే అది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కార్మికులు కడుపునిండా తింటే గాని పనిచేయలేని పరిస్థితులలో కనీసం కార్మికులు చేసిన పనికైనా వేతనం సకాలంలో ఇవ్వకపోతే కార్మికులు ఎలా పనిచేస్తారని నర్సారెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులు అందరి పరిస్థితి ఇదే విధంగా ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించి తక్షణమే వారికి రావలసిన వేతనాలు చెల్లించే దానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అజయ్ కుమార్, హాస్పిటల్ వర్కర్స్ రమాదేవి, రమణ, అంజలి, కుమారి, మమత, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మవద్దు..

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని రైతులు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు చూసించారు. మండల పరిధిలోని గుంపెన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం ఇంటి దగ్గరే 17 తేమ శాతం వచ్చే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. దళారులు నమ్మి కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకొని ఆర్థికంగా నష్టపోవద్దు అని అన్నారు.ప్రపంచ మృత్తిక(నెల) దినోత్సవం సందర్భంగా రైతులకు మట్టి నమూనాలు ఏవిధంగా తీయలో ప్రత్యక్షంగా ఆయన చేసి చూపించారు.వరి పంట సాగు చేసే ముందు పంట అవశేషాలు కాల్చకుండ భూమిలో కలియా దున్నాలని అదేవిధంగా పచ్చి రొట్ట విత్తనాలు వేసి భూమి సారం పెరిగే విధంగా చూసుకొని రైతులు పంట దిగుబడి పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనూష, ఏఈఓ ప్రశాంత్ రైతులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కిషోర్, అశోక్ ఎన్నిక

నవతెలంగాణ-ములకలపల్లి



మండల పరిధిలోని పూసుగూడెం పాఠశాలలో గురువారం టీఎస్యూటీఎఫ్ మండల విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా టీఎస్‌యూటీఎఫ్ ఎన్నికల ఇన్‌చార్జి మల్లెంపాటి వెంకటేశ్వర్లు హాజరై మండల మహాసభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీఎస్ యూటీఎఫ్ మండల నూతన అధ్యక్షునిగా మెండి కిషోర్, ప్రధాన కార్యదర్శిగా లావుడ్యా అశోక్, సహ అధ్యక్షునిగా అర్వపల్లి సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీరాములను ఎన్నుకున్నారు. 8న కొత్తగూడెం క్లబ్లో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు దాసు రాజేశ్వరరావు, మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, మండల ఉపాధ్యాయులు సంతోష్, రామచంద్రు, హేమలత, ఈశ్వరి, రాధిక, అనురాధ, సునీత, శ్రీనివాస్, లక్ష్మణ్, హేమ్లా, రహీముద్దీన్ పాల్గొన్నారు.

## 'రేగా' బహిరంగ క్షమాపణ చెప్పాలి

- కాంగ్రెస్ మహిళలు తలుచుకుంటే తరిమికొడతారు
- పినపాక నియోజకవర్గం మహిళా బీ-బ్లాక్ అధ్యక్షురాలు బర్ల నాగమణి

నవతెలంగాణ-బూర్గంపాడు



కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్తామని, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్‌పై బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందనని, మహిళ కాంగ్రెస్ తలుచుకుంటే తరిమికొడతామని కాంగ్రెస్ పినపాక నియోజక వర్గం మహిళా బీ-బ్లాక్ అధ్యక్షురాలు బర్ల నాగమణి అన్నారు. సోషల్ మీడియాలో పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పరిపాలనపై పెట్టిన పోస్టింగ్‌పై పినపాక మహిళ కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని మండల అధ్యక్షురాలు గోనె రేణుక అధ్యక్షతన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బర్ల నాగమణి పాల్గొని మాట్లాడుతూ నియో జకవ ర్గాన్ని అభివృద్ధి చేస్తూ కాంగ్రెస్ పార్టీ పరిపా లన ప్రజా పా లన విధంగా కొనసాగుతూ ప్రతి సంక్షేమ పథకం ప్రజల వద్దకు చేరుతూ పరిపాలన కొనసాగు తుంటే పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అభివృద్ధిని చూసి ఓర్వలేక మతిభ్రమించిందని ఆమె విమర్శించారు. తనకు నచ్చిన సోషల్ మీడియాలో పిచ్చి పిచ్చి పోస్టింగులు పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు కాంతారావు మానుకోవాలని మండిపడ్డారు. 420 అంటూ పెట్టిన పోస్టింగ్‌కి అర్థం తెలియని రేగ కాంతారావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. పాఠశాలలో పిఈటి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ ఆదరించి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించిన సంగతి గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని వదిలి కోట్ల రూపాయల కాసుల కక్కుర్తికి టిఆర్ ఎస్ పార్టీకి అమ్ముడుపోయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేసిన నిజమైన 420 నాయకు డిగా గుర్తింపు ఉన్న సంగతి మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ పరిపాలనలో బంగారు తెలంగాణ అంటూ అప్పులు తెలంగాణ చేయటంతో తెలంగాణ ప్రజలకు చేసింది ఏమీ లేక ఓటు అనే ఆయుధంతో తిరిగి కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టి ప్రజా పాలన కొనసాగుతుంటే చూస్తూ ఓర్వలేక అబండాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదని అన్నారు. దేశానికి వెన్నుముక రైతు అనే పదాన్ని ఈరోజు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టిన సంగతి కళ్ళకి కనబడటం లేదా అని ఆమె మండిపడ్డారు. సంక్షేమ పథకాలు అమలు విషయంలో దేశంలోనే కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏ పార్టీకి లేదని అలాంటి పార్టీని గానీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య మంత్రిని విమర్శిస్తే మహిళా నాయకులు చూస్తూ ఊరుకోలేరని ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లపై, కాంగ్రెస్ పార్టీపై అవాకులు చవాకులు పేలుతూ సోషల్ మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టింగులు పెడితే పినపాక మహిళ కాంగ్రెస్ నాయకులు చీపురు కట్టలతో తరిమి కొట్టడం ఖాయమన్నారు. అన్ని నియోజకవర్గాల కంటే పినపాక నియో జకవర్గం ఎక్కువ శాతం నిధులు మంజూరు విషయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళతో పరిపాలన కొనసాగిస్తూ గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ సంక్షేమ పథకాలను ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు పట్టణ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య బూర్గంపాడు మండల మహిళా అధ్యక్షురాలు గోనె రేణుక, మండల ప్రధాన కార్యదర్శి భూక్య సుగుణ, మండల మహిళా నాయకులు కనపర్తి సునీత, ఆవుల వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖ అధికారికి సమ్మె నోటీస్

నవతెలంగాణ-టేకులపల్లి



సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని ఈనెల 6, 7 తేదీలలో జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన దీక్షలు చేపడుతున్నట్లు సమ్మె నోటీసును మండల విద్యాశాఖ అధికారికి గురువారం అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు, కస్తూరిబా గాంధీ పాఠశాల ఉపాధ్యాయులు, వర్కర్స్, ఉద్యోగులందరి రెగ్యులర్ చేస్తామని, గత సంవత్సరం డిసెంబర్‌లో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట, సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ మా ప్రభుత్వం రాగానే రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర , జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఈనెల 6, 7 న రాష్ట్రంలోని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. టేకులపల్లి సమగ్ర శిక్ష ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులుగా బాదావత్ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కేజీబీవీ, పార్వతి, అధ్యక్షతన టేకులపల్లి మండల విద్యాధికారికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, వర్కర్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు : కాక రమేష్

నవతెలంగాణ-దమ్మపేట



ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎన్నికలలో దమ్మపేట మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కాక రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా నేను ఘన విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందని ఇంతటి ఘన విజయానికి ఎంతో సహకరించిన మండల కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, మండల యూత్ కాంగ్రెస్ అభిమానులకు, శ్రేయోభిలాసులకు ప్రత్యేకంగా మన ఎమ్మెల్యే జారే ఆది నారాయణలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి జిల్లా మంత్రి వర్యులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఒక కాంగ్రెస్ కార్యకర్త గా ఇప్పటివరకు నా సేవలు అందించానని ఈ పదవితో కాంగ్రెస్ పార్టీ నాకు మరింత బాధ్యతను పెంచిందనిచ మండల యూత్ ప్రెసిడెంట్‌గా మరింత సమర్థవంతంగా నా బాధ్యతను నిర్వహిస్తూ నా వంతు పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## భూసార పరిరక్షణతోనే సుస్థిరమైన దిగుబడులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



భూసార పరిరక్షణ అనేది మనందరి బాధ్యత అని, భూసార పరి రక్షణతోనే పది కాలాలపాటు సుస్థిరమైన దిగుబడులు సాధించవచ్చు అని ఉద్యాన శాస్త్రవేత్త, ఇంచార్జి ఏడీ ఐవీఎస్ రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు అయిన నేల, నీరు సంరక్షణతోనే మనిషి మనుగడ సుభిక్షంగా ఉంటుంది అన్నారు. అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాంప్రసాద్ మాట్లాడుతూ భూసార పరిరక్షణకు రైతులు తీసుకోవాల్సినటువంటి జాగ్రత్తలను గురించి వివరించారు.శాస్త్రవేత్త డాక్టర్ కే.నాగ అంజలి మాట్లాడుతూ నేల కోత, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు కే.కోటేశ్వర్, టి.పావని, పి.శ్రీలత, తేజశ్రీ పాల్గొని ఆరోగ్య పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను గురించి వివరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | డిసెంబర్06, 2024 | www.navatelangana.com



## వ్యక్తిగత వ్యర్థాలతో డ్రైనేజీ...

- వెదజల్లుతున్న దుర్గంధం

నవతెలంగాణ-అశ్వారావుపేట

గృహ అవసరాల ద్రవ వ్యర్థాలు, వీధుల్లో నుండి వచ్చే వర్షపు నీరు నిల్వ ఉండకుండా వాటిని పల్లపు ప్రాంతాలకు తరలించే నిర్వహణ క్రమం మే మురుగు కాలువలు ఏర్పాటు ఉద్దేశ్యం. కానీ దీనికి భిన్నంగా అశ్వారావుపేట డ్రైనేజీ వ్యవహారం ఉందంటే అతిశయోక్తి కాదు. గత సంవత్సరం కాలం గా నిర్మాణాలు జరుగుతున్న అశ్వారావుపేట సెంట్రల్ లైటింగ్ పనుల్లో అనేక వైఫల్యాలు బహిర్గతం అవుతున్నాయి.

ఇందులో మొదటి ది ప్రధాన రహదారిని సైతం ఆక్రమించుకుని బహుళ అంతస్తులు నిర్మాణాలు చేపట్టడం ఒకటి అయితే రెండోది గృహ ద్రవ వ్యర్థాలతో పాటు వ్యక్తిగత ద్రవ వ్యర్థాలు (మూత్రం, స్నానపు నీరు) సైతం మురికి కాలువల్లోకే విడుదల చేయడం బహిర్గతం అయింది. మరుగు దొడ్డిలో నుండి నేరుగా పైపులను మురికి కాలువలకు అనుసంధానం చేయడం కనపడుతుంది. ప్రస్తుతం సెంట్రల్ లైటింగ్ కోసం డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో ప్రత్యామ్నాయం లేక ద్రవ వ్యర్థాలు నిర్మాణంలో ఉన్న కాలువలో చేరడంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో వ్యాపారులు, వినియోగదారులు నిత్యం మాస్క్‌లతో కాలం వెళ్లదీస్తున్నారు. శరవేగంగా డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేసి మురికి కంపు నుండి విముక్తి కల్పించాలని పట్టణ వాసులు వేడుకుంటున్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా హరీష్ యాదవ్

నవతెలంగాణ- బూర్గంపాడు



బూర్గంపాడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన నిమ్మల హరీష్ యాదవ్ ఎన్నికయ్యారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేయగా సమీప అభ్యర్థిపై 423ఓట్ల మెజారిటీ తో గెలుపొందాడు. హరీష్ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి అంకితమై పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. హరీష్ స్వగ్రామంతో పాటు బూర్గంపాడు, మోరంపల్లిబంజర, సారపాక, తదితర గ్రామాలలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ యాదవ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనకు ఓటు వేసి తన గెలుపుకు సహకరించిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ సంస్థ పొలం బాట కార్యక్రమం

నవతెలంగాణ-చండ్రుగొండ



గానుగపాడు గ్రామంలో డివిజనల్ ఇంజనీర్ జి.రంగస్వామి ఆధ్వర్యంలో గురువారం పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలని రైతులకు సూచించారు. వలన కలిగే ఉపయోగాలు, ఆటో స్టాటర్లు వలన ఉపయోగాలు సకాలంలో రైతులు విద్యుత్ బిల్లును చెల్లించి రసీదును తీసుకొని విద్యుత్తును రెగ్యులర్ చేసుకోవాలని సూచించారు. ఆటో స్టార్టర్లు పెట్టుకోవటం వలన కలిగే నష్టాలు మోటార్లు ఆన్ చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ రవికుమార్, మండల విద్యుత్ శాఖ ఎంఎల్ నరసింహారావు, సబ్ ఇంజనీర్ నితిన్ రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- అదనపు కలెక్టర్ విద్యా చందన

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి దివ్యాంగ కూలీలకు జిల్లాలో అత్యధిక పని దినాలు 4853 కల్పించినందుకు ఉపాధి ఏపీవో పోరండ్ల రంగ, సాంకేతిక సహాయకులు లక్ష్మి, రజిత, కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మణ్, బిక్కుతండా కార్యదర్శి సౌజన్య, సూరారం క్షేత్ర సహాయకులు చంటిని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ), డిఆర్‌డిఓ విద్యచందన సన్మానించి, ప్రశంసా పత్రం అందించారు. పాండురంగాపురం పంచాయతీకి చెందిన స్వప్న, గ్రామ పంచాయతీకి చెందిన రాములు 100 రోజులు పూర్తిస్థాయిలో పని చేసి, మిగతా దివ్యాంగ కూలీలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఉపాధి పనుల్లో వీరు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. అనంతరం సన్మానించారు. ఎంపీడీవో (ఎఫ్ ఎసి) బొగ్గ నారాయణ సిబ్బందిని అభినందించారు. ప్రతి సంవత్సరం దివ్యంగులకు పని కల్పించడంలో ముందుండాలని సూచించారు.

## పొరపాటున యాసిడ్ తాగిన మహిళ

- చికిత్స కోసం కొత్తగూడెం తరలింపు

నవతెలంగాణ-అశ్వాపల్లి

పొరపాటున నీళ్ళు అనుకుని ఓ మహిళ యాసిడ్ తాగిన సంఘటన అళ్ళపల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. అళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కెవి.సంఘమిత్ర కథనం ప్రకారం..మండల పరిధిలోని మర్కోడు గ్రామ పంచాయతీకి చెందిన కోరం సుశీల అనే మహిళ గురువారం పొరపాటున తాగింది. దాంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన అళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకుని వచ్చారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు.

## మృత్తిక పరీక్షతో భూసారం అంచనా

నవతెలంగాణ-అశ్వారావుపేట

మృత్తికా పరీక్షతో భూసారం అంచనా వేయొచ్చును, తద్వారా ఏ పోషకాలు లేమి అనే విషయాన్ని తెలుసుకోవచ్చని ఏవో శివరాం ప్రసాద్ అన్నారు. ప్రపంచ మృత్తిక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నాలుగు రైతు వేదికలలో రైతులకు మట్టి పరీక్ష ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సతీష్, సూరిబాబు, భాను, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

**ఉద్యాన పరిశోధనా స్థానంలో....**

ప్రపంచ మృత్తికా దినోత్సవం లో భాగంగా స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో గురువారం మృత్తికా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా నేలల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సి హెడ్, సైంటిస్ట్ డా. జి.విజయ కృష్ణ, రీసెర్చ్ అసోసియేట్ మౌనిక, సిబ్బంది కట్టా సుబ్బారావు, ఆకాంక్ష, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

**దమ్మపేట :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దమ్మపేట మండలంలో మల్లారం, మల్కారం, పట్వారిగూడెం, గండుగులపల్లి రైతు వేదికల్లో గురువారం ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మనం సాగు చేసే వ్యవసాయ నేలలను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఎఇఓలు, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

**ములకలపల్లి :** మండల కేంద్రమైన ములకలపల్లిలోని రైతువేదికలో ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో సహాయ వ్యవసాయ సంచాలకులు రవి మాట్లాడారు. ఈ సమావేశంలో ఏవో అరుణ్బాబు, వ్యవసాయ విస్తరణాధికారులు మనోహర్, రమేష్, రాహుల్గాంధీ, రజనీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## ఇది ప్రజాపాలన కాదు.. ఇందిరమ్మ ఎమర్జన్సీ పాలన..!

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు

నవతెలంగాణ-దమ్మపేట



ఇది ప్రజాపాలన కాదు... ఇందిరమ్మ ఎమర్జనీ పాలనలా ఉందని అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్‌రావు అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన నడుస్తుందని, తెలంగాణ ఈరోజు అక్రమ అరెస్టులకు అడ్డాగా మారిందని తెలిపారు. నెంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తున్నారని ఇదేంటని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీ వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రతి చోట ప్రజలు తిరగబడుతుంటే ఏం చెయ్యాలో అర్థం కాక అణచివేయాలని ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్నారని తెలిపారు.

# కష్టజీవుల పార్టీకి అండగా నిలవండి

- అన్ని వర్గాల వారు ఆర్థిక సహకారమందించాలి
- 20, 21న ఇల్లందులో సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు
- జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు



నిరంతరం ప్రజా సమస్యలు, హక్కులకై గల గళమెత్తుతూ, అన్యాయాలను ఎదిరిస్తూ.. అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తున్న కష్టజీవుల పార్టీ సీపీఐ(ఎం) అని, పార్టీకి అండగా నిలవాలని జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఎంతో చారిత్రాత్మకమైన బొగ్గుటలో 20, 21 సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలు జరగనున్నాయని, జయ ప్రదానికై అన్ని వర్గాల వారు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏలూరి భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ, గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని, ఈ మహాసభలు జయప్రదం కోసం విజ్ఞులైన పెద్దలు, వ్యాపార వాణిజ్య విద్యా సంస్థల అధినేతలు ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులు రైతు వ్యవసాయ కూలీలు అందరూ, ప్రజలు ఆర్థికంగా, హార్దికంగా పెద్దమనసు చేసుకోవాలన్నారు. సీపీఐ(ఎం) కార్యకర్తలు వచ్చినపుడు సహకరించాలని కోరారు.

**సమస్యలపై పోరాటాలు చేసి సాధించిన చరిత్ర సీపీఐ(ఎం), ప్రజా సంఘాలదే**

**రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే. రమేష్**

నిరంతరం సమస్యలపై పోరాటాలు చేసి సమస్యలు సాధించిన చరిత్ర సీపీఐ(ఎం), ప్రజా సంఘాలకే ఉందని రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్ అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న సీపీఐ(ఎం) ప్రజల పక్షాన ఉంటూ సమస్యలపై పోరాటాలు చేసిన చరిత్ర ఉందన్నారు. పేదలను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు ఇస్తున్నామన్నారు. ఏనాడు కార్పొరేట్లకు, పెట్టుబడిదారీ వర్గాలకు మోకరిల్ల లేదని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలక్టోరల్ బాండ్స్ సైతం తిరస్కరించిన ఏకైక పార్టీగా సీపీఐ(ఎం) నిలుస్తోందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పేర అధికార బీజేపీ, కాంగ్రెస్, చిన్నాచితకా ప్రాంతీయ పార్టీలు సైతం వందల కోట్లు దండుకున్నాయన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతున్నామన్నారు. సీపీఐ(ఎం) పాలనలో కేరళ ప్రభుత్వం గత పదేళ్లుగా ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన ఘనత సీపీఐ(ఎం) పాలనలో ఉన్న కేరళ రాష్ట్రానికి దక్కిందనన్నారు. జిల్లాలో ఇల్లందు నియోజకవర్గంలో పేదలు, మధ్యతరగతి వారి కోసం పార్టీ చేస్తున్న పోరాటాలు ఉద్యమాలు ప్రజలు గ్రహించాలన్నారు. సీపీఐ(ఎం) బలోపేతానికి అన్నదండలు అందించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, అబ్దుల్ నబి, పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణ, షేక్ ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, సుల్తానా, సంధ్య, మరియా తదితరులు పాల్గొన్నారు.

## జీఓ 317ను సవరించి బాధితులకు న్యాయం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ-కొత్తగూడెం





జీఓ-317లోని నిబంధనలకు అనుగుణంగా ఉన్న భార్యా, భర్తలు, ప్రాధాన్యత కేటగిరీలు, పరస్పర బదిలీలు మాత్రమే చేయాలని నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిఓ జారీ చేయడం పట్ల టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం కొత్తగూడెంలో టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కిషోర్ సింగ్ అధ్యక్షతన జరిగిన టిఎస్ యూటిఎఫ్ భద్రాద్రి జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో మాట్లాడుతూ జిఒ 317 లోని అసంబద్ధమైన నిబంధనల కారణంగా పలువురికి నష్టం వాటిల్లిందని, వాటిని సవరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఏలను విడుదల చేయాలని, 51శాతం ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ నివేదిక ప్రకటించాలని, సీపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఎన్ఇపీ-2020రద్దు చేయాలనీ, సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంటీఎస్ మంజూరు చేయాలని, రెసిడెన్సియల్ పాఠశాలల టైమింగ్స్ మార్చాలని, కామన్ సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పర్యవేక్షణా అధికార పోస్టులను భర్తీ చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పండిట్ పీఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ, ఉపాధ్యక్షులు వి.వరలక్ష్మి, బి.మురళీ మోహన్, కోశాధికారి ఎస్.వి, జిల్లా కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.పద్మరాణి, డి.దాసు, టి.శ్రీనివాసరావు, డి.తావుర్య, ఈ.హతీరామ్, బి.బిక్కు, ఎం.రాజయ్య, పి.జయరాజు, ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి పంచాయతీ కార్మికుడు మృతి

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని ఉప్పుసాక గ్రామంలో పంచాయతీ కార్మికుడు భూక్య వెంకటేశ్వర్లు(28) విద్యుత్ తీగలు తగిలి కరెంటు షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం..ఉప్పుసాక గ్రామ పంచాయతీలో గల ఎస్టీ కాలనీకి చెందిన భూక్యా వెంకటేశ్వర్లు స్థానిక గ్రామ పంచాయతీలో విధులకు హాజరయ్యాడు. గురువారం ఉప్పుసాక గ్రామంలో బోరు మరమత్తులు చేస్తుండగా ప్రమాదం శాత్తు విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదానికి గురయ్యాడు. విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. పక్కనే ఉన్న మరో కార్మికుడు ప్రమాదం నుంచి బయట పడినట్లు సమాచారం. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అయప్ప మాలలో ఉన్న కుమారుడు మృతితో కుటుంబ సభ్యుల రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. సంఘటన స్థలాన్ని బూర్గంపాడు ఎస్ఐ రాజేష్, మండల విద్యుత్ శాఖ ఏఈ హరిక పటేల్, లైన్ ఇన్స్‌పెక్టర్ రామ కృష్ణ, ఫోర్మేన్ ఆదినారయణ, లైన్మెన్ జగన్మోహన్‌రెడ్డి సందర్శించి ప్రమాదంపై ఆరా తీశారు. భాదిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందే విధంగా కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు తల్లి భద్రమ్మ ఉప్పుసాక గ్రామపంచాయతీలో గత రెండు సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి ఇటీవల పదవి విరమణ పొందగా నాలుగు రోజుల నుంచి మృతుడు తాత్కలిక కార్మికుడిగా విధులకు హాజరవుతున్నట్లు తెలుస్తోంది.

**మృతుని కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి : సీపీఐ(ఎం)**

మృతుని కుటుంబానికి 10 లక్షలు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఆ కుటుంబంలో భార్యకి ఉద్యోగం కల్పించాలని సీపీఐ(ఎం) బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి న్యాయం జరగ కుండా అధికారులు ఏమన్నా ప్రయత్నిస్తే సహించేది లేదని, ఆ కుటుంబానికి న్యాయం జరగాలన్నారు. అదేవిధంగా బూర్గంపాడు మండలంలో పంచాయతీ కార్మికులకు భద్రత లేకుండా ఉందని, అందువ ల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వం అధికారులు భూక్యా వెంకటేశ్వర్లు కుటుంబానికి న్యాయం జరిగేలా చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రయివేటు పాఠశాలలో సీసీ కెమెరాల కలకలం

- విద్యాశాఖ అధికారుల విచారణ...?
- ఆరోపణలు నిజంకాదు...
- టీచర్ల ఖండన
- విచారణలో ఏమి తేలలేదంటున్న డీఈఓ

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు విషయం కలకలం రేపింది. పాఠశాల బిల్డింగ్‌లోని ఒక గదిలో మహిళా టీచర్లకు ఇబ్బంది కలిగించే విధంగా సీక్రెట్‌గా సీసీ ఏర్పాటు చేశారన్న ఆరోపనలు షోషల్ మీడియాలో హల్ చల్ చేశాయి. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది వినియోగించే గదిలో వారికి కనిపించ కుండా సీసీ కెమెరాను ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వచ్చియా. ఆ గదిని స్టోర్ రూమ్‌గా వినియోగిస్తారు. ఆ గదికి పక్కనే మహిళల వాష్‌రూమ్ ఉన్నట్లు సమాచారం. తాజాగా గది పైకప్పు సిలింగ్ నుండి సీసీ కెమెరా ఊడి కిందపడిందని, దీంతో రహస్యంగా కెమెరాలను ఎందుకు అమర్చారని యాజమాన్యాన్ని నిలదీయగా తమకు కూడా ఆ విషయం తెలియదని విషయాన్ని చాలా సులువుగా కొట్టిపడేసి, డొంక తిరుగుడు సమాధానం చెప్పారని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. పాఠశాల యాజమాని పాఠశాలలో పలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని టీవీకి అనుసంధానం చేశారని, సీక్రెట్‌గా ఏర్పాటు చేసిన కెమెరా మాత్రం అతని మొబైల్‌కు అనుసంధానం చేశాడని ఆరోపణలు వచ్చాయి. ఈవిషయంలో ఇబ్బందులకు గురిఅయిన మహిళా ఉద్యోగులు విద్యాశాఖ అధికారులకు మౌఖికంగా ఫిర్యాదు చేశారని, దీంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి, విచారణ చేశారని ప్రచారం సాగింది.

**ఆరోపణలో నిజంలేదు : డీఈఓ**

ఈ విషయంలో నవతెలంగాణ పాఠశాలను సందర్శించి కొంత మంది మహిళా ఉద్యోగులు, టీచర్‌ను వివరణ కోరారు. సీసీ కెమెరాను పాఠశాల అవరణలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నాయని, విద్యార్థుల రక్షణ కోసం యాజమాన్యం ఏర్పాటు చేసిందని తెలిపారు. షోషల్ మీడియాలో ప్రచారం సాగుతున్న విధంగా ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఇక్కడి మహిళా ఉద్యోగులు, టీచర్లు ఎదుర్కోవడం లేదని తేల్చి చెప్పారు. గత 9 సంవత్సరాలుగా ఇదే పాఠశాలలో పనిచేస్తున్నానని, యాజమాన్యం విషయంలో అనుమానించాల్సిన అవసరం లేదని ఉద్యోగిని ఇందిర నవతెలంగాణకు వివరించారు. ఈ విషయంలో ఎంఇఓను వివరణ కోరేందుకు ఎన్ని సార్లు ప్రయత్నించిన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర చారిని వివరణ కోరగా...తన దృష్టికి విషయం వచ్చిందని, దీనిపై విచారణ చేయాలని ఎంఇఓకు ఆదేశించామని, విచారణ నిర్వహించిన ఎంఇఓ ఎలాంటి సమస్యలేదని, తమకు వచ్చిన ఫిర్యాదుకు ఏలాంటి ఆధారాలు లభించలేదని తెలిపినట్లు డిఇఓ నవతెలంగాణకు వివరించారు.

## ఎక్సలెంట్ ఫౌండర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మణుగూరు





ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు ఎండి.భాషా జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పైలట్ కాలనీ ఎక్సలెంట్ పాఠశాలలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల కరస్పాండెంట్ ఎండి.ఖాదర్ మాట్లాడుతూ 28 సంవత్సరాల క్రితం మణుగూరు ఏజెన్సీ ప్రాంతంలో ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్థాపించి వ్యయ ప్రయాసలను ఎదుర్కొని స్కూల్‌ను నడిపించారని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థిలకు ఇంగ్లీష్ విద్యను పరిచయం చేసి ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయిలో స్థిరపడుటట్లు చేసిన ఘనత అబ్దుల్ భాషాకే దక్కుతుందన్నారు. ఆనాడు ఆయన వేసిన విత్తనం మొక్కగా, చెట్టుగా, ఎదిగి నేడు శాకోప శాఖలుగా విస్తరించి వేలాది మంది విద్యార్థులకు విద్యనందిస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని వందలాది విద్యావంతులకు ఉపాధి కల్పించిన భాషా ధన్యుడు అన్నారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పెంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు బోధన సిబ్బంది విద్యాసంస్థల చైర్మెన్ యూసఫ్ షరీఫ్, డైరెక్టర్ యాకూబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

- వైద్యులు, వైద్య సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం
- అస్తవ్యస్థంగా ఉన్న రికార్డుల నిర్వహణపై అసంతృప్తి
- వైద్య సిబ్బంది పనితీరుపై విచారణకి ఆదేశిస్తా
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరులో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇతర ఆస్పత్రులకు, ల్యాబ్‌లకు పంపిస్తూ ఆస్పత్రిని రిఫరల్ ఆస్పత్రిగా మార్చివేశారని రోగులు, రోగుల బంధువుల నుంచి పలు ఫిర్యాదులు అందటంతో స్పందించిన ఎమ్మెల్యే ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. 39 మంది వైద్యులకుగాను 12 మంది వైద్యులు మాత్రమే విధులకు హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు రిజిష్టరు నిర్వహణలో లోపాలను గుర్తించి సూపరింటెండెంటును మందలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య వ్యవస్థ అస్తవస్థానంగా మారిందని, వైద్యులు, వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. పర్యవేక్షణ లోపంతో సిబ్బంది సమయపాలన పాటించకుండా విధులపట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని దీన్ని సహించేదిలేదన్నారు. వైద్య సేవల్లో జరుగుతున్న లోపాల కారణంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య ఘననీయంగా తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో నిఘా విభాగం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, వైద్య పరికరాలు, మందులు, సిబ్బంది కొరతపై ప్రభుత్వం, సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళతానని తెలిపారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను భ్రష్టుపట్టించే చర్యలను సహించబోనని హెచ్చరించారు. సిబ్బంది పనితీరుపై విచారణకు ఆదేశిస్తానని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలల బలోపేతం, కొత్తగూడెం జిల్లా ఆస్పత్రి, పాల్వంచ ఆస్పత్రి, రామవరం మాతాశిశు ఆస్పత్రి, మెడికల్ కళాశాలపై ప్రేత్యేక దృష్టి సారించి పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువచేసేవిధంగా నిరంతరం కృషి చేస్తానని, ఇకముందు తరచూ ఆస్పత్రులను పర్యవేక్షిస్తానని తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, టిజిఎస్ జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్, నాయకులు పల్నాటి ప్రశాంత్, కొచ్చెర్ల జోసెఫ్ తదితరులు వున్నారు.

**ప్రజాపాలనలో ఆర్టిసి సేవలు భేష్**

ప్రజాపాలన నిర్వహణలో ఆర్‌టిసి సేవలు భేష్ అని, ప్రభుత్వం, అధికారంలోనికి వచ్చిన తర్వాత చేపట్టిన తొలిపథకం ఇదే కావడం, ఆ పథకానికి అపూర్వ స్పందన రావడానికి సిబ్బంది కృషి అమోఘమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెం ఆర్టిసి డిపో ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. ఆర్టిసి కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్టిసి డిప్యుటీ ఆర్ఎం భవాని ప్రసాద్, కొత్తగూడెం డిఎం దేవేందర్ గౌడ్, భద్రాచలం డిఎం తిరుపతి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాపా, చంద్రగిరి శ్రీనివాస్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన జీపీ కార్యాలయంతో పాలన సులభతరం**

**పాల్వంచరూరల్ :** నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ కార్యాలయాలతో పాలన సేవలు సులభతరం అవుతాయని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మండల పరిధి తవిశలగూడెం, పాయకారి యానంబైలులలో రూ 40 లక్షలతో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాలను ఎమ్మెల్యే అధికారులు, గ్రామ ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసిల్దార్ వివేక్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీఈ మధుకర్, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఎంపీడీఓ నారాయణ, సీడీపీవో లక్ష్మిప్రసన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీను, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాస్పత్రుల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులతో పాటు పలు రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లను జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుకృత గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం, దమ్మపేట, పట్వారీ గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో సిబ్బంది పనితీరు పరిశీలించి సూచనలు చేశారు. అలాగే సీహెచ్ సీ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పలు ప్రైవేటు ఆస్పత్రులు, రక్త పరీక్షా కేంద్రాలను సందర్శించి రోగులను ఇబ్బందులు పెట్టొద్దని, అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయ కుమార్, సిబ్బంది మొహిద్దీన్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

**నవతెలంగాణ - ఆళ్ళపల్లి**

రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి కె.వి.సంఘమిత్ర తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలంలోని గంగారం గ్రామానికి చెందిన జోగా సురేష్ ద్విచక్ర వాహనంతో వస్తుండగా ఆళ్ళపల్లి మండలంలోని అనంతోగు గ్రామం వద్ద మరో గుర్తు తెలియని ద్విచక్ర వాహనాన్ని ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో సురేష్ ఎడమ కాలి మడమ భాగంలో తీవ్రంగా గాయాలయ్యాయి. కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి స్థానిక 108 వాహనంలో తరలించామన్నారు. ఎదురుగా మరో ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియాల్సి ఉంది.



## కేజీబీవీ విద్యార్థినులకు హెల్త్ క్యాంప్ నిర్వహణ

**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**

మండలంలోని అనంతోగు గ్రామం కేజీబీవీ వసతి గృహంలో విద్యార్థినులకు గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి కె.వి.సంఘమిత్ర ఆధ్వర్యంలో సికిల్ సెల్ స్క్రీనింగ్, హెల్త్ క్యాంపు నిర్వహించారు. దానిలో భాగంగా అనారోగ్యంతో నీరసంగా ఉన్న పిల్లలకు మలేరియా ఆర్‌డిటి చేసి, వారికి తగిన మందులు ఇవ్వడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. అదేవిధంగా హెల్త్ ఎడ్యుకేషన్ పర్సనల్ హైజిన్ గూర్చి వివరించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బి.సరోజిని, హెల్త్ ఎడ్యుకేటర్ టి.రమాదేవి, స్టాఫ్ నర్స్ సరిత, హెల్త్ అసిస్టెంట్ నరేష్ ఏఎన్ఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.



## రామాలయం జట్టుపై భద్రాచలం మీడియా జట్టు ఘన విజయం

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

భద్రాచలం జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం మధ్యాహ్నం రామాలయం మరియు భద్రాచలం మీడియా జట్లకు మధ్య మ్యాచ్ జరిగింది. మీడియా జట్టు అత్యధిక పరుగుల తేడాతో రామాలయం జట్టుపై ఘన విజయం సాధించింది. మొదటగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మీడియా జట్టు నిర్దేశిత 10 ఓవర్లు ముగిసే సరికి కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయాయి. 174 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన రామాలయం జట్టు లక్ష్య చేధనలో తడబాటుకు గురై 10 ఓవర్లలో కేవలం 103 పరుగులు మాత్రమే సాధించి ఘోర పరాభవం చవి చూసింది. దీంతో భద్రాచలం మీడియా జట్టు 70 పరుగుల భారీ ఆధిక్యంతో గెలిచి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇక మ్యాచ్ లో కేవలం 22 బంతుల్లో 53 పరుగులు చేయడమే కాకుండ బౌలింగ్ లోను తన నైపుణ్యాన్ని చాటింది. అన్వేష్ రెడ్డికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. ఈ సందర్భంగా జట్టు విజయంలో కీలక పాత్ర పోశించిన సభ్యులను సీనియర్ రిపోర్టర్లు అనిల్ రెడ్డి, కుప్పాల నాగరాజు, మొగపు ఆనంద్, సలీం, బంధు కిరణ్ అభినందించారు.

## ప్రభుత్వ భూముల్లో ప్రయివేటు ఆస్పత్రి

- వాగును ఆక్రమించుకొని నిర్మించిన బహుళ అంతస్తులు

**నవతెలంగాణ-మణుగూరు**

ప్రభుత్వ భూమిలో ప్రయివేటు ఆస్పత్రి నిర్మించారని, వాగుపై బహుళ అంతస్తులు నిర్మించారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మణుగూరులోని సంజీవని పిల్లల హాస్పిటల్‌నీ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మించడమే కాకుండా పక్కన ఉన్న కాలువను సైతం కబ్జా చేసిన డాక్టర్ బుడగం రామకృష్ణపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు సోలం హరి శంకర్ మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో సంజీవని పిల్లల హాస్పిటల్ అధినేత డాక్టర్ బుడగం రామకృష్ణ అనే గిజనేతర వ్యక్తి 1/70 చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో హాస్పిటల్ నిర్మించారన్నారు. రామకృష్ణపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ యాక్షన్ తీసుకోక పోతే కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కంగల ప్రవీణ్, గొగ్గెల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## బొడ్డుపల్లి సీతారత్నంకు సీపీఐ నివాళులు

**నవతెలంగాణ - బోనకల్**

మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు బొడ్డుపల్లి అప్పన్న సతీమణి బొడ్డుపల్లి సీతారత్నం చిత్రపటానికి సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, ముష్టికుంట్ల సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు లతో కలిసి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు రజబ్ అలీ, రావెళ్ల జానకిరామయ్య నాయకత్వంలో గ్రామంలో పార్టీ అభివృద్ధి కోసం బొడ్డుపల్లి అప్పన్న ఏనలేని కృషి చేశారన్నారు. నాడు బోళ్ల లక్ష్మయ్య పిల్లలమర్రి లక్ష్మీనారాయణ, బొడ్డుపల్లి వెంకయ్య, బొడ్డుపల్లి నాగయ్య ఆకెన వెంకటరాములు, దారగాని వెంకటేశ్వర్లు, కొండ జగ్గయ్య, బోయినపల్లి బిక్షాలు, జక్కా నాగభూషణం లతో కలిసి గ్రామంలో పార్టీ నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు బోయినపల్లి బసవయ్య, కొంగర భాస్కరరావు, గుంపుల జయరాజు, బీఆర్ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, బీఆర్ఎస్ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బంధం నాగేశ్వరరావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, ప్రముఖ వైద్యులు పులిపాటి చంద్రశేఖర రావు తదిరులున్నారు.

## మణుగూరు మున్సిపాలిటీని రద్దు చేయాలి

- పంచాయతీలుగా విభజించి ఉపాధి హామీ పని కల్పించాలి

**నవతెలంగాణ-మణుగూరు**

మణుగూరు మున్సిపాలిటీని రద్దుచేసి పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని గిరిజన, గిరిజన పేదలకు ఉపాధి హామీ పని కల్పించాలని గురువారం సామాజిక కార్యకర్త కర్నే రవి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ లో సంతకాల సేకరణ నిర్వహించారు. సుమారు 500 మంది సంతకాలు చేశారు. అనంతరం రవి మాట్లాడుతూ అశోక్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, సాయి నగర్ మరి ఇతర ప్రాంతాలకు మున్సిపాలిటీలో చేర్చే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలు వల్ల వచ్చే లాభాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అన్యాయం జరిగే విధంగా పాలకులు ప్రవర్తిస్తున్నారు. వచ్చే శాసనసభ సమావేశాలలో జీరో అవర్ సమయంలో స్థానిక శాసనసభ్యులు మణుగూరు మున్సిపాలిటీని రద్దు చేయాలని అంశాన్ని ప్రభుత్వం దృష్టికి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం బిఎస్‌పి తుడుం దెబ్బ ఆదివాసీ సేన ప్రజా సంఘాలు తదితరులు మద్దతు తెలిపారు.

# ఐటీసీలో ప్రతిష్టాత్మకం

## గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు

- రంగం సిద్ధం
- కార్మిక సంఘాలతో 10న అధికారుల సమావేశం

**నవతెలంగాణ -బూర్గంపాడు**

పేపర్ ఉత్పత్తి రంగాలలో అగ్రగామిగా నిలిచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాకలో గల ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ, షెడ్యూల్ గురించి చర్చించేందుకు ఈనెల 10న ఖమ్మంలో సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తగిన వివరాలతో హాజరు కావాలని కోరుతూ, కార్మికశాఖాధికారులు పరిశ్రమలోని రిజిస్టర్డ్ కార్మిక సంఘాలకు నోటీసులు పంపించారు. ఈ కర్మాగారంలో ప్రస్తుత కార్మికసంఘం కాల పరిమితి ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ, ప్రతిపక్ష ఐఎన్టీయూసీ, మిత్రపక్షాలు రాష్ట్ర కార్మికశాఖ అధికారులకు గత సెప్టెంబరు 17న డిమాండ్ నోటీసును అందజేసింది. ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి జులై 4వ తేదీ నాటికే ముగియటంతో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు. ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారంలోని ప్రధాన ప్రతిపక్ష కార్మిక సంఘం ఐఎన్టీయూసీ, మిత్ర పక్షాలు ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కోసం లెటర్ ఇవ్వటంతో మళ్లీ గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలకు తెరలేచింది. ఇక్కడ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల నిర్వహణకు నిర్ణయం తీసుకున్న కార్మికశాఖ అధికారులు ఆ ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో కార్మికసంఘాల వివరాలు పరిశీలించి, తగు షెడ్యూల్ నిర్ణయించేందుకు ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లోని కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం ఈనెల 10న నిర్వహించనున్నారు.

**ప్రతిష్టాత్మకం... కార్మిక సంఘం ఎన్నికలు :**

సారపాకలోని ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారంలో జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకం జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఐఎన్టీయూసీ, టీఎన్టీయూసీ మిత్రపక్షాలకు కార్మికులు విజయాన్ని అందిస్తుంటారు. ఈసారి జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీకి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మద్దతుగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. అలాగే టీఎన్టీయూసీకి వైయస్సార్ కార్మిక సం ఘం మద్దతుగా ఉండే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా బీఆర్‌టీయూకి సీఐటీయూ మద్దతు తెలుపుతుంది. అలాగే బీఎంఎస్ కూడా పోటీలో ఉంది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు యూనియన్లు ఈసారి బరిలోకి దిగనున్నాయి. దీంతో ఈ సారి ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ జరగనుంది. ప్రస్తుతం 1195 మంది కార్మికుల సంఖ్య ఉన్న ఈ కర్మాగారంలో రిటైర్మెంట్లు అయినవారు కాక 1177 మంది ఓటు హక్కు కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు, సంక్షేమం విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన ఈ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నిక విషయంలో కార్మికుల తీర్పు కోసం కార్మిక సంఘాలన్నీ సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొంతకాలంగా కొన్ని కార్మిక సంఘాలు వ్యక్తిగతంగా కార్మికులను కలిసి తమ యూనియన్ చేపట్టబోయే మేనిఫెస్టోను వివరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధికారిక ఎన్నికల ప్రక్రియ (వెరిఫికేషన్) కూడా ప్రారంభం కావడంతో ఐటీసీ కర్మాగారంలో కోలాహలం మొదల కానుంది. ఈసారి ఎన్నికల్లో ముఖ్యంగా విద్య, వైద్యం, వసతి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర అంశాలు ప్రచారంలో కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోయినప్పటికీ ప్రచారంలో కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కూడా కీలకం మారనుంది. తమ సంక్షేమం పట్ల కృషిచేస్తున్న సంఘానికి అనుకూలంగా ప్రచారానికి కాంట్రాక్ట్ కార్మికులు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుండటంతో సారపాక, బూర్గంపాడు, మోరంపల్లి బంజర, లక్ష్మీపురం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, భద్రాచలం తదితర పరిసర ప్రాంతాల్లో ఐటీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం జోరు అందుకోనుంది. ఈనెల 10న జరిగే సమావేశం అనంతరం ఎన్నికలకు తేదీ ఖరారు అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఐటీసీలో ఎన్నికల సందడి మొదలకానుంది.



## రిటైర్డ్ ఏఈ సుబ్బారావును పరామర్శించిన మాజీమంత్రి సంభాని

**నవతెలంగాణ- ఖమ్మం**

పంచాయతీరాజ్ శాఖలో సుదీర్ఘ కాలం పని చేసి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఏఈ తెనాలి సుబ్బారావును మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ గురువారం పరామర్శించారు. ఇటీవల సుబ్బారావు సతీమణి హిమ శైలసుధ మృతి చెందడంతో ఖమ్మంలోని ఆయన స్వగృహానికి వచ్చిన సంభాని పరామర్శించి ధైర్యం చెప్పారు. సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు. సంబాని వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లూరి హనుమంతరావు, దుర్గాప్రసాద్, నాగేంద్ర సింగ్, ఫరీద్ ఖాద్రి, మనోహర్‌రెడ్డి ఉన్నారు.

## మొక్కను నాటిన డీఎంఅండ్‌హెచ్వో

**నవతెలంగాణ-ఖమ్మం**



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పుట్టినరోజు సందర్భంగా వి.వి పాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో గురువారం మొక్కను నాటి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందునాయక్, డాక్టర్ మౌనిక, ఎం.దుర్గ, రామాదేవి, టీ.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు .

## భూసారాన్ని కాపాడుకోవాలి

**తల్లాడ :** భూసారాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఎఫ్‌ఎంసీ కంపెనీ టెరిటరీ మేనేజర్ సురేస్ అన్నారు. గురువారం ప్రపంచ నేల దినోత్సవంలో భాగంగా తల్లాడ మండలం ముద్దునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎంసి సిబ్బంది వి.బాబు, బి.నరేష్, ఆర్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## లింగాల కమల్ రాజు అరెస్టు

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**



మండల కేంద్రంలో గల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల పరిశీలనకు మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజును గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల్లో జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భోజనశాలను, మౌలిక వసతులు పరిశీలించేందుకు వెళుతుండగా ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకోవడం కాంగ్రెస్ చేతగానితనానికి పరాకాష్టగా అభివర్ణించారు. గురుకులాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండేందుకు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎర్రుపాలెం ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర ఏఎంసి మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు, మాజీ జెడ్పిటిసి శీలం కవిత, నాయకులు సూరంనేని రామకోటయ్య, యన్నం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, పవన్ కుమార్, కొండపాటి సాంబశివరావు, భాస్కర్, సగ్గుర్తి కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ ఏకగ్రీవంగా మండల కమిటీ ఎన్నిక

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**




2024-25 సంవత్సరానికి గాను టీఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన 11వ మండల మహాసభలో కమిటీ సభ్యుల ఆమోదంతో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ మధిర మండల ప్రధాన కార్యదర్శి వీరయ్య వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా అనుమోలు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నంద్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కంచర్ల శ్రీనివాసరావు రత్నమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు

**నవతెలంగాణ-కారేపల్లి**

కారేపల్లి పెద్ద చెరువు వద్ద చేపల వ్యాపారులు పేకాట ఆడుతుండగా పోలీసు దాడులు చేసి వారిపై గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన దారావత్ బావుసింగ్, గుంజి వెంకన్న, తమ్మిశెట్టి రాములు చేపల బేరం చేస్తుంటారు. కారేపల్లి పెద్దచెరువుకు చేపల కోసం వచ్చిన ముగ్గురు చేపల పట్టటం ఆలస్యం అవుతుండటంతో చెరువు వద్ద పేకాట ఆడుతున్నారు.పోలీసులకు సమాచార తెలవటంతో అక్కడి వెళ్ళి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.13200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**సత్తుపల్లిలో పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం**

**నవతెలంగాణ-సత్తుపల్లి**

ఈనెల 18, 19 తేదీల్లో సత్తుపల్లిలో జరగనున్న సీపీఐ(ఎం) 22వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. షాప్ టూ షాప్ తిరుగుతూ కరపత్రాలు అందజేస్తూ మహాసభ విజయవంతంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, రైతుసంఘం జిల్లా నాయకులు రావుల రాజబాబు, పార్టీ పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు కోరుతున్నారు. 28 యేండ్ల తరువాత సత్తుపల్లిలో జరుగుతున్న ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర నాయకులతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సుమారుగా 1000మంది డెలిగేట్స్ హాజరవుతున్నారన్నారు. దేశ, అంతర్జాతీయ రాజకీయ విశ్లేషణలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన తీరు తదితరాంశాలపై వక్తలు తమ ప్రసంగాల్లో ప్రజలకు వివరిస్తారని వారు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు చావ రమేశ్, పాకలపాటి ఝాన్సీ, చెరుకు రత్నకుమారి పాల్గొన్నారు.

## పోరాటాలతోనే మహిళల హక్కుల రక్షణ

**నవతెలంగాణ-కారేపల్లి**

పోరాటాలతోనే మహిళలు హక్కులు రక్షించుకోవటం జరుగుతుందని ఐద్వా మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి అన్నారు. గురువారం కారేపల్లిలో జరిగిన ఐద్వా గ్రామ కమిటీ మహాసభలో ఉమావతి మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు పాలకుల మాటలకే పరిమిత అవుతున్నాయని చేతలలో చూపటం లేదన్నారు. మహిళలకు రక్షణ కరువైందని, రోజురోజుకు మహిళలపై దాడులు పెరుగుతునే ఉన్నాయన్నారు. మహిళలకు ఓట్ల బ్యాంకులు మార్చుకున్న రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో తాయిలాలతో మభ్యపుచ్చుతున్నాయన్నారు. అనంతరం ఐద్వా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా మేకల మౌనిక, కొండబోయిన రమ్య, సభ్యులుగా చిత్తారు రమాదేవి, ఏనుగుల పద్మ, ఇదిగాని లింగమ్మ, పచ్చిపాల గురులక్ష్మి, స్వప్న, శారద, లలిత, కోటమ్మ, సుజాత, రాజేశ్వరిలను ఎన్నుకున్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళల విభాగంలో ఎర్రుపాలెం గ్రామానికి చెందిన చంద్రకళ రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు ఎన్నికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కటికం క్రిస్టఫర్ తెలిపారు. ఈ నెల నాలుగవ తేదీ బుధవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఏడవ తేదీ నుండి పదవ తేదీ వరకు హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో జరిగే 71వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

## ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**నవతెలంగాణ-కారేపల్లి**

ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కారేపల్లి ఆసుపత్రి ఎదుట ఆశా వర్కర్లు అందోళన చేశారు. ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనకు ఉద్దేశించి సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడుతూ ఆశాలు గతంలో అందోళనతో ప్రభుత్వం ఆశాలకు రూ.50 లక్షల బీమా కల్పిస్తామని, మట్టి ఖర్చులు రూ.50వేలు, పదవీ విరమణ అనంతర బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా అమలు జరపటం లేదన్నారు. ఆశాల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వాంకుడోత్ కమల, జంగ కళ్యాణి, నాయకురాళ్లు ఎం.కుమారి, ఆదెర్ల దేవకరుణ, సరస్వతి, పద్మ, చందమ్మ మంగ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీస్

**నవతెలంగాణ-కారేపల్లి**

కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదిన సమ్మెలోకి దిగనున్నారు. సమస్యలపై సమ్మెలోకి వెళ్తున్నట్లు కారేపల్లి కేజీబీవీ ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం సమ్మె నోటీసును ఎంఈవో జయరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీసౌజన్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేక ఉద్యోగ, ఉపాధ్యాయులు మానసికంగా కృంగిపోతున్నారన్నారు. ప్రభుత్వ స్పందించకుంటే 10వతేది నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు శ్రీలత, రమ, స్వాతి, కవిత, విజయ, తిరుపతమ్మ, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ మహాసభను జయప్రదం చేయండి

- రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

**నవతెలంగాణ-పాల్వంచ**



ఈనెల 5న కొత్తగూడెంలో జరుగనున్న యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, కోరుతూ కరపత్రాన్ని రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు విడుదల చేసారు. గురువారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఈ సభలకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, పలు శాఖల అధికారులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ కార్యదర్శి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శులు ఎంబీఐ, శ్రీనివాస్, రాజయ్య, నాయకులు యాకుబ్ పాషా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## వికాసం విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయం

- జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శివనాయక్
- దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న న్యాయమూర్తి

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వికాసం పాఠశాల బాల బాలికలు జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి వివిధ క్రీడలలో పాల్గొని మొదటి బహుమతి రెండవ బహుమతి సాధించడం అభినందనీయమని భద్రాచలం జ్యుడీషియల్ జడ్జ్ శివ నాయక్ అన్నారు. గురువారం భద్రాచలంలోని వికాసం పాఠశాలను వారు సందర్శించి రాష్ట్రస్థాయి వివిధ క్రీడలలో పాల్గొని పథకాలు సాధించిన చిన్నారులను అభినందించి దృష్టిలోపం వినికిడి లోపం ఉన్న చిన్నారులకు చదువుతోపాటు వారికి ఇష్టమైన క్రీడలలో పాల్గనేలా ప్రోత్సహిస్తూ వారిని ప్రయోజకుల్ని చేస్తున్నందుకు ప్రిన్సిపాల్ ను సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శివ నాయక్ మాట్లాడుతూ.. దివ్యాంగులైన విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వారిలో ఉన్న ప్రత్యేక ప్రతిభ ప్రపంచానికి తెలిసే విధంగా రాణించాలని కోరారు. వికాసం పాఠశాలకు కావలసిన అన్ని సాయ సహకారాలు అందిస్తానని, ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ హామీ ఇచ్చారు. అనంతరం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్స్, అరటి పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వికాసం పాఠశాలకు రెండు కుట్టు మిషన్లు పిల్లలకు ఆట వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, టీచర్లు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబాలు

- గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

**నవతెలంగాణ-ఇల్లందు**



వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) రాష్ట్ర ప్రధానకార్యదర్శి జటంగి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందు ఐఎఫ్టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం మండల కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గత మూడు, నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ మండల అధ్యక్షులు రామిశెట్టి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, యూనియన్ మండల గౌరవ అధ్యక్షులు రామల్ల మోహన్ రావు, మండల కార్యదర్శి తొగర సామెల్, నాయకులు బానోత్ కిషోర్, ఎగ్గి విజయకుమార్, భూక్య తిరుపతి పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాలకు ముఖాముఖీ

- త్వరలో నియామక ఉత్తర్వులు

**నవతెలంగాణ-ఇల్లందు**

సెక్యూరిటీ డిపార్ట్మెంట్ నుండి కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు గురువారం కారుణ్య నియామకాలకు ముఖాముఖీ నిర్వహించామని, త్వరలో నియామక ఉత్తర్వులు అందజేస్తామని ఎస్ఓటు జిఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఏజెంట్ జెకె ఓసి కృష్ణ మోహన్రావు తెలిపారు. ఏరియా జెకె 5 ఓసి, సెక్యూరిటీ డిపార్ట్మెంట్ నుండి కారుణ్య నియామకాలకు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులు/రాలుకి వారి కుటుంబ సభ్యులు, సాక్షుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అన్ని వివరాలు నమోదు చేయడమైనదన్నారు. అర్హత కలిగిన వారికి ఇంటర్వ్యూలు పూర్తి అయిన తరువాత అందరిని వైద్యపరీక్షలకు పంపించి తరువాత నియామక ఉత్తర్వులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిఎం (పర్సనల్) జి.వి.మోహన్ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్, సాయి స్వరూప్, సూపర్డెంట్ రామకృష్ణ, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.



## మంచినీటి చెరువు మనందరిదీ

- పరిశుభ్రంగా ఉంచండి : చైర్మెన్ డీవి
- పాలకవర్గం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

**నవతెలంగాణ-ఇల్లందు**

బ్రిటిష్ కాలం నాటి, ఎంతో చరిత్ర ఉన్న చారిత్రాత్మకమైన ఇల్లెలపాడు మంచినీటి చెరువును పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజలదేనని మున్సిపల్ చైర్మెన్ డివి అన్నారు. ప్రజా పాలన వత్రోత్సవాలలో భాగంగా గురువారం మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో చెరువుకట్ట మీద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డివి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రేసింగ్ ఆఫ్ తెలంగాణగా సంవత్సర కాలంలోనే నిలబెట్టిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం దిశా నిర్దేశం చేసిందన్నారు. చెరువులో ఎవరూ కూడా చెత్తను వెయ్యరాదని కోరారు. అతి త్వరలో మినీ ట్యాంక్ బండ్ గా చెరువు కట్టను తీర్చిదిద్దుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకు షావలి, డిఈ మురళి, మున్సిపల్ కౌన్సిలర్లు వాంకుడోత్, కుమ్మరి రవీందర్, అంకెపాక నవీన్ కుమార్, సయ్యద్ ఆజం, కొక్కు నాగేశ్వరరావు, కటకం పద్మావతి, మాజీ కౌన్సిలర్ వాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, జవాన్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖ సిబ్బంది సేవలు అసాధారణం

**ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉచిత బస్సు పథకం | ప్రజాపాలన-రవాణా శాఖ విజయోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రవాణా శాఖకు సిబ్బంది చేస్తున్న సేవలు అసాధారణమైనవి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కొనియాడారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ మైదానంలోని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ప్రజాపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ఏడాది కాలంలో రవాణా శాఖ సిబ్బంది సాధించిన విజయాలను గుర్తు చేయాలనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆరు గ్యారెంటీల్లో భాగంగా డిసెంబర్ 9న ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఇది ఆర్టీసీని పునరుజ్జీవింప చేసిందని తెలిపారు. ఇది ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగును నింపే కార్యక్రమమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ అయినా, ఇవాళ ముఖ్యమంత్రిగా ఉన్న నేనైనా బాధ్యతాయుతంగా రవాణా కార్మికుల ఆకాంక్షలను గౌరవించాల్సిందేనన్నారు. కానీ ఆనాడు ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పరామర్శించని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈనాడు కీలకమైన అంశాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. 11 నెలల 20 రోజుల్లో 115 కోట్ల మంది ఆడబిడ్డలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ప్రతీ ఆడబిడ్డ ప్రతీ నెలా రూ.5 నుంచి రూ.7 వేలు ఆదా చేయగలుగుతున్నారని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలను రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రతీ నెలా ఒక కుటుంబానికి రూ. 10వేలు ప్రయోజనం పొందేలా పథకాల అమలు జరుగుతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 25లక్షల 35 వేల రైతు కుటుంబాలకు మొదటి ఏడాదిలోనే రూ. 21కోట్లతో రైతు రుణమాఫీ చేశామన్నారు.

వరి వేసిన వారికి గిట్టుబాటు ధరతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తున్నట్టు తెలిపారు. కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని చెప్పారు. దొడ్డు బియ్యం తినే పరిస్థితి లేదనీ, అందుకే రైతులు సన్నాలు పండించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని ప్రభుత్వ హాస్టళ్లలో, రేషన్ షాపుల్లో, మధ్యాహ్న భోజనాలకూ సన్నబియ్యం అందిస్తామని పునరుద్ఘాటించారు. ఈ నేలలో పండిన పంటనే మన బిడ్డలకు అందిస్తామన్నారు. 'బియ్యం రీసైక్లింగ్ మాఫియాను కూకటి వేళ్లతో పెకిలిద్దాం. నోటిఫికేషన్లు ఇచ్చి వాళ్లు పారిపోతే.. కోర్టుల్లో కేసులు పరిష్కరించి మొదటి ఏడాదిలోనే 55,143 ఉద్యోగ నియామకాలు చేపట్టాం. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర ఉందా? ఏ లక్ష్యం కోసం అమరుల ప్రాణ త్యాగం చేశారో, ఆ లక్ష్య సాధనలో భాగంగా తొలి ఏడాదిలోనే 55వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాం. ఇందులో ఒక్క తల తగ్గినా నేను క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నా. నగరంలో కాలుష్య నియంత్రణలో రవాణా శాఖది కీలక పాత్ర. కాలం చెల్లిన వాహనాలను స్క్రాప్‌నకు పంపాల్సిన బాధ్యత మీపై ఉంది.

ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు పెరగాల్సిన అవసరం ఉంది. దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనదే. రాబోయే రెండేండ్లలో మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులు కొని హైదరాబాద్ నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడుతాం. హైదరాబాద్ నగరంలో ఎలక్ట్రిక్ ఆటోలు నడుపుకునేందుకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలో ఒక ప్రణాళిక రూపొందించండి. నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చాల్సిన బాధ్యత ఉన్నది. మూసీకి గోదావరిని అనుసంధానం చేసి మూసీని అభివృద్ధి చేస్తాం. అవసరమైతే కొన్ని సార్లు కఠిన నిర్ణయాలు తీసుకునైనా సరే హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని పారదోలుతాం. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా నిలబెట్టేందుకు కృషి చేస్తాం' అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటీసీలు సీ. రమేష్, మమతా ప్రసాద్, డీటీసీ చంద్రశేఖర్ గౌడ్ , టెక్నికల్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రకుమార్ , శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీవోలు, ఆర్టీసీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు

నవతెలంగాణ-మియాపూర్

వరుసగా బీఆర్ఎస్ నేతల అరెస్టులు గురువారం రాష్ట్రంలో హైడ్రామా సృష్టించాయి. తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ పోలీసులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని ఆయన ఇంటివద్ద అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యే హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఇతర నేతలు కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. ఆయన్ను ఎలా అరెస్టు చేస్తారంటూ పోలీసులను నిలదీశారు. పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వివాదం జరిగింది. దాంతో కౌశిక్‌రెడ్డితోపాటు హరీశ్‌రావు, ఇతర నేతలను సైతం పోలీసులు అరెస్టు చేశారు. కౌశిక్‌రెడ్డిని బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించగా.. హరీశ్‌రావుతోపాటు ఇతర నేతలను గచ్చిబౌలి పీఎస్‌కు తరలించారు. అయితే తమ నేతల అరెస్టు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు గచ్చిబౌలి పీఎస్‌కు భారీగా తరలివచ్చారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని ఆందోళన చేశారు. అరెస్టు అయిన వారిని ఎమ్మెల్సీ కవితతోపాటు మాజీ మంత్రులు పరామర్శించారు. కాగా, గచ్చిబౌలి పీఎస్‌కు తరలించిన హరీశ్‌రావు, ఇతర నాయకులను గురువారం రాత్రి విడుదల చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్‌కు గురవుతుందని బుధవారం బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ముందుగా ఆయన ఏసీపీ అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పీఎస్‌కు వెళ్లగా అక్కడ ఏసీపీ లేకపోవడంతో తన ఫిర్యాదును తీసుకోవాలని స్టేషన్ సిబ్బందిని కోరారు. ఈ క్రమంలో అక్కడ వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరికి కౌశిక్‌రెడ్డి తన ఫిర్యాదు సిబ్బందికి అందజేశారు. అయితే ఈ క్రమంలోనే తమ పీఎస్‌లో కౌశిక్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించారని, విధులకు ఆటంకం కలిగించారని పోలీసు అధికారి రాఘవేంద్ర పీఎస్‌లో కంప్లైంట్ చేశారు. ఆ కంప్లైంట్‌ను ఆధారంగా చేసుకుని గురువారం ఉదయం పోలీసులు కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కౌశిక్‌రెడ్డి ఇంటికి చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**రాష్ట్రంలో పోలీసు రాజ్యం : కవిత ఎమ్మెల్సీ**

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బుధవారం ఏసీపీకి ఫోన్ చేసి తను కంప్లైంట్ ఇవ్వడం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తున్నానని ముందస్తు పర్మిషన్ తీసుకొని మాత్రమే ఆయన వెళ్లినట్టు తెలిపారు. ఉదయం అరెస్టు చేసి రాత్రైనా వారిని కోర్టుకు తీసుకుపోకుండా పీఎస్‌లో బంధించడం వెనుక కారణాలేంటో చెప్పాలన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగేతర శక్తిగా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం మారిందన్నారు. గాంధీ భవన్‌లో రాసిచ్చినవే ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. పోలీసులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని హితవు పలికారు.

**ప్రజా పాలన కాదు, రాక్షస పాలన : ఎమ్మెల్యే హరీశ్‌రావు**

రాష్ట్రంలో ప్రజా పాలన కాదు, రాక్షస పాలన నడుస్తోందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ పాలన అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. గచ్చిబౌలి పీఎస్ నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. పోలీసులను అతిగా ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ నిలబడలేదని, ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో ఇవాళ కేసులు, ఎఫ్ఐఆర్‌లు పోలీస్‌స్టేషన్లలో కాకుండా గాంధీభవన్‌లో తయారవుతున్నాయని తెలిపారు. గాంధీ భవన్ నుంచి ఆదేశాలు రానందునే తమను విడుదల చేయడానికి ఆలస్యం అయిందన్నారు. సీఎంకి ఢిల్లీలో రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని, ఆ పగ, ప్రతీకారంతోనే శాడిస్టిక్‌లా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యం అమలు కావడం లేదన్నారు. దేశ ప్రతిపక్ష నాయకుడిని, తననెందుకు అరెస్టు చేస్తారని రాహుల్ గాంధీ అడుగుతున్నారని, మరి తెలంగాణలో కూడా సీఎం రేవంత్ అదే చేస్తున్నడు కదా అని నిలదీశారు. సలహాలు ఇవ్వండనీ అడుగుతున్నావ్.. కానీ ఇస్తే పాటించడం లేదు కదా అని అన్నారు. కౌశిక్ రెడ్డిని విడుదల చేసే వరకూ బీఆర్ఎస్ నిద్రపోదని, ఆయనకు అండగా ఉంటుందన్నారు.

## 7న ఆటో, మోటార్ కార్మికుల బంద్

- ఆటో కార్మికులంతా జయప్రదం చేయండి : టీయూసీఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆటో, మోటార్ కార్మికులు శనివారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్ఎల్.పద్మ పిలుపునిచ్చారు. గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనీ, మీటర్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేలను వెంటనే ఇవ్వాలని కోరారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉపాధిని కోల్పోతున్న ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆటోమోటార్ రంగ కార్మికులు తమ సమస్యలపై ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తక్షణమే ఆటో, మోటార్ కార్మికుల సమస్యలపై యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## నేడు, రేపు రాష్ట్రంలో దీపాంకర్ భట్టాచార్య పర్యటన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పర్యటించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే లిబరేషన్ జనసభలోనూ, ప్రజాప్రదర్శన ర్యాలీలోనూ ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. తమ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు ఎన్.మూర్తి కూడా సభకు హాజరవుతారని తెలిపారు. ఏడో తేదీన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజాస్వామ్య, వామపక్ష మేధావులు, శ్రేయాభిలాషులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దీపాంకర్ భట్టాచార్య పాల్గొంటారని తెలిపారు.

## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు : తపస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రాల్లో ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తలపెట్టిన రిలే నిరసన దీక్షలకు, 9 నుంచి చేపట్టే నిరవధిక సమ్మెకు తాము మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేశ్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో ఏండ్ల తరబడి పనిచేస్తున్న 19,360 మంది ఉద్యోగులకు కనీస వేతనం అమలు కావడం లేదనీ, వారికి ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు వారిని రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- సామాజిక బహిష్కరణ పదానికి అర్థం తెలుసా?: కాసం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కులగణనలో పాల్గొనని వాళ్లను సామాజిక బహిష్కరణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం బాధ్యతారాహిత్యమే అవుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎంకు అసలు సామాజిక బహిష్కరణ అనే పదానికి అర్థం తెలుసా? అని ప్రశ్నించారు. సీఎం తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర పేరుతో ఏకం చేస్తానంటే.. రేవంత్‌రెడ్డి సామాజిక బహిష్కరణ అంటున్నారని విమర్శించారు. గుజరాత్, కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ పరువు తీసేలా సీఎం మాట్లాడొద్దని హితవు పలికారు.

## రేపు రాష్ట్రానికి నడ్డా

- సరూర్‌నగర్ స్టేడియంలో బీజేపీ సభ : ప్రేమేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనా వైఫల్యాలపై 'ఆరు అబద్దాలు.. 66 మోసాలు' పేరుతో ఈ నెల ఏడో తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో తమ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నామనీ, దానికి ముఖ్య అతిథిగా తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జేపీ నడ్డా హాజరవుతారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ సభలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు.

# రైతు బాగుకే ఫుడ్‌పార్కు

- సత్తుపల్లిలో మినీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు
- ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వ్యవసాయమంత్రితుమ్మల నాగేశ్వరరావు
- క్వాలిటీ బొగ్గుంది- థర్మల్ పవర్ స్టేషన్ కావాలి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- బుగ్గపాడు ఫుడ్‌పార్కును ప్రారంభించిన మంత్రులు



నవతెలంగాణ- సత్తుపల్లి

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్‌పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రైతులను బాగు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం సత్తుపల్లి వచ్చిన ఆయన మండలంలోని బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్కును వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాజకీయ, అభివృద్ధి పరంగా ఖమ్మం జిల్లాకు మంచి పేరుందన్నారు. జలగం వెంగళరావు మొదలుకొని తుమ్మల నాగేశ్వరరావు వరకు ఈ జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దారని తెలిపారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బుగ్గపాడు ఫుడ్‌పార్కుకు శంకుస్థాపన చేశారన్నారు. అప్పట్లోనే ఫుడ్‌పార్కు కోసం సుమారు రూ.100 కోట్లు కేటాయించి పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఆ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్‌పార్కును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి దయానంద్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో దాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఔత్సాహిత పారిశ్రామిక వేత్తలను ఫుడ్‌పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానించడంతో పాటు మహిళా సాధికారత కోసం మహిళలు కూడా చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వపరంగా ప్రోత్సహించనున్నట్టు చెప్పారు. ఇందుకోసం వారికి వివిధ రకాల చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై 200 మందికి తగ్గకుండా ఔత్సాహిక మహిళలను గుర్తించి వారికి శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. అంతేగాక ప్రతి నియోజకవర్గంలోనూ మినీ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు. ఇందుకోసం సత్తుపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు కలెక్టర్‌ను ఆదేశించారు.

**రైతుకు ఆదాయం కోసమే ఫుడ్‌పార్కు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఈ ప్రాంత రైతులకు ఆదాయం తెచ్చి పెట్టడం కోసమే సత్తుపల్లి ప్రాంతంలో ఫుడ్‌పార్కు ఏర్పాటు చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఫుడ్‌పార్కుకు ఎక్కువ మొత్తంలో పరిశ్రమల యూనిట్లు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ఫుడ్‌పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. తద్వారా ఈ ప్రాంత రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, ఇతరత్రా వాటి ద్వారా ఫుడ్‌పార్కును ఉపయోగించుకొని అభివృద్ధి చెందుతారన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఫుడ్‌పార్కును అభివృద్ధి చేయడంతో పాటు తమ దగ్గర ఉన్న నాణ్యమైన బొగ్గుతో థర్మల్ పవర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రులను కోరారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. బాలికల కోసం మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, హస్తకళల చైర్మెన్ నాయుడు సత్యనారాయణ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్దన్‌రెడ్డి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

**తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి**

- జమ్మికుంట కేవీకేలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రారంభం



నవతెలంగాణ - జమ్మికుంట

ప్రకృతి వ్యవసాయం కనుమరుగు కాకుండా రైతులందరూ సమిష్టిగా కృషి చేయాలని, వ్యవసాయ అనుబంధ రంగాలు కూడా దీనిలో భాగం అవ్వాలని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయ అనుబంధ శాఖకు అనువదించేలా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, రైతు సహకార సంఘాల వారు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని కోరారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, గ్రామ నవ నిర్మాణ సమితి స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమ సంఘాలు ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణపై ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. నేల ఎన్నో రకాల సూక్ష్మ జీవులకు ఆవాసాన్ని కల్పిస్తోందన్నారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలలను అందించడం అందరి బాధ్యతని తెలిపారు. ఆ దిశగా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. ఏటీఏఆర్ఐ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలో కార్యాచరణపై దృష్టి సారించాలని కోరారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం మీద అవగాహన రావడం కోసం దేశ వ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలు, 30వేల కృషి సఖీలు (మహిళలు) ద్వారా శిక్షణ ఇచ్చే విధంగా 10వేల జీవ వనరుల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

పంట దిగుబడికి అతి ముఖ్యమైన సేంద్రీయ కర్బన శాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరుగుతుందని చెప్పారు. ఇటువంటి గొప్ప ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వ్యవసాయం, రైతు సంక్షేమ సభ్యులు యం.భవానిరెడ్డి, కేవీకే ప్రధాన కార్యదర్శి పి.విజయ్‌గోపాల్‌రెడ్డి, సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టును మూడు సంవత్సరాల పాటు జమ్మికుంట, సైదాపూర్ మండలాల్లోని 8 గ్రామాల్లో 6340 మంది రైతులతో 10 వేల ఎకరాలలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే, 1974లో పరిపాటి జనార్ధన్‌రెడ్డి స్థాపించిన గ్రామ నవ నిర్మాణ సమితి సంస్థ 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహించారు. జీవ వనరుల కేంద్రానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, కేవికే శాస్త్రవేత్తలు, సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.కుమారస్వామి, డాక్యుమెంటేషన్ ఆఫీసర్ రమాకాంత్, ఫీల్డ్ స్టాఫ్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అల్లు అర్జున్, సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యం భద్రతకు సంబంధించి ఎలాంటి అదనపు నిబంధనలూ పాటించలేదన్నారు. యాజమాన్యానికి నటీనటుల రాక గురించి సమాచారం ఉన్నప్పటికీ ప్రత్యేక ప్రవేశం లేదా నిష్క్రమణ ఏర్పాట్లు చేయలేదన్నారు. అయినప్పటికీ అల్లు అర్జున్ వ్యక్తిగత భద్రతతో థియేటర్లోకి వచ్చారని.. అప్పటికే అక్కడ గుమిగూడిన ప్రజలందరూ ఒక్కసారిగా అతనితో పాటు లోపలికి వెళ్లడంతో వ్యక్తిగత సిబ్బంది ప్రజలను నెట్టడం ప్రారంభించారన్నారు. దాంతో తీవ్ర తోపులాట జరిగి మహిళ మృతికి కారకులయ్యారన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 105,118(1) రీ/వి 3(5) బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. థియేటర్ లోపల ఒక వ్యక్తి మరణంతోపాటు ఇతరులు గాయపడటానికి దారితీసిన పరిస్థితులకు కారణమైన అందరిపైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్ఐలు పాల్గొన్నారు.

**బాలుడి పరిస్థితి విషమం !**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తల్లిని కోల్పోయి, తానూ తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైన బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలునికి బేగంపేట కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, బాలుని తల్లి రేవతి మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

# తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడ?

- కేసీఆర్ ఫాంహౌస్ విడిచి బయటకు రావాలి
- కౌశిక్‌రెడ్డి మతి లేకుండా మాట్లాడుతున్నారు
- బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి గంధపు చెక్కల స్మగ్లర్
- మంత్రి కొండా సురేఖ ఘాటు వ్యాఖ్యలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ పిచ్చి కూతలు కూస్తున్నారు. ఆయన భాష దారుణంగా ఉంది. రాష్ట్రం వస్తుందని తెలిశాకే కేటీఆర్, కవిత తట్టాబుట్టా సర్దుకొని ఉద్యమంలోకి వచ్చారు. విద్యార్థుల బలిదానాలు, అన్ని వర్గాల పోరాటం ఫలితంగానే స్వరాష్ట్రం సిద్ధించింది. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడున్నారో చెప్పాలి" అని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ మీడియా ముందు ఏం మాట్లాడు తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఆయన ఉచ్చులో విద్యార్థులు పడొద్దని సూచించారు. గతంలో పెట్రోల్ క్యాన్ తెచ్చుకొని అగ్గిపెట్టె మర్చిపోయా రనీ, ఇప్పుడు పెట్రోల్ క్యాన్ తెచ్చుకుంటే అగ్గిపెట్టెలు బీఆర్ఎస్ కార్యకర్తలే ఇస్తారని ఎద్దేవా చేశారు. ఉద్యమంలో కేసీఆర్ కుటుంబంలోని వారిలో ఏ ఒక్కరికి ఒక్క గీత కూడా పడలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులాలపై సూక్ష్మంగా ఆలోచిస్తూ వారి ఎదుగుదల కోసం పనిచేస్తున్నారని తెలిపా రు. కేసీఆర్ ఫాం హౌస్ వీడి ప్రజాక్షేత్రంలోకి రావాలని హితవు పలికారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, నాయకులు అర్థవంతమైన సలహాలు, సూచనలు చేస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. అర్థం పర్థం లేకుండా మాటా్డితే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ లాగా తాము అక్రమ అరెస్టులు చేయదలుచుకుంటే ఆ పార్టీలో ఒక్కరూ మిగలరని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ నేతల హస్తం లేకపోతే అధికారులను దేశాలు ఎందుకు దాటించారని నిలదీశారు.

**కోమటిరెడ్డిని విమర్శించే అర్హత రాకేష్‌కు లేదు**

రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే అర్హత బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి లేదని సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తమ స్థాయికి తగ్గ వ్యాఖ్యలు చేయాలని హితవు పలికారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రజలపై ఎంత ప్రేముందో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఉద్యమంలో బీఆర్ఎస్ నేతలు ఉత్తుత్తి రాజీనామాలు చేశారనీ, తెలంగాణ కోసం వెంకటరెడ్డి మాత్రమే తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు.

హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని సురేఖ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో సైతం అతని ప్రవర్తన సరిగాలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆయన తన పద్ధతి మార్చుకోవాలని సూచించారు. తెలంగాణ తల్లిని దొరసానిలా తీర్చిదిద్దారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారు ఆభరణాలు, వడ్డాణాలు పెట్టి కవితలా తెలంగాణ తల్లిని తయారు చేశారని ఆరోపించారు. సబ్బండ వర్గాల ప్రతినిధిగా ప్రజలు కోరుకునే తల్లి తెలంగాణ తల్లినే తాము ప్రతిష్ఠిస్తామని స్పష్టం చేశారు.

## 317 జీవో బాధితులకు న్యాయం చేయండి

**ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు టీపీటీఎఫ్ వినతి**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాష్ట్రంలో 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ స్థానిక జిల్లాల్లో లోకల్ క్యాడర్ కింద రీ-అలోకేషన్ ఉత్తర్వులు వచ్చే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇటీవల వెలువరించిన 243, 244 జీవోల ద్వారా ఉపాధ్యాయులకు ప్రయోజనం కలిగే పరిస్థితులు లేవనీ, స్పౌజ్, మెడికల్, తదితర కేటగిరీల్లో లోకల్ క్యాడర్ మార్పు కోసం వేచి చూస్తున్న ఉపాధ్యాయు లందరికీ బదిలీ అవకాశం కల్పించేలా ప్రభుత్వంతో చర్చించాలని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా స్పౌజ్ కేటగిరీలో బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిర్మల్ జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతుల పక్షాన నిలబడ్డారనే ఆరోపణతో సంబంధం లేని అంశాలను చూపెట్టి టీపీటీఎఫ్ ఆ జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి విజయపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

# స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల క్రియాశీలక పాత్ర

- ఆ ఉద్యమాల్లో పాల్గొనని వారే ప్రజలను రెచ్చగొడుతున్నారు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-కల్చరల్

"దేశ మొదటి స్వాతంత్ర్య పోరాటం నుంచి తదుపరి ఉద్యమం వరకు ముస్లింలు క్రియాశీలక భాగస్వాములయ్యారు.. కానీ నాడు ఉద్యమాల్లో పాల్గొనని వారు నేడు ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ.. దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని కలుషితం చేస్తున్నారు" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సయ్యద్ షానవాజ్ అహ్మద్ ఖాద్రి రచించిన గ్రంథం పర్వేజ్ అలం సిద్దిక్ ఆంగ్ల అనువాదం "బ్లడ్ స్పీక్స్ టూ.." గ్రంథం ఆవిష్కరణ సభ హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన వేదికపై గురువారం జరిగింది. డిప్యూటీ సీఎం పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల త్యాగాలు విస్మరించలేనివన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్, క్విట్ ఇండియా, జైహింద్ వంటి నినాదాలు రూపొందించిన వారు ముస్లిం సోదరులేనని గుర్తు చేశారు. అలాంటి చరిత్రను మరుగుపరచాలని రాజ్యాంగం పట్ల గౌరవం లేని వారు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకుంటూ ప్రేమ భావన పెంచుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పాదయాత్ర చేశారని, ఆయనకు అండగా నిలవాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం వనరులు, రాజకీయ ఆర్థిక అవకాశాలు సమంగా అందించాలని కులగణన చేస్తున్నామని చెప్పారు. అహ్మద్ ఖాద్రి రచించిన గ్రంథం.. దేశంలో ముస్లింల భాగస్వామ్యాన్ని తెలుపుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు చైర్మెన్ హుస్సనీ, గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ రియాజ్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మెన్ కొత్వాల్ పాల్గొనగా ఎండీ జావీద్ కార్యక్రమ నిర్వహణ చేశారు.





ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు మండలానికి చెందిన ఓ గిరిజన తండా అది. ఇరవై మంది గిరిజన మహిళలు తమ సాంప్రదాయ విజ్ఞానాన్ని స్థిరమైన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పర్యావరణ అనుకూలమైన విస్తరాకులు, కప్పులను తయారు చేస్తూ జీవనోపాధిని పొందుతూ, గౌరవంగా బతుకుతున్న వారి స్ఫూర్తిదాయక పరిచయం నేటి మానవిలో...



# సాంప్రదాయమే జీవనోపాధిగా...

అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 'అడ్డాకులు' అని పిలువబడే బౌహినియా వహ్లీ ఆకులు విపరీతంగా దొరుకుతాయి. ఆ పరిసర ప్రాంతాల్లోని గిరిజన ప్రజలంతా ఆ ఆకులతోనే విస్తరాకులు తయారు చేసి ఇంటి అవసరాల కోసం వాడుకుంటారు. ఇవి తరతరాలుగా వారి సాంప్రదాయ ప్లేట్లు. ఈ విస్తరాకులు పర్యావరణ అనుకూలమైనవి కూడా. వాటినే ఇప్పుడు వారు ఉత్పత్తి చేసి విక్రయించడం మొదలుపెట్టారు. తద్వారా గిరిజన మహిళలు పర్యావరణ బాధ్యతను తమ భుజాలపై వేసుకోవడంతో పాటు స్వయం ఉపాధి పొందే మార్గాన్ని కనుగొన్నారు.

## ఐదు రకాల ఉత్పత్తులు

పాడేరు ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ITDA) అనే సంస్థ వన్ ధన్ వికాస్ కేంద్రం (VDVK) మద్దతుతో గిరిజన ప్రజల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడింది. 2024 ఫిబ్రవరిలో అప్పటి కలెక్టర్ సుమిత్ కుమార్, ITDA ప్రాజెక్ట్ ఆఫీసర్ (PO) వి.అభిషేక్ పాడేరులోని VDVK విస్తారకు సెంటర్‌ను ప్రారంభించారు. ఆ పరిసర గ్రామాల నుండి మహిళలు ఈ బయోడిగ్రేడబుల్ ప్లేట్లు, కప్పులను తయారు చేసేందుకు ఈ కేంద్రానికి చేరుకుంటారు. 'ఆదివారాల్లో కూడా దాదాపు 20 మంది మహిళలు తమ ఇళ్ల వద్దనే ఆకులను కుడతారు. వీలైనవారు కేంద్రానికి వచ్చి యంత్రాలను ఉపయోగించి విస్తరాకులు తయారు చేస్తారు. కేంద్రానికి ఎప్పుడు రావాలని అనే షెడ్యూల్‌ను వారే నిర్ణయించుకుంటారు' అని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మురళి ఓ వెబ్ సైట్‌తో పంచుకున్నారు. కేంద్రంలో మందపాటి లైన్డ్ బఫే ప్లేట్లు, సాధారణ ప్లేట్లు, చేతితో కుట్టిన ప్లేట్లతో పాటు రెండు పరిమాణాల కప్పులతో సహా మొత్తం ఐదు రకాలను తయారు చేస్తున్నారు. వీరు ప్రతిరోజూ దాదాపు 2,000 ప్లేట్లు, కప్పులు ఉత్పత్తి చేస్తున్నారు.

## ఆకులను సేకరించి

గిరిజన మహిళలు తరతరాలుగా తమ రోజువారీ ఉపయోగం కోసం ఈ బయోడిగ్రేడబుల్ ప్లేట్‌లను తయారు చేసుకుంటున్నారు. కేవలం వారి అవసరాల కోసమే పరిమితమైన ఈ నైపుణ్యం ఇప్పుడు విస్తృత మార్కెట్‌కు చేరి వారికి జీవనోపాధిగా మారింది. 'విస్తరాకులు తయారు చేయడం మాకు కొత్తకాదు. మేము ఎప్పుడూ చేసే పనే ఇది. అయితే ఇప్పుడు ఇది మాకు స్థిరమైన ఆదాయాన్ని అందించడంలో సహాయపడుతుంది' అని బి.శాంతి అనే మహిళ అంటున్నారు. గ్రామాల్లోని మహిళలు సీజన్‌లో అంటే మే, జూన్‌లలో విస్తరాకుల కోసం ఆకులను సేకరిస్తారు. వీటిని జాగ్రత్తగా భద్రపరుచుకుంటాము. కేంద్రంలో పని చేసే మహిళలు వారానికొకసారి మహిళల వద్ద ఆకులను సేకరించి తెచ్చుకుంటారు. అప్పుడప్పుడు వీరు కూడా స్వయంగా వెళ్ళి ఆకులను సేకరిస్తారు.

## ప్రజల్లో అవగాహన పెరుగుతుంది

ప్లాస్టిక్ వల్ల పర్యావరణం ఎదుర్కొంటున్న సమస్యల గురించి పెరుగుతున్న అవగాహనతో ఈ పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలకు సమాజంలో డిమాండ్ పెరుగుతోంది. 'ప్రజలు స్థిరమైన ఎంపికలను ఎంచుకుంటున్నారు. ఈ మార్పు మంచి అమ్మకాలు, ఆర్థిక స్థిరత్వంపై మాకు ఆశను కలిగిస్తుంది' అని కేంద్రం ట్రెజరీ అధికారి విజయలక్ష్మీ, విడివికె కార్యదర్శి చిన్నమ్మలు అంటున్నారు. యంత్రాల ఉపయోగం మా ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరిచింది. దాంతో చాలా త్వరగా ప్లేట్లు, కప్పులు తయారు చేయగలుగుతున్నాం. కొనుగోలుదారులను ఆకర్షించే విధంగా శుద్ధి చేసిన ఉత్పత్తులను రూపొందించడానికి యంత్రాలు మాకు సహకరిస్తున్నాయి' అని కేంద్రం సిబ్బంది చింతా మాధవి అన్నారు.



## మహిళలకు స్వావలంబన

జిల్లాలో డిసెంబరు 1 నుండి ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, బ్యాగ్‌లను నిషేధించారు. దాంతో వీరి ప్రాజెక్ట్ మరింత ఊపందుకుంది. 'మొదట్లో వీరు ప్లేట్లను మాత్రమే తయారు చేశారు. ఐటీడీఏ ప్రోత్సాహంతో వారు ఇప్పుడు ప్లేట్లతో పాటు కప్పులను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఉత్పత్తులను ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సరఫరా చేస్తున్నారు. డిసెంబర్ 1 నుండి జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం వల్ల ఈ పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలకు డిమాండ్ మరింత పెరిగింది' అని మురళి అన్నారు. ఈ కేంద్రం నడిచేందుకు విడివికె పథకం ద్వారా రూ.15 లక్షలు, మెషినరీ కోసం రూ.10 లక్షలు, శిక్షణ, సీడ్ క్యాపిటల్ కోసం రూ.5 లక్షలు కేటాయించారు. 'మహిళలకు స్వావలంబనకు మార్గం చూపడమే మా లక్ష్యం. ఆకులను సేకరించడం నుండి తుది ఉత్పత్తులను విక్రయించడం వరకు ప్రతిదీ మహిళలే నిర్వహిస్తారు. వారికి మార్గనిర్దేశం చేయడానికి, మద్దతు ఇవ్వడానికి మేము ఎప్పుడూ అందుబాటులో ఉంటాము' అని పిఓ అభిషేక్ అన్నారు.

# ఎముకలు బలంగా....

ఎముకలు మన శరీరంలో ముఖ్యమైన భాగం. శరీరం బలహీనంగా ఉంటే... ఎముకలూ బలహీనంగా మారతాయి. నిర్లక్ష్యం చేస్తే ఆస్టియోపోరోసిస్ వచ్చే అవకాశం ఉంది. అందువల్ల, పగుళ్లు జరుగుతూనే ఉంటాయి. ఈ సమస్యను అధిగమించాలంటే కాల్షియంతో పాటు, జింక్, భాస్వరం మెండుగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

**ఈ పండ్లను తీసుకోండి..**

జామ, నారింజ వంటి పండ్లలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. USDA ప్రకారం, 100 గ్రాముల జామపండులో 18mg కాల్షియం ఉంటుంది. యాపిల్స్, అరటిపండ్లు, నారింజలు కూడా ఈ ఖనిజాన్ని అందిస్తాయి. ఇతర సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడుతుంది. కొల్లాజెన్ ఎముకల బలాన్ని కాపాడుతుంది.

**బాదం, ఇతర గింజలు**

బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు వంటి నట్స్‌లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని తినడం వల్ల మెగ్నీషియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఎముకలను బలోపేతం చేయడానికి, వ్యాధులను దూరం చేయడానికి సహాయపడతాయి.

**నువ్వులు తినండి**

నువ్వులు, అవిసె గింజల్లో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ ఉంటాయి. ఎముకలను బలోపేతం చేయడానికి ఈ ఖనిజాలు అవసరం. వీటిని మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీ ఎముకలను బలంగా మార్చుకోవచ్చు.

**ఆకుకూరలు**

ఆకు కూరలతో ఎముకలు బలపడతాయి. బచ్చలికూర, మెంతి, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో విటమిన్ కె, కాల్షియం, మెగ్నీషియం అధికం. ఇవి ఎముకల సాంద్రత, బలాన్ని పెంచుతాయి.

**పాలు, పెరుగు, పనీర్**

పాలు, పెరుగు, చీజ్‌లో కాల్షియం నిక్షేపాల ఘని. ఇవి బోలు ఎముకల వ్యాధి నుండి రక్షణ కల్పిస్తాయి.

**బీన్స్, పప్పులు, ధాన్యాలు**

పప్పుధాన్యాల్లో రాజ్మా, చిక్పీస్, కాయధాన్యాలు వంటి వాటిల్లో ప్రొటీన్, కాల్షియం, మెగ్నీషియం ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేస్తాయి.

**మాంసాహారం**

గుడ్లు, చేపలు కాల్షియానికి మంచి వనరులు. ఎముకలకు అవసరమైన ఇతర పోషకాలు కూడా ఇందులో ఉన్నాయి. విటమిన్ డి కూడా శరీరంలో కాల్షియం శోషణను పెంచుతుంది.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మన్మోహన్

(మొదటిపేజీ తరువాయి)

ఇతర సిట్టింగ్ జడ్జీల సమక్షంలో సుప్రీంకోర్టులో ఈ వేడుక జరిగింది. జస్టిస్ మన్మోహన్ ప్రమాణస్వీకారంతో.. సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 33కి చేరింది.1962 , డిసెంబర్ 17 జన్మించిన జస్టిస్ మన్మోహన్ 1987లో ఢిల్లీ క్యాంపస్ లా సెంటర్ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. అదే ఏడాది సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003లో సీనియర్ న్యాయవాదిగా నియమితులైన ఆయన 2008లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2009లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2023లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, 2024లో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ మన్మోహన్‌ను అత్యున్నత న్యాయస్థానానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 3న కేంద్రం ఆ సిఫారసును ఆమోదించింది.

## కొలువుదీరిన 'మహా' సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

అగ్రనాయకుడు అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వీరితో ప్రమాణం చేయించారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ సీఎంలు చంద్రబాబు నాయుడు, మోహన్ యాదవ్, యోగి ఆదిత్యనాథ్, భజన్‌లాల్ శర్మ సహా ఎన్డీయే పాలిత రాష్ట్రాల నుంచి 19 మంది ముఖ్యమంత్రులు హాజరయ్యారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడిన విషయం విదితమే. అయితే అజిత్ పవార్ బాధ్యతలపై బుధవారమే ఓ స్పష్టత వచ్చినప్పటికీ.. శిండే డిప్యూటీ సీఎం పదవికి అంగీకరిస్తారా? లేదా అన్న దానిపై చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. దీనిపై శివసేన అధికారిక ప్రకటన చేయటంతో ప్రతిష్టంభనకు తెరపడింది.

## షెడ్యూల్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

చైర్మెన్‌గా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీజీపీఎస్సీలో వాళ్లు తెలుసు, వీళ్లు తెలుసంటూ, ఉద్యోగం ఇప్పిస్తామంటే ఎవరిని నమ్మకుండా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నిరుద్యోగులకు సూచించారు. అలాంటి పైరవీకారులెవరైనా కమిషన్ కార్యాలయంలో ఉంటే వెంటనే తప్పుకోవాలని హెచ్చరించారు. ఫిర్యాదుల కోసం త్వరలో టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. "ఐఏఎస్ నా కల. నేను ఉద్యోగానికి సన్నద్ధం అయ్యే సమయంలో నాపై నమ్మకంతో చదివి ఉద్యోగం సాధించానే తప్ప ఎవరినీ నమ్మలేదు. కష్టపడి చదివి సివిల్ సర్వీసెస్‌లో 15వ ర్యాంక్ సాధించాను. కమిషన్‌పై మరింత నమ్మకం కలిగేలా యూపీఎస్సీ తరహాలో పనిచేస్తాం. నిరుద్యోగ అభ్యర్థుల కోసం మూడున్నరేండ్ల సర్వీస్‌ని వదులుకుని టీజీపీఎస్సీ బాధ్యతలు స్వీకరించారు. అభ్యర్థులు కష్టపడి పరీక్షలు రాస్తే విజయం సాధిస్తారు" అని నిరుద్యోగులకు ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేశారు.

## పంచాయతీల విలీనంపై జోక్యం చేసుకోలేం : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శంషాబాద్ మండలంలో 51 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయాలనే ప్రభుత్వ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. శంషాబాద్ మండలంలోని 51 పంచాయతీలను శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేసే ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ మాజీ సర్పంచ్ పద్మావతి ఇతరులు వేసిన పిటిషన్లను కొట్టివేసింది. గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. మున్సిపాలిటీలో కలిపితే పన్నుల భారం పెరుగుతుందని పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, బహదూర్గూడ, హమీదుల్లానగర్ తదితర గ్రామాల విలీనాన్ని అడ్డుకోవాలన్న పిటిషన్లను బెంచ్ కొట్టివేసింది. ప్రభుత్వం మున్సిపాలిటీ చట్టాన్ని తీసుకువచ్చిందనీ, విలీనాన్ని అడ్డుకోరాదని ప్రభుత్వ వాదనను ఆమోదించింది.

# ప్రతిపక్షాల వినూత్న నిరసన

(మొదటిపేజీ తరువాయి)

మోడీ విచారణ జరపలేడనీ, ఎందుకుంటే అది మోడీ తనపైన వేసుకునే విచారణగానే ఉంటుందని అన్నారు. కాగా, మకర ద్వార్ వద్ద ప్రతిపక్షాల ఆందోళనపై స్పీకర్ ఓం బిర్లా మళ్లీ స్పందించారు. సభకు వెళ్లే ఇతర ఎంపీలకు దారివ్వాలని సూచించారు. రూల్ 349 ప్రకారం.. సభలో హాజరయ్యే సభ్యులు ల్యాపెల్ పిన్ లేదా బ్యాడ్జ్ రూపంలో జాతీయ జెండా తప్ప మరెలాంటి బ్యాడ్జ్‌లూ ప్రదర్శించరాదు, ధరించరాదని స్పీకర్ అన్నారు.

**బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే వ్యాఖ్యలతో లోక్‌సభలో గందరగోళం**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే చేసిన వ్యాఖ్యలు గురువారం లోక్‌సభలో గందరగోళాన్ని సృష్టించాయి. తొమ్మిదో రోజు లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించగా ప్రతిపక్షాలు సంభాల్ ఘటన, అదానీ వ్యవహారంపై చర్చకు పట్టుబట్టాయి. దుబే మాట్లాడిన తర్వాత సంభాల్ అల్లర్లపై ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అనుమతిస్తానని చెప్పారు. దీంతో దుబే తన ప్రసంగాన్ని మొదలు పెడుతూ... కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఏదో విధంగా ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్, రాహుల్, ప్రియాంక వాద్రాలను ప్రశ్నిస్తూ 10 అంశాలను లేవనెత్తారు. రాహుల్ గాంధీ దేశ ద్రోహి అంటూ అనుచిత వ్యాఖ్యాలు చేశారు. అమెరికాకు చెందిన బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో రాహుల్ గాంధీకి సంబంధాలు ఉన్నాయని నిషికాంత్ దుబే ఆరోపించారు. రాహుల్, సోరోస్, ఓసీసీఆర్‌పీ మధ్య ట్రై యాంగిల్ బంధం ఉందన్నారు. వీరిలో ఒకరు బాధ పడ్డా మిగిలిన వారు కలత చెందుతారని వ్యాఖ్యలు చేశారు. సోరోస్‌కు సాయం చేయాలని రాహుల్ చూస్తున్నారన్నారు. దేశాన్ని విభజించాలని చూసేవారు ప్రగతిని చూడలేరని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిషికాంత్ దుబే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో లోక్‌సభ కార్యకలాపాలను స్పీకర్ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఇదే గందరగోళం కొనసాగింది. దీంతో స్పీకర్ చైర్ లో ఉన్న ప్యానల్ స్పీకర్ జగదాంబికా పాల్ సభను మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే సవరణ బిల్లుపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. అయితే ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభలో తీవ్ర గందరగళం నెలకొంది. వెంటనే జగదాంబిక పాల్ సభను నేటి(శుక్రవారం)కి వాయిదా వేశారు.

**రాజ్యసభలో భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లు ఆమోదం**

రాజ్యసభలో భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ అనంతరం రాజ్యసభ మూజువాణీ ఓటుతో ఆమోదించింది. ఆగస్టు 9న ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది.

## ప్రజల ఆదాయంలో సగం విద్య, వైద్యానికే

(మొదటిపేజీ తరువాయి)

రంగాలను సేవా రంగాలుగా గుర్తించి ప్రభుత్వాలే వాటి ఖర్చును భరించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రజలకు అవసరమైన వాటిని వదిలేసి, అవసరం లేని వాటితో కాలం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ విధానాల కారణంగా సంపద కొద్ది మంది చేతుల్లోకి వెళ్లిపోతున్నదని గుర్తుచేశారు. ప్రజల ఆస్తులను అమ్మేస్తున్నారనీ, మత వైషమ్యాలను రెచ్చగొడుతున్నారనీ, రచయితలు, ప్రతిపక్షాలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రకంగా సమాజాన్ని, రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజా వైద్యశాల అందిస్తున్న సేవలను జూలకంటి కొనియాడారు. ఈ సేవలను జిల్లాల్లోనూ విస్తరించేందుకు కృషి చేయాలని సూచించారు. అందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. నవతెలంగాణ సిబ్బంది కేవలం వార్తల సేకరణ, ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకే పరిమితం కాకుండా ప్రజారోగ్యం మెరుగుపరిచేందుకు వైద్యసేవల దిశగానూ సేవలు చేయడం ముదావహమని అభినందించారు. సామాజిక సేవ, జర్నలిజంపై కనీస అవగాహన లేకపోయినా కొంత మంది కేవలం డబ్బుతోనే పెద్ద ఛానళ్లు, పత్రికలు నడిపిస్తున్న ప్రస్తుత తరుణంలో నవతెలంగాణ లాంటి పత్రికలు చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ పత్రిక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నదని చెప్పారు. కార్పొరేట్ జర్నలిజానికి ప్రత్యామ్నాయ పత్రిక నవతెలంగాణ అని తెలిపారు. త్యాగం, క్రమశిక్షణ కలిగిన మల్లు వెంకట నర్సింహారెడ్డి ఆశయసాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ధనిక కుటుంబంలో పుట్టి అనుభవించేందుకు అన్ని ఉన్నా...మల్లు వెంకట నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి నాటి నేతలు ఇండ్లను, ఆస్తులను వదిలేసి పేదల ఇండ్ల వద్దకు వెళ్లి వారి కోసం ఆయుధాలను చేతబట్టారని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తి కొనసాగాలని ఆకాంక్షించారు.

**ధైర్యమిచ్చే ఆస్పత్రులు అవసరం :డాక్టర్ రమాదేవి**

నేటి సమాజంలో పేదలకు మానసిక ధైర్యాన్నిచ్చే ఆస్పత్రులు అవసరమని డాక్టర్ రమాదేవి తెలిపారు. గతంలో ఏదైనా వ్యాధికి గురయ్యామని ప్రజలు ఆందోళన చెందితే ఆస్పత్రులు, గ్రామాల్లో వైద్యం కొంత తెలిసిన వారు కూడా ధైర్యమిచ్చేవారని తెలిపారు. పేదలు పద్మవ్యూహాన్ని తలపించే ప్రభుత్వాస్పత్రులకు, వేలాది రూపాయలు ఖర్చయ్యే ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లేందుకు జంకుతున్నారని తెలిపారు. ఎమ్‌వీఎస్ క్లినిక్‌లాంటి ప్రజా వైద్యశాల జిల్లాకు ఒకటి చొప్పున రావాలని ఆకాంక్షించారు.

**40 ఏండ్లు దాటితే టీఎంటీ టెస్టు తప్పనిసరి**

కరోనాకు వ్యాక్సిన్ వేసుకున్న తర్వాత గుండెలో చిన్న చిన్న బ్లాక్స్ ఏర్పడుతున్నట్టు శాస్త్రీయంగానూ నిర్ధారించారని డాక్టర్ రమాదేవి ఈ సందర్భంగా తెలిపారు. అయితే కొన్నిసార్లు ఈ బ్లాక్స్ వాటంతటే అవే



కనుమరుగవుతున్నాయని చెప్పారు. ముందు జాగ్రత్తగా 40 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరూ టీఎంటీ పరీక్షను చేయించుకోవాలని సూచించారు.

**ప్రజల్లో అవగాహన పెరగాలి :కరుణ**

గుండె జబ్బులు, వైరల్ ఫీవర్లు తదితర వ్యాధుల పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందని మల్లు వెంకట నర్సింహారెడ్డి కూతురు పాదూరి కరుణ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా కూడా ప్రజా వైద్యశాల కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. కమ్యూనిస్టు కార్యకర్తల నిజాయితీ తనకు చిన్నప్పటి నుంచి తెలుసని అన్నారు. తన తండ్రి, సహచర కార్యకర్తలతో కలిసి అల్లోపతి వైద్యంపై ప్రజల్లో అగాహన పెంచేందుకు కృషి చేశారని చెప్పారు. అల్లోపతి వైద్యంపై అవగాహన పెరిగినా, అది అందకుండా నేడు కార్పొరేట్ల చేతుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్, ఈఎస్ఐ కార్డులపై ప్రజలకు అవగాహన పెరిగితే బీమా సౌకర్యంతో సకాలంలో వైద్యం చేయించుకునేందుకు ముందుకొస్తారన్నారు. మల్లు వెంకటనర్సింహారెడ్డి మనవడు మల్లు వంశీ మాట్లాడుతూ ప్రజా వైద్యశాల సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. ఈ ఆస్పత్రికి ప్రతి ఏటా రూ.50 వేలు ఇస్తున్న తాను వచ్చే ఏడాది నుంచి రూ.ఒక లక్ష విరాళంగా అందిస్తానని ప్రకటించారు.

కార్యక్రమానికి ముందు జూలకంటి, డాక్టర్ రమాదేవి, కరుణ, మల్లు వంశీ, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ లక్ష్మణ్ రావు, నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్, ఇన్‌ఛార్జి ఎడిటర్ రాంపల్లి రమేశ్, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ ఎడిటర్ కె.ఆనందాచారి, నవతెలంగాణ జనరల్ మేనేజర్ కె.భరత్ తదితరులు మల్లు వెంకటనర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనరల్ మేనేజర్ నరేందర్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమం అనంతరం కరుణ తమ కుటుంబం తరపున ప్రజా వైద్యశాల సేవా కార్యక్రమాల కొనసాగింపునకు రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. ఇందులో కరుణ రూ.ఒక లక్ష ఇవ్వగా, మల్లు వెంకటనర్సింహారెడ్డి మనవలు, మనవరాళ్లు శ్రీకాంత్ రెడ్డి రూ.50 వేలు, స్రవంతి రూ.25 వేలు, శ్వేత రూ.25 వేలు కూడా వైద్యశాలకు ఇచ్చినట్టు చెప్పారు. మల్లు వంశీ రూ.50 వేల చెక్కును అందజేశారు. భరత్ వందన సమర్పణ చేశారు. ఎంవీఎస్ఆర్ క్లినిక్ అడ్మినిస్ట్రేటర్ విజయ్ కుమార్ ఆస్పత్రి వార్షిక నివేదికను సమర్పించారు. ఆస్పత్రి ఇన్‌ఛార్జి వీరయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజా వైద్యశాలలో డాక్టర్లు రమాదేవీ, డాక్టర్ లక్ష్మణ్ రావుతో పాటు ఆర్థోపెడిషియన్ డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ సునిత, డాక్టర్ రాజు, డాక్టర్ కీర్తిసుధ, డాక్టర్ చరణ్ సేవలందిస్తున్నారు.

## వస్త్ర పరిశ్రమకు గడ్డుకాలమే..!

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నది. "ఈ రంగం ప్రస్తుతం 20 లక్షల మంది నేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తుంది. భారత సాంస్కృతిక వారసత్వంలో చేనేత రంగం పాత్ర కీలకంగా ఉంది. సంఘటిత రంగంలో 12 లక్షల మంది, సంబంధిత రంగంలో 20 లక్షల మంది పని చేస్తున్నారు. ఈ వర్గాల ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడనుంది. పన్ను రేట్ల పెంపు అధిక ద్రవ్యోల్బణానికి దారి తీయనుంది. హెచ్చు ధరలతో వినియోగం మందగించడం ద్వారా.. వచ్చే పండగ సీజన్‌లో అమ్మకాలు పడిపోనున్నాయి. ఇది ఆర్థిక వ్యవస్థకూ మంచిది కాదు" అని సీఎంఏఐ వివరించింది. "జీఓఎం ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల సవరణలు మొత్తం దుస్తుల పరిశ్రమకు భారీ ముప్పును కలిగించనున్నాయి. ఈ రంగం ఇప్పటికే వినియోగదారుల డిమాండ్ తగ్గుదలను, లాభాల క్షీణత, వర్కింగ్ క్యాపిటల్ సమస్యల వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. రూ.1000 నుంచి రూ.1500 మధ్య కొనుగోళ్లు చేసే బలహీన వర్గాలు, మధ్యతరగతి ప్రజలకు 5 శాతం పన్ను రేటు మద్దతుగా ఉంది. హెచ్చు పన్ను రేట్లు మిగతా వర్గాల వినిమయాన్ని దెబ్బతీయనుంది. ఇది తమ రంగంలోని ఎంఎస్ఎంఈ మూతకు దారి తీయనుంది. ఉపాధి, ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోశిస్తున్న పరిశ్రమను అస్థిరపర్చనుంది. వస్త్ర పరిశ్రమపై ప్రస్తుతం అమలు చేస్తున్న ఒకే పన్ను రేటు 5 శాతం ఆచరణాత్మక పరిష్కారం." అని సీఎంఏఐ ప్రెసిడెంట్ సంతోష్ కటారియా తెలిపారు. పన్ను పెంపు ప్రతిపాదనలు, తదుపరి నిర్ణయాలపై పరిశ్రమ వర్గాలతో చర్చించాలని సీఎంఏఐ చీఫ్ మెంటర్ రాహుల్ మెహత కోరారు.

## పోషకాహారం పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ఘటనలపై ఆరు వారాల్లో పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని కోరింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ(ఏఏజీ) ఇమ్రాన్ ఖాన్ వాదిస్తూ ఇలాంటి ఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. నారాయణపేట్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో రెండు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. 25,941 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మందికి పైగా విద్యార్థులున్నారనీ, వారిలో 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని ఏఏజీ వివరించారు. ఈ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కేంద్ర మార్గనిర్దేశకాల ప్రకారం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందనీ, కానీ క్షేత్రస్థాయిలో ఇలా జరగడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదించారు. విచారణ 6 వారాలకు వాయిదా పడింది.

**హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు : హైకోర్టు**

స్థానిక పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో ఆయనకు ఊరట లభించింది. ఈ కేసు విచారణ జరపవచ్చుననీ, అయితే ఆయనను అరెస్టు చేయరాదని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఏ విధమైన కఠిన చర్యలూ తీసుకోరాదని కూడా చెప్పింది. రాజకీయ దురుద్దేశంతో, కక్షసాధింపుతో రియల్ ఎస్టేట్ వ్యాపారి జి.చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయటాన్ని హరీశ్‌రావు సవాలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. ప్రాథమిక విచారణ, పరిశీలన చేయకుండానే పోలీసులు కేసు నమోదు చేశారన్నారని పిటిషనర్ తరపు లాయర్ వాదించారు. రాధకిషన్‌రావు ద్వారా ఫోన్ ట్యాపింగ్ చేయించారనే ఫిర్యాదుకు ఆధారాలు లేవన్నారు. ఇదే వ్యవహారంపై గౌడ్ గతంలో పిటిషన్ వేసి హైకోర్టు నుంచి వాపస్ తీసుకున్నారని చెప్పారు. పిటిషనర్ కీర్తి, ప్రతిష్టలను దెబ్బతీసేందుకే ఫిర్యాదు చేశారని అన్నారు. చట్ట ప్రక్రియను అమలు చేయడం లేదన్నారు. ఫిర్యాదు చేసిన గౌడ్ తనపై ఎలక్షన్ పిటిషన్ వేశారనీ, ఫోన్ ట్యాపింగ్ పిటిషన్ వేసి వెనక్కి తీసుకున్నారనీ, కేసుపై కేసు పెట్టి ఇబ్బంది పెట్టి అరెస్టు అయితే ప్రతిష్ట దెబ్బతింటుందని చెప్పారు. అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలనీ, కేసు విచారణపై స్టే ఇవ్వాలని కోరారు. అరెస్టు నుంచి మినహాయింపు ఇచ్చిన హైకోర్టు, కేసు విచారణపై స్టేకు నిరాకరించింది. గౌడ్‌కు నోటీసులు ఇచ్చింది. విచారణను ఈ నెలాఖరుకు వాయిదా వేసింది.

# ఇందిరమ్మ ఇండ్ల యాప్ ఇలా..!






## నాలుగు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు

- సత్ఫలితాలతో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- నేటి నుంచి యాప్‌లో అప్లికేషన్ల ప్రక్రియ
- నాలుగు విడతలుగా రూ.5 లక్షలు విడుదల
- దళారుల జోక్యం ఉండదు : మంత్రి పొంగులేటి

**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

ఇందిరమ్మ ఇండ్ల పథకం యాప్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. శుక్రవారం నుంచి ఈ యాప్ అందుబాటులోకి రానుంది. అప్లికేషన్‌ల స్వీకరణ మొదలవుతుంది. రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని పరీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో ఓ గ్రామంతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో యాప్‌ను ఉపయోగించి సర్వే చేశారు. యాప్ పనితీరు మెరుగ్గా ఉండటంతో దీన్ని రాష్ట్రవ్యాప్తంగా ఆచరణలో పెడుతున్నారు. యాప్‌లో 39 అంశాలను జత చేశారు. వీటి ఆధారంగా దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తారు. పరిశీలనానంతరం రూ.5లక్షలను నాలుగు విడతలుగా విడుదల చేస్తారు.

### యాప్‌లో అడిగే వివరాలు..

యాప్‌లో దరఖాస్తుదారు పేరు, ఆధార్‌కార్డు నంబర్, సొంత స్థలం ఉందా? ఆదాయం ఎంత?, గతంలో ఏదైనా గృహపథకంలో లబ్ది పొందారా? ఇంట్లో వివాహిత జంటల సంఖ్య, ఆ ప్రాంతంలో ఎన్నేండ్లుగా నివసిస్తున్నారు, దరఖాస్తుదారు వికలాంగులా?, అనాథలా, ఒంటరి మహిళలా? వితంతువులా? ట్రాన్స్‌జెండర్లా? సఫాయి కర్మాచారులా? బలహీనవర్గాలకు చెందినవారా? తదితర 39 రకాల వివరాలను దరఖాస్తుదారుల ఇండ్లకు వెళ్లి అధికారులు ఆ వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వాటి ఆధారంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తుదారులు అర్హులా? కాదా? అనేది నిర్ధారణ అవుతుంది. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, మొబైల్‌నంబర్, ఎలక్ట్రిసిటీ బిల్లు, అడ్రస్ ప్రూఫ్, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, స్థలానికి సంబంధించిన ఫొటో, జియోకార్డినేట్స్ తదితర ధ్రువీకరణల ఫొటో/ డాక్యుమెంట్లను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

## అర్హతలు, అనర్హతలపై ఆందోళన

### సర్వే అధికారుల విచారణలో..

సర్వే అధికారుల విచారణలో మూడు, నాలుగు చక్రాల వాహనాలు, ట్రాక్టర్ వంటి వ్యవసాయ పరికరాలు, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగా? ఆస్తిపన్ను చెల్లిస్తున్నారా? కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వ పథకం ద్వారా ఇల్లు మంజూరైందా? పరిశీలిస్తారు. ఈ మొబైల్ యాప్ ద్వారా సర్వే ఒకనెలలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలివిడత రేషన్‌కార్డు లేకున్నా ఆదాయ సర్టిఫికెట్ ఆధారంగా వర్తింపజేస్తారు.

### ఎంపిక విధానం..

సర్వే గెజిటెడ్‌స్థాయి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో గ్రామ/వార్డు ఆఫీసర్ల ద్వారా జరుగుతుంది. ఇండ్ల మంజూరులో భూమిలేని వ్యవసాయ కార్మికులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లు, కనీసం గుడిసె కూడా లేనివారికి ప్రాధాన్యం ఇస్తారు. డాక్యుమెంట్ ప్రూఫ్ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం, డాక్యుమెంట్ ప్రూఫ్‌లేని పక్షంలో కరెంట్‌బిల్లు, సంబంధిత అగ్రిమెంట్లనూ సమర్పించాల్సి ఉంటుంది. ఇండ్లను మహిళల పేరుతో మంజూరు చేస్తారు. ఇంటి నిర్మాణం గదులు, వంటగది, మరుగుదొడ్డి కలిగి కనీసం 400 చదరపు అడుగుల్లో స్లాబ్ ఏరియా ఉండాలి. దీనికి ఎలాంటి డిజైన్‌నూ ప్రభుత్వం సూచించటం లేదు. లబ్దిదారులు ఆర్‌సీసీ స్లాబ్‌తో ఇల్లు నిర్మించుకోవచ్చు.

### పారదర్శకత కోసమే యాప్ : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పారదర్శకత కోసమే ఈ యాప్‌ను ప్రవేశపెట్టాం. ఎంపికలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఇది ఉపయోగపడుతుంది. లబ్దిదారుల ఎంపికలో గతంలో లాగా ఎలాంటి అవకతవకలకూ తావుండదు. పకడ్బందీగా ఉండటం కోసమే ఈ మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టాం. ఎంపిక కోసం ఎవరూ ఏ ఒక్కరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. నిబంధనల ప్రకారమే ఎంపిక ఉంటుంది.

### యాప్‌తో రాజకీయ జోక్యం ఉండదంటున్న ప్రభుత్వం

ఇందిరమ్మ ఇండ్ల యాప్‌తో రాజకీయ జోక్యం ఉండదని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను ఎంపిక చేశారు. దీనిలో పంచాయతీ సెక్రటరీ, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్‌తో పాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేవారిని కమిటీల్లో ఎంపిక చేశారు. అయితే ఈ యాప్‌లో పొందుపరిచిన నిబంధనలు పాటిస్తే మాత్రం రాజకీయ జోక్యం ఉండకపోవచ్చు. కానీ వీటిని ఎంత వరకు పరిగణలోకి తీసుకుంటారనేది అనుమానంగానే ఉంది. ఇప్పటికే పలుచోట్ల ఈ కమిటీల ఎంపికపై వివాదాలు నడుస్తున్నాయి. ఎంపిక ప్రక్రియపై అనుమానాలు నెలకొన్నాయి. నిబంధనల్లో మూడు, నాలుగు చక్రాల వాహనాలు ఉంటే అనర్హులుగా పేర్కొనడంతో ఆటో డ్రైవర్లు, కారు ట్యాక్సీ డ్రైవర్ల వంటి వారిలో ఆందోళన నెలకొంది. అయితే ఆదాయాన్ని బట్టే ఎంపిక ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నెలకు రూ.500కు మించి విద్యుత్‌బిల్లు వచ్చేవారిని అనర్హులుగా ప్రకటిస్తారని చెబుతున్నారు.

### నిధుల విడుదల..

లబ్దిదారుల ఎంపిక అనంతరం మొత్తం నాలుగు విడతలుగా రూ.5 లక్షలను విడుదల చేస్తారు. బేస్‌మెట్ లెవల్లో రూ.లక్ష, స్లాబ్ లెవల్‌కు చేరుకున్నాక రూ.లక్ష, స్లాబ్ వేసేందుకు రూ.2లక్షలు, ప్లాస్టింగ్, ఇతరత్రా అన్ని పనులూ పూర్తయ్యాక మరో రూ.లక్ష విడుదల చేస్తారు. లబ్దిదారునికి నచ్చిన రీతిలో ఇంటి నిర్మాణం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టదు.



# ఓపెనర్లుగా కెఎల్ రాహుల్, జైస్వాల్

**ఆడిలైడ్:** భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆడిలైడ్ వేదికగా నేటినుంచి పింక్‌బాల్ టెస్ట్ ప్రారంభం కానుంది. తొలి టెస్ట్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా.. రెండోటెస్ట్‌లోనూ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతుండగా.. మరోవైపు ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు సంక్లిష్ట పరిస్థితుల్లో ఈ టెస్ట్‌కు సిద్ధమైంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్ట్‌లో ఓటమి, గత రెండు సీజన్‌లలోనూ స్వదేశంలో భారత్ చేతిలో ఓటమితో డీలా పడింది. రెండో టెస్టుకు ఒకరోజు ముందే ఆస్ట్రేలియా తుది జట్టును ప్రకటించింది. స్పీడ్ బౌలర్ స్కాట్ బోలాండ్‌కు చోటు దక్కింది. 18 నెలల బ్రేక్ తర్వాత అతను మళ్లీ జాతీయ జట్టుకు ఆడనున్నట్టు కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ తెలిపాడు. అడిలైడ్‌లో డే అండ్ నైట్ టెస్టు కావడంతో.. బోలాండ్‌కు అవకాశం ఇచ్చినట్టు సమాచారం. తొలి టెస్టులో గాయపడ్డ జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో అతడు జట్టులో చేరాడు. ఆల్‌రౌండర్ మార్ష్‌కు వెన్ను నొప్పి ఉన్నా.. అతన్ని రెండో టెస్టుకు అందుబాటులో ఉన్నాడు. కొన్ని రోజుల క్రితం మనూకా ఓవల్‌లో ప్రైమ్‌మినిస్టర్ లెవన్‌తో జరిగిన మ్యాచ్‌లో బోలాండ్ మెరుగ్గా బౌలింగ్ చేశాడు. వికెట్ తీసుకోకున్నా.. బ్యాటర్‌ను కట్టడి చేయగలిగాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా రెండు జట్ల మధ్య అయిదు టెస్టు మ్యాచ్‌లు జరగనుంది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

**నేటినుంచి పింక్‌బాల్ టెస్ట్**
**ఉ.9.30గం॥ల నుంచి**



### మిడిలార్డర్‌లో రోహిత్..

తొలిటెస్ట్‌లో రాణించిన కెఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ రెండోటెస్ట్‌కూ ఓపెనర్లుగా రానున్నట్లు కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. రెండోటెస్ట్ ప్రారంభానికి ముందు జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రోహిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. తొలిటెస్ట్‌లో ఈ జోడీ అద్భుతంగా రాణించిందని, ఆ టెస్ట్‌లో టీమిండియా గెలుపులో వీరి పాత్ర కీలకమైందని తెలిపాడు. తాను రెండోటెస్ట్ బరిలో దిగుతున్నా.. మిడిలార్డర్‌లోనే బ్యాటింగ్‌కు దిగుతానని, ఇందులో ఎలాంటి మార్పుల్లేవని తెలిపాడు.

### జట్లు(అంచనా)...

**ఇండియా:** రోహిత్(కెప్టెన్), కెఎల్ రాహుల్, జైస్వాల్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), నితీశ్‌రెడ్డి, పడిక్కల్, జడేజా/అశ్విన్, బుమ్రా, సిరాజ్, హర్షిత్ రాణా.

**ఆస్ట్రేలియా:** కమిన్స్(కెప్టెన్), ఖవాజా, స్వీనే, లబూషేన్, స్మిత్, హెడ్, క్యారీ(వికెట్ కీపర్), స్టార్క్, లియాన్/ బోలండ్, అబాట్.

# స్కాట్ దెబ్బకు టీమిండియా విల విల

- తొలి వన్డేలో ఆసీస్ మహిళల చేతిలో హర్మన్ సేన చిత్తు

**బ్రిస్బేన్:** ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన తొలివన్డే టీమిండియా ఘోర పరాజయాన్ని చవిచూసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అలెన్ బోర్డర్ స్టేడియంలో గురువారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 5వికెట్ల తేడాతో ఓడింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 100 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ కూడా తడబాటుకు గురైంది. టార్గెట్ 101 పరుగులే కావడంతో.. వికెట్లు పడినా ఆసీస్ ఇబ్బంది పడలేదు. కేవలం 16.2 ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయి ఆసీస్ విజయం సాధించింది. ఓపెనర్లు జార్జియా వోల్ (46), ఫోబ్ లిట్చ్‌ఫీల్డ్ (35) రాణించారు. భారత బౌలర్లలో రేణుకా ఠాకూర్ 3, ప్రియా మిశ్రా 2 వికెట్లు తీశారు. కెరీర్‌లో తొలి వన్డే ఆడుతోన్న ఆసీస్ బౌలర్ మెగాన్ స్కట్ (5/19) ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్ బ్యాటర్లను బెంబేలెత్తించింది. భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ (23) టాప్ స్కోరర్. ఆమెతోపాటు హర్లీన్ డియోల్ (19), హర్మన్ ప్రీత్ కౌర్ (17), రిచా ఘోష్ (14) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఓపెనర్లు ప్రియా పునియా 3, స్మృతీ మంధాన 8, దీప్తి శర్మ 1, సైమా ఠాకూర్ 4, టిటాస్ సధు 2 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్కట్ 5 వికెట్లు.. కిమ్ గార్త్, గార్డెనర్, సదర్లాండ్, అలానా కింగ్ తలో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్కట్‌కు దక్కింది. రెండో వన్డే ఆదివారం(8న) జరగనుంది.



### స్కోర్‌బోర్డు...

**ఇండియా మహిళల ఇన్నింగ్స్:** ప్రియ పూనియా (సి)గార్డినర్ (బి)స్కట్ 3, స్మృతి మంధాన (సి)మూనీ (బి)స్కట్ 8, హర్లిన్ (సి)సథర్లాండ్ (బి)గార్డినర్ 19, హర్మన్‌ప్రీత్ (ఎల్‌బి)సథర్లాండ్ 17, రోడ్రిగ్స్ (బి)కిమ్ గార్త్ 23, రీచా ఘోష్ (సి)కిమ్ గార్త్ (బి)స్కట్ 14, దీప్తి శర్మ (రనౌట్)వారేహామ్ 1, సైమా ఠాకూర్ (సి)లిచ్‌ఫీల్డ్ (బి)స్కట్ 4, టిటాస్ సధు (సి)లిచ్‌ఫీల్డ్ (బి)కింగ్ 2, ప్రియా మిశ్రా (బి)స్కట్ 0, రేణుక (నాటౌట్) 0, అదనం 9. (34.2ఓవర్లలో ఆలౌట్) 100పరుగులు.

**వికెట్ల పతనం:** 1/9, 2/19, 3/42, 4/62, 5/89, 6/92, 7/97, 8/100, 9/100, 10/100

**బౌలింగ్:** స్కట్ 6.2-1-19-5, కిమ్ గార్త్ 8-1-20-1, ఎలీసా పెర్రీ 3-0-13-0, గార్డినర్ 7-0-14-1, సథర్లాండ్ 5-0-13-1, కింగ్ 5-1-18-1.

**ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్:** లిచ్‌ఫీల్డ్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)రేణుక 35, జార్జియా వాల్ (నాటౌట్) 46, ఎలీసా పెర్రీ (సి)రీచా (బి)రేణుక 1, బెత్ మూనీ (సి)రోడ్రిగ్స్ (బి)రేణుక 1, సథర్లాండ్ (సి)మంధాన (బి)ప్రియా మిశ్రా 6, గార్డినర్ (స్టంప్)రీచా (బి)ప్రియా మిశ్రా 8, మెక్‌గ్రాత్ (నాటౌట్) 4, అదనం 1. (16.2ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 102పరుగులు.

**వికెట్ల పతనం:** 1/48, 2/50, 3/52, 4/77, 5/97

**బౌలింగ్:** రేణుక 7-0-45-3, సైమా ఠాకూర్ 3-0-18-0, టిటాస్ సధు 4.2-0-27-0, ప్రియా మిశ్రా 2-0-11-2.

# నవచిత్రం

## 'దసరా' దర్శకుడితో చిరంజీవి సినిమా


నాని, చిరంజీవి, శ్రీకాంత్ ఓదెల

నూతన ప్రతిభను పరిచయం చేయటంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారు.
అలాగే ఈ మధ్యకాలంలో ఆయన ఎక్కువ యువ దర్శకులతోనే సినిమాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మరో యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు.
ఇదొక విశేషమైతే, ఈ చిత్రాన్ని హీరో నాని సమర్పించడం మరో విశేషం. నాని అనానిమస్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఎస్ఎల్‌వి సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. నాని కథానాయకుడిగా 'దసరా' చిత్రాన్ని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించి, ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. అలాగే ఇదే కాంబోలో ఇప్పుడు 'ది పార్యడైజ్' సినిమా చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా చిరంజీవితో శ్రీకాంత్ ఓదెల చేయబోయే ప్రాజెక్ట్‌ను మేకర్స్ అధికారికంగా అనౌన్స్ చేశారు.
ఈ నేపథ్యంలో విడుదలైన అఫీషియల్ పోస్టర్ చిరంజీవి పాత్ర ఇంటెన్స్ తెలియజేస్తూ సినిమా పవర్ ఫుల్ నేచర్‌ని ప్రజెంట్ చేసింది. పోస్టర్‌లోని అద్భుతమైన ఎరుపు రంగు థీమ్ కథకు ప్రధానమైన వైలెన్స్‌ని సూచిస్తుంది. 'హీ ఫైండ్స్ హిజ్ పీస్ ఇన్ వైలెన్స్' అనే కోట్ చిరంజీవి పోషించబోయే ఫెరోషియస్ స్ట్రాంగ్ క్యారెక్టర్‌ని తెలియజేస్తోంది. నానితో దర్శకుడు శ్రీకాంత్ ఒదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం పూర్తయిన తర్వాత ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.

## 'డ్రింకర్ సాయి' రిలీజ్‌కి రెడీ


ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.
ఈ నెల 27న ఈ చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.
టీజర్‌తో పాటు రీసెంట్‌గా రిలీజ్ చేసిన 'బాగి బాగి..' లిరికల్ సాంగ్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది అని మేకర్స్ తెలిపారు. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి, భద్రం, కిర్రాక్ సీత, రీతు చౌదరి, ఫన్ బకెట్ రాజేశ్, రాజ ప్రజ్వల్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఆర్ట్ - లావణ్య వేములపల్లి, కొరియోగ్రఫీ - భాను, మోయిన్, డీవోపీ - ప్రశాంత్ అంకిరెడ్డి, ఎడిటింగ్ - మార్తాండ్ కె వెంకటేష్, లైన్ ప్రొడ్యూసర్ - లక్ష్మీ మురారి, మ్యూజిక్ - శ్రీ వసంత్, లిరిక్స్ - చంద్రబోస్, ప్రొడ్యూసర్స్ - బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్, రచన, దర్శకత్వం - కిరణ్ తిరుమలశెట్టి.


భూమిక, గుణశేఖర్

## 'యుఫోరియా' కోసం మరోసారి..

వైవిధ్యమైన, భారీ సినిమాలకు కేరాఫ్ దర్శకుడు గుణశేఖర్. ప్రస్తుతం ఆయన యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా'తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సమాజంలో జరుగుతున్న దురాగతాలపై తెరకెక్కుతోన్న సినిమా అని అనౌన్స్ చేసినప్పటి నుంచి అందరిలోనూ సినిమా పై ఆసక్తి మరింత పెరిగింది. ఇటీవల విడుదలైన మూవీ గ్లింప్స్‌తో సినిమాపై ఉన్న అంచనాలు నెక్స్ట్ రేంజ్‌కు చేరుకున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. రీసెంట్‌గా ఫస్ట్ షెడ్యూల్ చిత్రీకణ పూర్తయ్యింది.
అదే యుఫోరిక్ ఎనర్జీతో మేకర్స్ ఇప్పుడు సెకండ్ షెడ్యూల్ షూటింగ్‌ను స్టార్ట్ చేశారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించిన స్పెషల్ అప్‌డేట్ ఇస్తూ సెట్స్ నుంచి ఓ స్పెషల్ వీడియోని విడుదల చేశారు.
ఈ వీడియోలో భూమిక సెట్స్‌లో కనిపించారు. ఆమె మేకప్ వేసుకోవటం, షూటింగ్‌లో పాల్గొనటం వంటి సన్నివేశాలను ఈ వీడియోలో చూడొచ్చు. ఆమె రాకతో ఆ సెట్స్‌కు మరింత ఉత్సాహం వచ్చింది. ఈ గ్లింప్స్ వీడియోలో డైరెక్టర్ గుణశేఖర్‌ని మనం గమనించవచ్చు. 20 ఏండ్ల క్రితం గుణ శేఖర్, భూమిక సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ 'ఒక్కడు' మూవీలో కలిసి పని చేశారు. ఈ సినిమా కోసం మరోసారి ఈ బ్లాక్ బస్టర్ కాంబో చేతులు కలిపింది. భూమికను దృష్టిలో ఉంచుకుని గుణశేఖర్ ఓ పవర్‌ఫుల్ రోల్‌ను క్రియేట్ చేశారు. ఇప్పుడు విడుదల చేసిన గ్లింప్స్ చూస్తుంటే పవర్‌ఫుల్ రోల్‌లో భూమిక ఎలా మెప్పించనున్నారోనని ఆసక్తి మరింత పెరిగింది అని చిత్ర యూనిట్ తెలిపింది. సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లికితా యలమంచిలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత, సాయిశ్రీనికా రెడ్డి, ఆశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ రెడ్డి, లికిత్ నాయుడు తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు.
గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రాగిణి గుణ సమర్పణలో ఈ చిత్రాన్ని నీలిమ గుణ నిర్మిస్తున్నారు. ప్రవీణ్ కె.పోతన్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి ప్రవీణ్‌పూడి ఎడిటర్. కాల భైరవ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

'యూఫోరియా' సినిమాతో మరోసారి దర్శకుడు గుణశేఖర్‌తో కలసి పని చేయటం చాలా ఆనందంగా ఉంది. 20ఏండ్ల క్రితం ఆయనతో నేను చేసిన 'ఒక్కడు' సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అప్పటికే ఆయన చాలా పెద్ద దర్శకుడు. భారీ భారీ సెట్స్‌లో సినిమాలు చేస్తారు. 'ఒక్కడు' సినిమాకి కూడా ఛార్మినార్ సెట్ వేశారు. ఆ సెట్‌లో పని చేయటం మరచిపోలేని అనుభూతి. అలాగే నటీనటుల దగ్గర్నుంచి తనకు కావాల్సిన నటనను ఎలా రాబట్టుకోవాలో గుణశేఖర్‌కి బాగా తెలుసు. ప్రతి విషయంలోనూ చాలా క్లారిటీగా ఉంటారు. కేవలం సెట్స్ విషయంలోనే కాదు ఆర్టిస్టుల కాస్ట్యూమ్స్ విషయంలోనూ ఆయన చాలా కేర్ తీసుకుంటారు. ఇక 'యూఫోరియా'లో నేను చాలా మంచి పాత్ర చేస్తున్నా. ఈ పాత్ర కోసం గుణశేఖర్ నన్ను ఎంపిక చేసుకోవడం చాలా హ్యాపీగా అనిపించింది. ఇన్నేండ్ల తర్వాత మళ్ళీ ఆయనతో పని చేసే అవకాశం రావడం అదృష్టం. ఈ సినిమాలో నా పాత్ర మిమ్మల్ని కచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తుంది.

\- భూమిక

## భిన్న ప్రేమకథ


దీపక్ సరోజ్, అనైరా, వేణు ఊడుగుల

ఎన్నో సినిమాలలో బాల నటుడిగా అలరించి, 'సిద్దార్థ రాయ్' సినిమాతో హీరోగా మారి ప్రేక్షకులను మెప్పించారు దీపక్ సరోజ్.
ఆయన హీరోగా రొమాంటిక్ కల్ట్ లవ్ స్టోరీ జోనర్ సినిమా ప్రారంభమైంది. శ్రీ లక్ష్మీనరసింహ ఆర్ట్స్ ప్రొడక్షన్ పతాకంపై నెం.1 ప్రాజెక్ట్‌గా గురువారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో వైభవంగా ఆరంభమైంది. హరీష్ గదగాని దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంతో తన్నీరు హరిబాబు నిర్మాతగా మారుతున్నారు. దీక్షిక, అనైరా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో రఘుబాబు, హైపర్ ఆది, సత్య, యూట్యూబర్ పుంజు, యాదమ్మ రాజు, రచ్చ రవి తదితరులు ఇతర కీలక పాత్రలలో నటిస్తున్నారు.
ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా దర్శకులు వేణు ఊడుగుల, ప్రదీప్ మద్దాలి, 'కమిటీ కుర్రాళ్ళు' ఫేమ్ యదు వంశీ , 'క' ఫేమ్ సుజిత్-సందీప్, సందీప్ సరోజ్, భరత్ పెద్దగాని, ఉదయ్ శర్మ, వంశీ చాగంటి, హైపర్ ఆది, రచ్చ రవి హాజరయ్యారు.
పూజా కార్యక్రమాల అనంతరం ఈ సినిమా స్క్రిప్ట్‌ని ప్రదీప్ మద్దాల, యదువంశీ అందించగా, వేణు ఊడుగుల క్లాప్ కొట్టారు. సుజిత్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఫస్ట్ షాట్‌కి సందీప్ డైరెక్షన్ చేశారు.
ఈ సందర్భంగా డైరెక్టర్ హరీష్ మాట్లాడుతూ, 'దర్శకుడిగా ఇది నా మొదటి సినిమా. కథ చెప్పగానే నిర్మాత వెంటనే మొదలుపెడదాం అన్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. ఇది కంప్లీట్ లవ్ జోనర్ సినిమా. రొమాంటిక్ కల్ట్ లవ్ స్టోరీగా ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. జనవరిలో మొదలుపెట్టి, ఏప్రిల్‌లో ముగించాలని ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'సిద్దార్థ రాయ్' సినిమా తర్వాత ఈ చిత్ర డైరెక్టర్ హరీష్ ఒక మంచి ప్రేమ కథ చెప్పారు. దీనికి అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. మా నిర్మాత హరిబాబుకి ఇది మొదటి సినిమానే అయినా ఆయన చాలా కాలం ఇక్కడ ఉంటారని నాకు అనిపించింది' అని హీరో దీపక్ సరోజ్ చెప్పారు.
హీరోయిన్ అనైరా మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నాను. మా దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. మేం మా బెస్ట్ టీంతో ఎంటర్టైనింగ్ ధమాకా ప్యాకేజ్ సినిమా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు.

నేను 20 ఏండ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను. సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో లక్ష్మీనరసింహ ఆర్ట్స్ అనే బ్యానర్ స్థాపించాను. ఈ సినిమాతో నిర్మాతగా ప్రేక్షకులకు పరిచయం అవుతున్నాను. ఈ సినిమా కథ విన్న వెంటనే నాకు బాగా నచ్చి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. మా సినిమాకు సంగీతం సమకూర్చడానికి ముందుకొచ్చిన అనూప్, సినిమాటోగ్రఫీ అందిస్తున్న సురేష్‌కి ధన్యవాదాలు. ఇదొక భిన్న ప్రేమకథ. ఈ కథ నచ్చి ఇందులో నటిస్తున్న నాయకానాయికలు దీపక్ సరోజ్, అనైరాకు మంచి పేరు రావడం ఖాయం

\- నిర్మాత హరిబాబు


ఐశ్వర్య గౌడ

## 'ఏ రోజైతే చూశానో నిన్ను'..

మహేష్ బాబు, నాగార్జున, రవితేజ వంటి ప్రముఖ కథానాయకులతో ఎన్నో విజయవంతమైన సినిమాలను అందించిన ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ, రాస్ర ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా రూపొందిస్తున్న నూతన చిత్రం 'ఏ రోజైతే చూశానో నిన్ను'.
ఈ చిత్రం ద్వారా ఇద్దరు బాల నటీనటులు నాయకానాయికలు పరిచయం అవ్వడం విశేషం.
స్క్రీన్ ప్లే, విజువల్ ఎఫెక్ట్స్‌లో సుపరిచితుడైన రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ద్వారా 'చెక్, బుర్రకథ, రంగ రంగ వైభవంగా' వంటి సినిమాల్లో చైల్డ్ హీరోగా నటించి మెప్పించిన భరత్ రామ్ హీరోగా పరిచయమవుతున్నారు.
అలాగే 'ఛార్లీ 777, జాగ్వార్' లాంటి పలు కన్నడ చిత్రాల్లో నటించి, బాలనటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య గౌడ ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఈ విషయాన్ని తాజాగా నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.
ఈ నెలలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886